ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఎల్ఐసిలో రూ.10వేల కోట్ల వాటా విక్రయం 07

తడిసిన ధాన్యమంతా కొంటాం : మంత్రి ఉత్తమ్

త్వరలో ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికలు : మంత్రి పొన్నం 03

సంపుటి 09, సంచిక: 178 | గురువారం | 28-05-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు బక్రీద్ శుభాకాంక్షలు

**సెలవు**

బక్రీద్ సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి గురువారం సెలవు. శుక్రవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

– ఎడిటర్

## కేరళ మాజీ సిఎం

# విజయన్ నివాసంపై ఇడి దాడులు

సిపిఐ(ఎం) కార్యకర్తల నిరసనతో తీవ్ర ఉద్రిక్తత

ఢిల్లీలో నిరసన చేస్తున్న ఎం.ఎ.బేబీ అరెస్ట్

ఉద్దేశ్యపూర్వక ఘటన : విజయన్

తమ వాహనాలపై దాడి చేసారని ఇడి ఫిర్యాదు

రాజకీయ కక్ష సాధింపు చర్య : సిపిఐ విమర్శ

తమిళనాడు మాజీ సిఎం స్టాలిన్ ఖండన



ఇడి సోదాల తరువాత నివాసం వెలుపలికి వచ్చిన విజయన్

**తిరువనంతపురం:** కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుటుంబసభ్యులకు సంబంధించి వివిధ ప్రాంతాల్లోని నివాసాలపై కేంద్ర సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) బుధవారం దాడులు నిర్వహించింది. భారీ సన్నాహాలతో ఇడి అధికారులు బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో రహస్యంగా సోదాలు ప్రారంభమయ్యాయి. తిరువనంతపురంలోని పినరయి విజయన్ అద్దె నివాసం, కన్నూర్‌లోని ఆయన కుటుంబ నివాసంలో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. ఆసమయంలో విజయన్, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నారు.విషయం తెలిసిన వెంటనే పెద్ద ఎత్తున సిపిఐ(ఎం) కార్యకర్తలు విజయన్ నివాసం వద్దకు చేరుకొని, ఇడి, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు లోపలికి చొచ్చుకుపోయేందుకు ప్రయిత్నించటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు జోక్యం చేసుకుని, కార్యకర్తలకు నచ్చజెప్పారు. సుమారు ఆరున్నర గంటల పాటు విజయన్ నివాసంలో సోదాలు జరిగాయి. విజయన్ కుమార్తె వీణకు చెందిన ఎక్సాలాజికల్ సొల్యూషన్స్‌కు కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్) నుంచి నిధులు వచ్చాయనే కేసులో ఇడి సుదీర్ఘ విరామం తర్వాత వారి నివాసాలపై దాడులను పునఃప్రారంభించింది. విజయన్ నివాసాలలో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12 ప్రాంతాల్లో ఈ దాడులను నిర్వహించారు. పినరాయి విజయన్ కుమార్తె, ఎక్సాలాజిక్ అధిపతి వీణా విజయన్ నివసిస్తున్న తిరువనంతపురంలోని నివాసంతో పాటు, బేపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్‌కు చెందిన కోజికోడ్‌లోని నివాసలోనూ ఇడి బృందం సోదాలు నిర్వహించింది. సిఎంఆర్ఎల్ ప్రమోటర్ల ఇళ్లు, అనుబంధ కార్యాలయాలు కూడా సోదాలు నిర్వహిస్తోంది. సాయుధ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) సిబ్బంది భద్రత మధ్య ఈడీ అధికారులు బుధవారం తెల్లవారుజామున సోదాలు ప్రారంభించారు. తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్‌లో విజయన్ ఇటీవల అద్దెకు తీసుకున్న ఇంటితో పాటు పలు ప్రాంగణాలను అధికారులు దిగ్బంధించారు. సోదాలు జరుగుతున్న సమయంలో పినరాయి విజయన్, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నారు.పినరయి విజయన్ అద్దె నివాసంలో ఇడి అధికారులు సోదాలు పూర్తి చేసుకుని వెళ్తుండగా, వారి వాహనాలపై దాడులు జరిగాయి. దీనిపై ఇడి బృందం థంపనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విజయన్ ఇంట్లో సోదాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి, పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారాట్, మరియం ధావలే, విజ్జూ కృష్ణన్‌ను పోలీసులు తరువాయి 8లో

## నేడు సిద్ధరామయ్య

# రాజీనామా?

ఉదయం పదిన్నరకు గవర్నర్‌తో అపాయింట్‌మెంట్

నేడు ఎంఎల్‌ఏలకు అల్పాహార విందు

30న డికె ప్రమాణం



తొలిప్రధాని నెహ్రూ వర్ధంతి సందర్భంగా బుధవారం కర్నాటక విధాన సౌధలో నివాళి అర్పిస్తున్న సిఎం సిద్ధరామయ్య

**బెంగళూరు :** కర్నాటకలో ముఖ్యమంత్రి మార్పుపై జోరుగా ఊహాగానాలు చెలరేగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం ఉదయం గవర్నర్‌ను కలిసేందుకు సమయం కోరారు. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేయనున్నట్లు భావిస్తున్నారు. ఢిల్లీలో మంగళవారం హైకమాండ్‌తో చర్చల అనంతరం సిద్ధరామయ్య అర్ధరాత్రి బెంగళూరుకు చేరుకున్నారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం విధానసౌధలో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి సిద్ధరామయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజీనామా గురించి మీడియా అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ 'నేను రేపు మాట్లాడతాను' అని చెప్పారు. ఆయన కాంగ్రెస్ ఎంఎల్‌ఏలకు గురువారం ఉదయం అల్పాహార విందు ఇవ్వనున్నారు. కాగా, తన మూడేళ్ళ పరిపాలనలో విజయాలను గుర్తు చేస్తూ సిద్ధరామయ్య బుధవారం నాడు తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేయడం ద్వారా రాజీనామాకు తరువాయి 8లో

# త్యాగనిరతి, దైవభక్తికి ప్రతీక బక్రీద్

సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

త్యాగనిరతి, దైవభక్తికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) పండుగ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం చేయడానికి సిద్ధపడిన గొప్ప సంఘటనను స్మరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని సిఎం గుర్తు చేశారు. బక్రీద్ పండుగ మనిషికి త్యాగం, దాతృత్వం, విశ్వాసం, మానవత్వం వంటి గొప్ప విలువలను గుర్తుచేస్తుందని అన్నారు. తమకు ఉన్నదానిలో కొంతైనా అవసరమైన వారికి పంచిపెట్టడం కన్నా గొప్ప దానం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ ప్రపంచానికి చాటిచెబుతోందని సిఎం రేవంత్ రెడ్డి ఒక సందేశంలో పేర్కొన్నారు.

# తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై చర్చిద్దాం

## మహారాష్ట్ర సిఎంకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై చర్చించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాల్సి ఉంది.మొదటి ప్రతిపాదనలో ఈ బ్యారేజ్ 152 మీటర్ల ఎత్తు నిర్మించాలనుకున్నారు. 2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని సిఎం రేవంత్ రెడ్డి తన లేఖలో ప్రస్తావించారు. 148 మీటర్ల కంటే కొంత ఎక్కువ ఎఫ్ఆర్ఎల్ పరిశీలించినా, మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని సిఎం వివరించారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీటిని తెచ్చుకునే వీలుందని సిఎం రేవంత్ రెడ్డి లేఖలో ప్రస్తావించారు.

గత బిఆర్ఎస్ కంటే తక్కువ ఇళ్లు కడితే

# ఎమ్మెల్యేగా పోటీ చేయను

కెటిఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్



ప్రజాపక్షం/హైదరాబాద్

వచ్చే రెండున్నరేళ్లలో హైదరాబాద్‌లో బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మించకపోతే తాను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయబోనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. అదే జరిగితే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా ఎన్నికలకు దూరంగా ఉంటారా అని ఆయన సవాల్ విసిరారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌లతో కలిసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంపై రాజకీయ విమర్శలకు తాము పనితోనే సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. డ్రామాలు కాదు పేదల జీవితాల్లో మార్పే మా సమాధానం అని వ్యాఖ్యానించారు. ఒఆర్ఆర్ ఇన్నర్ పరిధిలోని క్యూర్ ఏరియాలో తరువాయి 8లో

**నగరంలో లక్ష గృహాలు**

మంత్రి అజారుద్దీన్, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి స్థలాల పరిశీలన 08

## సింగరేణి సమస్యలు పరిష్కరించకుంటే

# సమ్మె తప్పదు

కార్మికుల సమస్యలను యాజమాన్యం జూన్ రెండోవారంలోపు పరిష్కరించాలి

మీడియా సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్యే కూనంనేని

పెట్రో ధరల పెంపుపై పెద్ద ఎత్తున నిరసనలకు పిలుపు

సంక్షోభం పేరుతో సామాన్య ప్రజలపై కేంద్రం భారం మోపడం సరికాదని ఆగ్రహం

కార్పొరేట్ సంస్థలపై పన్నులు పెంచి పేదలపై భారం తగ్గించాలని డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణి కార్మికుల సమస్యలను యాజమన్యం జూన్ రెండోవారంలోపు పరిష్కరిచాలని, లేనట్లయితే సమ్మె తప్పదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ స్పష్టం చేసింది. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎం ఎల్ ఎ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు, యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్‌లు మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ గుండెకాయగా రాష్ట్రానికి సిరులను కురిపించే సింగరేణి సంస్థను ప్రభుత్వం అన్ని విధాలుగా పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి ఈ రెండు వీడదీయరానివని, కానీ ప్రభుత్వం లాభాలు తప్ప కార్మికుల శ్రేయస్సును ఎంతమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ద్వారా సింగరేణికి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను చెల్లించకుండా గతంలో ఆర్‌టిసిని బలిపశువును చేసినట్లే ఇప్పుడు సింగరేణిని కూడా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఎప్పుడు లాభాలలో ఉండే సింగరేణికి నష్టాలు రావడానికి గల కారణాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. సింగరేణిలో నిత్యం పర్మినెంట్ కార్మికులను తగ్గిస్తూ కాంట్రాక్టు కార్మికులకు తక్కువ జీతాలు చెల్లిస్తూ వెట్టి చాకిరీ చేయించుకోవడం సరికాదని, కోల్ ఇండియా తరహాలో సింగరేణిలో వేతనాలు చెల్లించాలన్నారు. సింగరేణిలో పనిచేసే కార్మికులను ఆరోగ్య సమస్యలు ఎప్పుడు వెంటాడుతుంటాయని, ఈ నేపథ్యంలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ ద్వారా తమ వారసులకు ఉద్యోగ కల్పన జరిగేదని, కానీ తరువాయి 8లో

'జనాభా మార్పుల'పై ఉన్నతస్థాయి కమిటీపై

# కేంద్రం నిర్ణయం ఆక్షేపణీయం

సిపిఐ తీవ్ర ఖండన

**న్యూఢిల్లీ :** దేశంలో 'అసహజ జనాభా మార్పులను' పరిశీలించడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం సిపిఐ ఇక్కడొక ప్రకటన విడుదల చేసింది. 'హిందూ రాష్ట్రం' సృష్టించాలన్న ఆర్‌ఎస్ఎస్ కుటిల ఆలోచనలో భాగంగా ఇది మరొక ముందడుగు అని సిపిఐ ధ్వజమెత్తింది.ఈ విభజనవాద, నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య శక్తులు, పౌర సమాజ సంస్థలు, భారత ప్రజలు ఏకం కావాలని సిపిఐ పిలుపును ఇచ్చింది. పౌరసత్వాన్ని ప్రశ్నించడం, వర్గాల జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేయడం లక్ష్యంగా పెట్టుకున్న అన్ని కార్యక్రమాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది. మతపరమైన విభజనను మరింత తీవ్రతరం చేయడానికి, సమాజంలోని మైనారిటీలు, అణగారిన వర్గాలలో భయాన్ని సృష్టించడానికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మరో కుటిల ప్రయత్నం ఇది అని సిపిఐ నిప్పులు చెరిగింది. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), ప్రతిపాదిత నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్ఆర్‌సి), ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వంటి కొనసాగుతున్న వివక్షాపూరిత చర్యల వెనక ఉన్న రాజకీయ కొనసాగింపుగానే ఈ చర్యను భావిస్తున్నట్లు పార్టీ స్పష్టం చేసింది. జనాభా సంబంధిత ఆందోళనల ముసుగులో, ప్రభుత్వం మరోసారి లక్షలాది మంది భారతీయుల పౌరసత్వ హక్కులను లాక్కోవాలని ప్రయత్నించడంపై మండిపడింది. మైనారిటీలను ముఖ్యంగా ముస్లింలను, అణగారిన వర్గాలను 'జనాభా ముప్పు'గా చిత్రీకరించడానికి తరువాయి 8లో

# క్వాడ్ ఘర్షణల పుట్ట

ఇది ఆసియా నాటో కూటమి

మా ఎదుగుదలను అడ్డుకునేందుకే పుట్టింది

ఘాటుగా స్పందించిన చైనా



**బీజింగ్:** పొరుగుదేశ సముద్రప్రాంత వ్యవహారాలలో జోక్యం మానుకోవాలని క్వాడ్ దేశాలను చైనా కోరింది. ఈ విధమైన ప్రత్యేక కూటమి (క్వాడ్) ఏర్పాటును తాము వ్యతిరేకిస్తున్నామని ఇది ఘర్షణలతో కూడుకున్నదని స్పష్టం చేసింది. తూర్పు,దక్షిణ చైనా సముద్రంలో ఏర్పడుతున్న పరిస్థితులపట్ల క్వాడ్ మంత్రుల సమావేశం ఆందోళన వ్యక్తం చేయడంపై చైనా తీవ్రంగా స్పందించింది. తూర్పుచైనా, దక్షిణ చైనా సముద్ర ప్రాంతాలలో పరిస్థితులు సాధారణంగా స్థిరంగా ఉన్నాయని చైనా తరువాయి 12లో

# 'సర్' సరైందే

ఈ ప్రక్రియను నిలిపివేయలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

బిహార్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్‌ను సమర్థిస్తూ తీర్పు



**న్యూఢిల్లీ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు భారత అత్యున్నత న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణ సవరణ ప్రక్రియకు భిన్నంగా ఉందన్న కారణంతో ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బిహార్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయవర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి నేతత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం1950 ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయని పేర్కొంది. 'ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలనే రాజ్యాంగ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉందని భావిస్తున్నాం. ఈ ప్రక్రియ ప్రస్తుత ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడం లేదు. అంతేకాకుండా తరువాయి 12లో

2031 దాకా సార్థక్ పిడిఎస్

# రేషన్ పొడిగింపు

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ:** సార్థక్ పిడిఎస్ రేషన్ సరఫరా పథకం 2031 వరకు కొనసాగింపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 16వ ఆర్థిక సంఘం కాలంలో ఈ పథకానికి 25,530 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. 80 కోట్ల మంది ప్రజలకు రేషన్ సరఫరా అవుతుంది. ఈ పథకాన్ని అంబ్రెలా స్కీమ్‌గా కొనసాగించనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆహార భద్రతా చట్టం కింద రేషన్ సరఫరా జరుగుతుంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆహార ధాన్యాల అంతర్రాష్ట్ర రవాణా, నిర్వహణ ఖర్చులు, ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ల మార్జిన్ ఖర్చుల భర్తీకి కేంద్ర సహాయ నిబంధనల్లో మార్పులు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న కేంద్ర సహాయ నిధుల విధానాన్ని కొనసాగించనున్నారు. ఈ పథకం కింద ప్రస్తుతం అమల్లో ఉన్న రెండు పథకాలను ఏకీకృతం చేశారు. వాటిలో ఒకటి జాతీయ ఆహార భద్రత చట్టం కింద రాష్ట్ర సంస్థలకు ఆహార ధాన్యాల రవాణా, తరువాయి 8లో

# ప్రజానాట్యమండలి నూతన కార్యవర్గం



అధ్యక్షుడు కె.శ్రీనివాస్ | ప్రధానకార్యదర్శి పల్లె నర్సింహ

ప్రజాపక్షం హైదరాబాద్

తెలంగాణ ప్రజా నాట్యమండలి గౌరవ అధ్యక్షులుగా కవ్వంపల్లి స్వామి, అధ్యక్షులుగా కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పల్లె నరసింహ ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ఉపాధ్యక్షులుగా కన్నం లక్ష్మీనారాయణ, ఆరెల్లి రవి, వి.కొండలరావు, సంయుక్త కార్యదర్శిగా రేగుంట చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా బి.జగన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కేతరాజు ఉప్పలయ్య, కోశాధికారిగా పడాల నళిని ఎన్నికయ్యారు.

# విలువ కోల్పోతున్న అధ్యక్షుడు ట్రంప్

ఇరాన్‌తో శాంతి ఒడంబడిక విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిలకడలేనితనం, తిరకాసుమాటలు ఆయన అలంకరించిన అత్యున్నత పదవి పరువు తీస్తున్నవి. 'ఇదిగిదుగో ఒప్పందం – దగ్గర్లోకి వచ్చింది' అన్న నోటితోనే దాన్ని సంక్లిష్టం చేయగల సామర్థ్యం కూడా ఆయనకే ఉంది. ఒకవైపు కాల్పుల విరమణ అమలులో ఉండగానే, గల్ఫ్‌లో తమ రక్షణ బలగాల ఆత్మరక్షణ పేరుతో ఇరాన్ సైనిక వ్యవస్థలపై బాంబుల వర్షం కురిపించగల కుటిలబుద్ధి ఆయనది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి వైమానిక దాడులు జరిపి ఇరాన్ సుప్రీంనేత అయతుల్లా అలీ ఖమేనీ తదితరులను హత్య చేశాడు. అంతకు ముందురోజుల్లో ఒమన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్‌తో ఒప్పందంపై సంతకాలకు సిద్ధమైన ఈ పెద్దమనిషి, ఆ దుర్దిన అర్ధరాత్రి విమాన బాంబుదాడులకు పాల్పడి ఆ ఒప్పందాన్ని భగ్నం చేయటంలోనే కుటిలనీతి ఉంది. అక్కడినుంచి రెండు నెలలపాటు ఇరాన్‌తో భీకరమైన గగనతల యుద్ధం. ఈ దుర్మార్గపు యుద్ధంలో తొలి లక్ష్యం ఇరాన్‌ను సైనికంగా దెబ్బతీసి ప్రభుత్వాన్ని మార్చటం. ట్రంప్ ఇరాన్ ప్రజలను రెచ్చగొట్టినా అది సాధ్యం కాలేదు. రోజుల్లోనే లక్ష్యం నెరవేరుతుందనుకుని ఇజ్రాయెల్ మాటలు నమ్మి ట్రంప్ అప్రకటిత యుద్ధంలో దిగితే ఎదురుదెబ్బలు, అవమానాలు తప్పలేదు. రెండోవైపున, హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయటంతో క్రూడ్ ఆయిలు సరఫరాలు నిలిచిపోయి ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ లు విలవిలలాడుతున్నాయి. ఆయిలు అలభ్యత, ధరల పెరుగుదలతో ఇంటాబయట ఒత్తిడి పెరగటంతో మే 8న ట్రంప్ ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించి, ఇరాన్ లొంగి రావటానికి గడువులమీద గడువులు పెట్టి – ఆ దేశాన్ని భూగోళంనుంచి నిర్మూలిస్తానంటూ బీరాలు పలికారు. ఇంతలో మధ్యవర్తుల సంధి ప్రయత్నాలు. ఒక దఫా పాకిస్థాన్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధుల పరోక్ష (నోట్స్ మార్చుకోవటం) చర్చలు – అసంపూర్తి.

సైనిక శక్తితో ఇరాన్‌ను బెదిరించి లొంగదీసుకోవటం – తమకు (ఇజ్రాయెల్‌కూ) అనుకూలమైన ఒప్పందం సాధించటం, పశ్చిమాసియాను అమెరికా పతాకం నీడకిందకు తెచ్చుకోవటం – ట్రంప్ వ్యూహం. కాని ఇరాన్ కొరకరాని కొయ్య అని తెలుసుకోవటానికి ఆయనకు సమయం పట్టింది. ఇప్పుడు రాయి తీలైనా రాబట్టి పరువుకాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నాడు. ఒప్పందం అతిదగ్గరలో ఉందని ప్రకటించిన ట్రంప్ మహాశయుడు, మౌలిక అంశాలపై ఎట్టి అంగీకారం కుదరలేదని ఇరాన్ ప్రకటించగానే ఇరాన్ క్షిపణి వసతులపై మళ్లీ బాంబులు వేశాడు. అదే సమయంలో ఇజ్రాయెల్‌తో శాంతి, సహజీవనానికి ఉద్దేశించి 2020లో తాను కుదిర్చిన అబ్రహం ఒడంబడికపై అరబ్, ముస్లిం రాజ్యాలు సంతకాలు చేస్తేనే ఇరాన్‌తో ఒప్పందం అనే పిడుగుపడేశాడు. మౌలికమైన పాలస్తీనా పితృదేశం స్థాపన అంశాన్ని పక్కకునెట్టి ఇజ్రాయెల్‌తో స్నేహం, శాంతికి అరబ్, ముస్లిం రాజ్యాలన్నీ ముందుకు రావటం సాధ్యమా? 2023 అబ్రహం ఒడంబడికపై యుఎఇ, బహ్రైన్ సంతకాలు చేశాయి. ఖతార్, సౌదీ అరేబియా, ఈజిప్టు, జోర్డాన్‌లతోపాటు పాకిస్థాన్, తర్కుయే (టర్కీ) విధిగా సంతకం చేయాలని ట్రంప్ షరతుపెట్టాడు. ఇది ఇరాన్‌తో ఒప్పందం కోరుకునే లక్షణమా? తమ షరతులకు ఇరాన్ తలొగ్గేటట్లు అరబ్, ముస్లిం రాజ్యాల ద్వారా ఒత్తిడి పెంచే దుర్లక్షణమా? బెదిరించి లొంగదీసుకునే దుష్ట సామ్రాజ్యవాద రాజ్యనీతి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది.

అమెరికా కోరుతున్నదేమిటి? హోర్ముజ్ జలసంధిపై అంతర్జాతీయ పర్యవేక్షణ, స్వేచ్ఛా రవాణా. ఇరాన్ అణుబాంబు తయారు చేయరాదు. అందుకుగాను తనవద్దనున్న శుద్ధిచేసిన యురేనియం నిల్వను అమెరికాకు లేదా అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అప్పగించాలి. అంతర్జాతీయ నౌకాయానంపై హోర్ముజ్ వద్ద ఇరాన్ సుంకం విధించరాదు. ఇరాన్ వాదనః అమెరికా తమ దురాక్రమణ యుద్ధం ద్వారా కలుగజేసిన విధ్వంసానికి పరిహారం, అమెరికా స్తంభింపజేసిన తమ ఆస్తుల విడుదల, హోర్ముజ్ భద్రత యంత్రాంగంపై తమ అథారిటీని గుర్తించటం, శాంతియుత ప్రయోజనాలకు అణుశుద్ధి కార్యక్రమం చేబట్టేందుకుగల సర్వసత్తాక హక్కును ఎట్టి పరిస్థితుల్లో విడనాడబోము.

అయితే పైకి ఈ గంభీర ప్రకటనలు వెలువడుతున్నా ఒక తాత్కాలిక చట్రంపై చర్చలు జరుగుతున్నట్లు వాషింగ్టన్, ఇస్లామాబాద్, గల్ఫ్ రాజధానుల నుంచి బహుళ దౌత్యవర్గాలనుంచి వెల్లడవుతున్నది. దాని ప్రకారం అంతర్జాతీయంగా పర్యవేక్షణ షరతుల కింద ఇరాన్ హోర్ముజ్ తెరుస్తుంది. అమెరికా కొన్ని ఆంక్షలు సడలిస్తుంది. 100 నుంచి 123 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విదేశాల్లో అమెరికా స్తంభింపజేసిందని అంచనా. ఇరాన్–అమెరికా యుద్ధం ముగింపును ఉద్దేశించి 14 అంశాల అవగాహన పత్రంపై చర్చలు జరుగుతున్నట్లు, ఆ పత్రం ప్రకటనతోపాటు 24 బిలియన్ డాలర్లు విడుదల చేస్తారని చెప్పబడుతున్నది.

ఒప్పందం కోసం ట్రంప్ ఆతృత ఆయన ప్రకటనల్లో కనిపిస్తున్నది. దేశీయంగా ఇంధన ధరలు పెరుగుదల, మార్కెట్లు అస్థిరత అమెరికన్‌లలో అసంతృప్తి, ఆగ్రహం పెంచుతున్నది. యుద్ధ లక్ష్యాలపై స్పష్టత లేకుండా యుద్ధానికి ఎందుకు దిగారు అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అమెరికన్ కాంగ్రెస్‌కు మధ్యంతర ఎన్నికలకు (నవంబర్) ముందు పశ్చిమాసియా యుద్ధం విస్తృతమైతే ట్రంప్ రిపబ్లికన్‌లకు పరాజయాలు తప్పవు. అందువల్ల త్వరగా ఒప్పందంకోసం రిపబ్లికన్‌లు ఒత్తిడి చేస్తున్నారు. ప్రపంచం తీవ్రమైన ఇంధన షాక్‌లో (రెడ్‌జోన్) ప్రవేశిస్తున్నదని అంతర్జాతీయ ఎనర్జీ ఏజన్సీ ఇప్పటికే హెచ్చరించింది. అందువల్ల ట్రంప్ మతిస్థిమితం లేని ప్రకటనలు మాని గౌరవప్రదమైన ఒప్పందం ద్వారా బయటపడి, ముంచుకొస్తున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని నివారించాలని ప్రపంచదేశాలు కోరుకుంటున్నాయి.



## మహిళలకు 33 శాతం సీట్లు ఇస్తాం

**పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందినా, పొందకపోయినా సరే.. 2029 ఎన్నికల్లో టిడిపి ఇచ్చే సీట్లలో మహిళలకు 33 శాతం కేటాయిస్తాం. పార్టీ ఆవిర్భావం నుంచే మహిళా సాధికారతకు టిడిపి కట్టుబడి ఉంది.ఈ లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా ముందడుగు వేస్తోంది. అందుకే మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించే అంశంపై మహానాడులో తీర్మానం పెట్టాం.**

- టిడిపి మహానాడులో నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్



## సమానత్వం, కరుణ, దయలను బలపరిచే పండుగ...బక్రీద్

త్యాగాల పండుగగా 'బక్రీద్' లేదా బక్రీ ఈద్‌కు పేరుంది. ఈద్ అల్ అధా అని కూడా పిలుస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ఆధారంగా నిర్వహించుకునే బక్రీద్ పండుగకు ఒక ప్రత్యేక తేదీ ఉండదు. మే 27, 2026 రోజు వస్తుందని అంచనా వేసిన బక్రీద్ పండుగ దుల్ హిజ్జా నెల వంక దర్శనం ఆధారం 28 మే 2026 రోజున నిర్వహించుకోవాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సెలవుదినంగా ప్రకటించాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన బక్రీద్ పండుగను ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్‌హిజ్జా 10వ రోజు నెలవంక దర్శనం ఆధారంగా వస్తుంది. ప్రవక్త ఇబ్రాహీం కుమారుడైన ఇస్మాయిల్‌ను బలి ఇవ్వాలని అల్లాహ్ ఆజ్ఞాపించడంతో ఇబ్రహీం ఒప్పుకోవడం జరుగుతుంది. తన కుమారుడి ని త్యాగం చేయడానికి ఇస్మాయిల్‌ను అరఫా పర్వత శిఖరానికి చేర్చి బలిపీఠానికి కట్టేస్తాడు ఇబ్రహీం. ఇబ్రహీం తన కళ్లను మూసుకొని బలిపీఠం పై ఉన్న తన కుమారుడు ఇస్మాయిల్ దేహంలోకి బాకును దించుతాడు. ఇబ్రహీం తను కళ్లు తెరిచే సరికి ఇస్మాయిల్ స్థానంలో ఒక పొట్టేలు బలిపీఠంపై చనిపోయి ఉంటుంది. తన ఏకైక కుమారుడైన ఇస్మాయిల్‌ను అల్లాహ్ ఆజ్ఞతో బలి ఇవ్వడానికి కూడా సిద్ధపడినరోజుగా బక్రీద్ పండుగను త్యాగాల పర్వదినంగా ముస్లిమ్ సమాజం జరుపుకుంటారు. ఇబ్రహీం భక్తిని మెచ్చిన అల్లాహ్ తన కుమారుడిని తిరిగి తనకు ఇవ్వడం, ఆ తర్వాత ఇబ్రహీం తన శేష జీవితాన్ని అల్లాహ్ సేవకు అంకితం చేస్తాడు. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సమాజం ఆత్మ పరిశీలన, కరుణ, దానధర్మాల మూల విలువలను ప్రతిబింబించే బక్రీద్ పండుగ రోజు సామూహిక ప్రార్థనలు, సమాజ హిత ప్రసంగాలు ఉంటాయి. ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

# తెలంగాణ వైతాళికులు శ్రీ సురవరం


కవిగా, కథాశిల్పిగా, పత్రికా సంపాదకులుగా, చరిత్రకారులుగా, సాంఘిక చరిత్రల నిర్మాణానికి మార్గదర్శనం చేసిన దార్శనికునిగా, పరిశోధకునిగా, గ్రంథాలయాల వ్యవస్థాపకులుగా, సంఘసంస్కర్తగా, వయోజన విద్యాలయాల ప్రోత్సాహకులుగా, అన్నిటిని మించి ప్రజాహిత చింతకులుగా, తెలంగాణా వైతాళికులుగా ప్రఖ్యాతిగాంచిన మహామనీషి సురవరం ప్రతాపరెడ్డి. ఆయన 1896 మే 28తేదీన జన్మించారు. కర్నూల్లో, హైదరాబాదులో, మద్రాసులో చదువుకొన్నారు. 1922లో లా పూర్తిచేశారు. అయితే న్యాయవాద వృత్తిలో స్థిరపడలేదు. ఆ వృత్తిలో ప్రవేశించడం వల్ల కలిగే అవరోధాలు, అంటే ముఖ్యంగా ప్రజాహిత కార్యాలకు సమయం చిక్కదని వారు భావించారు. ఆ కారణంగానేమో ఆయన అనేక రంగాలను కళకళలాడించా రు.

నిజాం ప్రభువుల పాలనలో భాషా–సాంస్కృతిక–ధార్మిక రంగాలకి కలుగుతున్న అవరోధాలను వారు గుర్తించగలిగారు. అందుకే రచనల ద్వారా, సమావేశాల ద్వారా, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా, కవి సమ్మేళనాల ద్వారా, పత్రికల ద్వారా జన జీవితం లో చైతన్యం నిర్మాణం చేయడానికే వారు తమ జీవితాన్ని అర్పించారు. పాఠశాలలు, గ్రంథాలయాలు స్థాపించి వాటి వికాసానికి విశేషంగా శ్రమించారు.

హైదరాబాదు సంస్థానంలో (నైజాంలో) తెలుగు భాష నిలదొక్కుకోవాలి; జనజీవనంలో వారి మాతృభాషపై మమకారం పెంచాలి. తెలుగు మాట్లాడే వారికి వారిభాష లోనే సమాజ–ప్రాంత–దేశ సమాచారం అందాలి. సమాజంలో దురాచారాలు దూరం కావాలి; సదాచారాలు ఆచరింపబడాలి. మహిళల్లో విద్యావ్యాప్తి జరగాలి, అన్యాయాన్ని అధర్మాన్ని ఎదిరించే యువత నిర్మాణం కావాలి. పత్రిక మాధ్యంగా ఈ ఆలోచనలు జన జీవితంలోకి వెళ్లాలి.

ఎన్నాళ్లుగానో వారిలో ఉన్న ఈ ఆలోచనలకు తోడ్పడ్డవారు కోత్వాల్ రాజాబహద్దరు వెంకటరామారెడ్డి. అందువల్లనే 1926 మే 10వ తేదీన గోలకొండ పత్రిక సురవరం వారి నేతృత్వంలో ప్రారంభమయింది. మొదట, వారానికి రెండు సార్లు వెలువడే అర్ధవార పత్రికగా వెలువడింది. ఆ తర్వాత ఎన్నో యేళ్ళకు దినపత్రిక గా మారింది. సంపాదకుల పేరెవరిదున్నా పనిభారమంతా మోసింది ప్రతాపరెడ్డి గారే!

తమ పత్రికలోనే కాకుండా ఇతర పత్రికల్లోనూ వారు వ్యాసా లు వ్రాశారు. భావకవి రామమూర్తి, గద్వాల సిద్ధాంతి, వెర్రి వెంగళప్ప, యుగపతి, చిత్రగుప్త, గ్రామసింహ, శ్రీశకుమార్ వంటి కలంపేర్లతో తొమ్మిది



వందల వ్యాసాలు వ్రాశారు. మొత్తం రెండు వేల వ్యాసాలు వారు వ్రాశారంటే, ఎన్ని విభిన్న సామాజికాంశాలు వారు స్వీకరించారో అర్థం చేసుకోవచ్చు. కేవలం వ్యాసాలే గాక వారు ఆంధ్రుల సాంఘిక చరిత్ర వంటి అపూర్వ గ్రంథాలు రచించారు. ఈ సందర్భంగా వారిలా అన్నారుః

**"రాజుల రాజ్యాల చరిత్ర వ్రాయుట అంతకష్టములేదు. కాని సాంఘిక చరిత్ర వ్రాయుట కష్టము. దీనికాధారములు తక్కువ. తెనుగు సారస్వతము, శాసనములు, స్థానిక చరిత్రలు (కైఫీయత్తులు), విదేశీ జనులు చూచి వ్రాసిన వ్రాతలు, శిల్పములు, చిత్తరువులు, నాణెములు, సామెతలు, ఇతర వాఙ్మయములలోని సూచనలు, దానపత్రములు, సుద్దులు, జంగముల కథలు, పాట లు, చాటువులు, పూర్వవస్తు సంచ–యములు (కలక్షన్స్) ఇవి సాంఘిక చరిత్రకు పనికివచ్చు సాధనములు... "**

ఇంతలోతుగా అధ్యయనం – పరిశీలనంచేసి వ్రాసిన ఈ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. తెలుగులో అకాడమీ పురస్కారం పొందిన మొదటి గ్రంథం ఇదే.

నైజాంలో తెలుగుకవులే లేరు (మృగ్యం) అని ఎవరో అన్న కారణంగా ఇంతమంది ఉన్నా రు చూడండని అప్పటికప్పటికి ఉన్న కవులతో రచనలు చేయించి 354మంది కవుల రచనలు, 183 మంది పూర్వకవులను పరిచయం చేస్తూ మొత్తం 537 మంది ఉన్నారని తెలియజేస్తూ 1934లో గోలకొండ కవుల సంచిక వెల్వరించారు. ఇదివారి కీర్తి పతాకగా నిలిచింది. తెలంగాణ కవితావైభవానికి దిక్సూచిగా పనిచేసింది.

హైందవ ధర్మవీరులు పేరిట గ్రంథాన్ని ప్రచురించి, యువకులలో స్వాతంత్ర్య పిపాస కలిగించారు. మొగలాయి కథల పేరిట రెండు సంపుటాలు వెల్వరించి, నిజాం కాలంలోని సామాజిక జీవనానికి దర్పణం పట్టారు. 1946లో ఆంధ్ర లిపి సంస్కరణమనే గ్రంథాన్ని ప్రచురించి లిపి పరిశోధకులుగా నిలిచి పోయారు.

సంఘోద్ధరణము, మద్యపానము, గ్రామీజనదర్పణము, హిందువుల పండగలు, భక్త తుకారాం, నిజాం రాష్ట్ర పాలనము, గ్రంథాలయోద్యమము, రామాయణ విశేషములు, యువజన విజ్ఞానము, ప్రజాధికారములు, రాజబహాద్దరు వెంకట్రామారెడ్డి జీవితచరిత్ర... వంటి ముప్పయి పైచిలుకు గ్రంథాలు ప్రచురించి యువ రచయితలకు మార్గ దర్శకులుగా నిలిచారు.

మహిళా విద్యా వికాసం కొరకు పాఠశాలలు స్థాపించారు; వసతి గృహ సౌకర్యాలు కలిగించారు. కులసంఘాల మధ్య సమరసతా వాతావరణాన్ని నిర్మాణం చేయడానికి విశేషంగా కృషి చేశారు. మద్యపానం వల్లకలిగే నష్టాలను చెబుతూ వారు వాసిన ఈ క్రింది పద్యం బహుళ ప్రచారంలో ఉంది.

***ధనమావ్యయమై పోవును***
***మనమా చురుకుందనమును మానును, యశమా***
***దినదినమును క్షీణించును***
***తనువా చెడి పోవు కల్లు త్రావుట చేతన్***

ఇటువంటి ప్రజాహిత చింతకులైనందువల్లనే వారి జీవితాన్ని ఆధారంగా తీసుకొని రచయితలు, వారి ఆదర్శాలు తెలియజేస్తూ మూడు పుస్తకాలు రచించారు. అవును! యువత అవి చదవాలి. వారూ ప్రజాహితచింతకులు కావాలి.

**(నేడు సురవరం ప్రతాపరెడ్డిగారి 130వ జయంతి సందర్భంగా)**

**ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి**

# అమెరికాను సవాలు చేస్తున్న చైనా



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
9010128884

ప్రపంచ చరిత్రలో కొన్ని దేశాలు కేవలం తమ సరిహద్దుల వరకే పరిమితం కావు. అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, రాజకీయాలను, యుద్ధ విధానాలను, సాంకేతిక భవిష్యత్తును మార్చే స్థాయి. ఈ రోజు చైనా అలాంటి శక్తిగా ఎదిగింది. ఒకప్పుడు పేదరికంతో పోరాడిన దేశం ఇప్పుడు ప్రపంచాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది. ఇది కేవలం అభివృద్ధి కథ కాదు.. 21వ శతాబ్దాన్ని మార్చేస్తున్న మహా రాజకీయ ఆర్థిక మార్పు.

ప్రపంచం ఇప్పుడు ఒక కొత్త దశలోకి వెళ్తోంది. ఒకప్పుడు అమెరికా చెప్పిందే ప్రపంచ నిర్ణయం అనుకునే కాలం ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. చైనా ఎదుగుదల ప్రపంచ దేశాలను కొత్తగా ఆలోచించేలా చేస్తోంది. భారత్ కూడా ఈ మార్పును భావోద్వేగాలతో కాదు, దూరదృష్టితో అర్థం చేసుకోవాల్సిన సమయం వచ్చింది.

ఈ నెల 13 నుంచి 15 వరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఇది సాధారణ దౌత్య సమావేశం కాదు. ఒకప్పుడు ప్రపంచ నాయకుడుగా కనిపించిన అమెరికా ఇప్పుడు చైనా సహకారం లేకుండా ప్రపంచ సమస్యలను పరిష్కరించడం కష్టమని అంగీకరించే పరిస్థితికి వచ్చింది. వాణిజ్యం, కృత్రిమ మేధస్సు, అరుదైన ఖనిజాలు, తైవాన్ సమస్య, ఇరాన్ అంశం, సరఫరా వ్యవస్థలు, సముద్ర భద్రత.. ఇలా ఎన్నో రంగాల్లో చైనా పాత్ర కీలకమైపోయింది.

ట్రంప్‌తో పాటు అమెరికన్ పెద్ద వ్యాపార సంస్థల అధిపతులు కూడా బీజింగ్ వెళ్లడం వెనుక స్పష్టమైన సందేశం ఉంది. ప్రపంచ ఆర్థిక భవిష్యత్తును, చైనాను పక్కన పెట్టి ఊహించడం అసాధ్యం. ఒకప్పుడు చైనా ఎదుగుదలను అడ్డుకోవాలని చూసిన అమెరికానే ఇప్పుడు చర్చల కోసం ముందుకు రావడం ప్రపంచ శక్తి సమీకరణాలు ఎలా మారుతున్నాయో చూపిస్తోంది.

2026 నాటికి చైనా ఆర్థిక వ్యవస్థ విలువ సుమారు 20.65 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అంచనా వేస్తోంది. అమెరికా ఇంకా 31.8 ట్రిలియన్ డాలర్లతో ముందే ఉన్నా, చైనా వృద్ధి వేగం మాత్రం అమెరికా కంటే రెట్టింపు స్థాయిలో ఉంది. కొనుగోలు శక్తి పరంగా చూస్తే చైనా ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది.

ప్రపంచ తయారీరంగంలో చైనా ఆధిపత్యం ఆశ్చర్యకరం. ప్రపంచంలో తయారయ్యే వస్తువుల్లో దాదాపు 30 శాతం చైనాలోనే తయారవుతున్నాయి. ఇది తదుపరి తొమ్మిది దేశాల మొత్తం ఉత్పత్తికంటే ఎక్కువ. అరుదైన ఖనిజాల తవ్వకాల్లో చైనా వాటా సుమారు 70 శాతం. వాటి శుద్ధిలో 85 నుంచి 90 శాతం వరకు ఆధిపత్యం ఉంది. విద్యుత్ వాహనా లు, సౌరశక్తి పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీలో ఇవి కీలకం. విద్యుత్ వాహనాలు, బ్యాటరీలు, సౌరశక్తి రంగా ల్లో కూడా చైనా భారీ ఆధిపత్యం సాధించింది. ప్రపంచ బ్యాటరీ తయారీ పెట్టుబడుల్లో 71 శాతం చైనా వాటా. సౌరశక్తి సరఫరా వ్యవస్థలో 80 శాతం కంటే ఎక్కువ ప్రభావం చైనాదే. ప్రపంచ వాణిజ్యంలో కూడా చైనా భారీ ఎగుమతులతో ముందంజలో ఉంది.

భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సుమారు 4 నుంచి 4.5 ట్రిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. అంటే చైనాతో పోలిస్తే దాదాపు ఐదో వంతు మాత్రమే.

సైనిక రంగంలో కూడా చైనా అద్భుతంగా ఎదిగింది. ప్రపంచంలోనే అత్యధిక నౌకలు ఉన్న నౌకాదళం, దాదాపు 20 లక్షల సైనిక బలం, అత్యాధునిక క్షిపణులు, కృత్రిమ మేధస్సుతో పని



చేసే యుద్ధ వ్యవస్థలు, డ్రోన్ దళాలు.. ఇవన్నీ చైనా సైనిక శక్తిని ప్రపంచానికి చూపిస్తున్నాయి. 2027 నాటి కి తైవాన్ విషయంలో మరింత బలమైన సామర్థ్యం సాధించాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అణ్వాయుధాల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోం ది.

సాంకేతిక రంగంలో చైనా దూసుకుపోతోంది. కృత్రిమ మేధస్సు, 5జీ 6జీ టెక్నాలజీ, రోబోటిక్స్, క్వాంటం టెక్నాల జీ, అంతరిక్ష పరిశోధనలు ఇలా ప్రతి రంగంలో భారీ పెట్టుబడులు పెడుతోంది. సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించింది. చంద్రుడు, మంగళ గ్రహాలపై పరిశోధనలకు దూకుడు చూపుతోంది. ఫ్యాక్టరీల్లో లక్షల సంఖ్యలో రోబోలు పనిచేస్తున్నాయి.

రాబోయే కాలంలో చైనా ఎందుకు కీలకంగా మారుతుందంటే గ్రీన్ ఎనర్జీ రంగాన్ని నియంత్రించే స్థాయిలో అది అరుదైన ఖనిజాలు, బ్యాటరీలు, సౌరశక్తి రంగాల్లో ఆధిపత్యం సంపాదించింది. ప్రపంచ సరఫరా వ్యవస్థలు కూడా చైనా మీద ఆధారపడి ఉన్నాయి. కృత్రిమ మేధస్సు, అత్యాధునిక తయారీరంగాల్లో దూకుడు చూపుతోంది. భవిష్యత్తులో యుద్ధాలు కేవలం తుపాకులతో కాదు, సాంకేతికత, ఆర్థిక వ్యవస్థలతో జరుగుతాయని చైనా ముందుగానే అర్థం చేసుకుంది.

చైనా విజయానికి మరో కారణం దీర్ఘకాల ప్రణాళిక. ప్రభుత్వాలు మారినా లక్ష్యం మారకుండా పనిచేయడం. ప్రభుత్వం, పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు కలిసి పని చేయడం.

అయితే భారత్ ఎందుకు వెనుకబడింది? జనాభా సమానంగా ఉన్నా దీర్ఘకాల దూరదృష్టి లోపం, ప్రతి ఎన్నికతో మారే విధానాలు, అవినీ తి, భూసేకరణ సమస్యలు, కులమత రాజకీయాలు, సేవల రంగంపైనే ఎక్కువ ఆధారం పెట్టుకోవ డం, తయారీ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వంటి కారణాలు మన ఎదుగుదలను తగ్గించాయి. అయినా భారత్‌కు అవకాశాలు ఉన్నాయి. ప్రపంచ దేశాలు ఇప్పుడు చైనా ప్లస్ వన్ వ్యూహంతో ఇతర దేశాలవైపు చూస్తున్నాయి. అందులో భారత్‌కు మంచి అవకాశం ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా, ప్రజాస్వామ్య వ్యవ స్థ, సమాచార సాంకేతిక రంగంలో నైపుణ్యం, పెద్ద మార్కెట్.. ఇవన్నీ మన బలాలు.

చిప్ తయారీ, రక్షణ పరిశ్రమలు, విద్యుత్ వాహనాలు, సౌరశక్తి, పరిశోధనలు, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భారత్ వేగంగా ముందుకు సాగాలి. అవినీతిని తగ్గించాలి. విద్యను పరిశ్రమలకు అనుసంధానం చేయాలి. రాజకీయ స్థిరత్వం అవసరం. భారత్, చైనా సంబంధాలు కూడా చాలా జాగ్రత్తగా నడపాల్సినవే. ఒకవైపు రెండు దేశాల మధ్య భారీ వాణిజ్యం కొనసాగుతుండగా, మరోవైపు సరిహద్దు వివాదాలు ఉన్నాయి. కాబట్టి భావోద్వేగాల కంటే ప్రయోజనాలు, భద్రత, దూరదృష్టి ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. చైనా ఎదుగుదలను చూసి అసూయపడాల్సిన అవసరం లేదు. కానీ దాని నుంచి నేర్చుకోవాల్సిన అవసరం మాత్రం ఉంది. అమెరికా కూడా చర్చలకు రావాల్సి వచ్చిన ఈ పరిస్థితి ప్రపంచం ఎంత వేగంగా మారుతోందో చూపిస్తోంది. ఇప్పుడు ప్రపంచం జనాభా ఆధారంగా కాదు, విజ్ఞానం, క్రమశిక్షణ, పరిశోధనలు, సాంకేతికత, ఆర్థిక శక్తి ఆధారంగా ముందుకు సాగుతోంది.

దేశభక్తి అంటే కేవలం గత వైభవాన్ని చెప్పుకోవడం కాదు. ప్రపంచంతో పోటీ పడే విద్యా వ్యవస్థను నిర్మించడం, ప్రపంచ మార్కెట్లను జయించే పరిశ్రమలను తయారు చేయ డం, యువతకు అవకాశాలు కల్పించడం, శాస్త్రవేత్తలను, ఆవిష్కర్తలను తయారు చేయడం. అదే నిజమైన దేశభక్తి.

భారత్ ఇప్పుడు జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సిన దశలో ఉంది. ప్రజాస్వామ్య బలం, యువశక్తి, సాంకేతిక ప్రతిభను ఉపయోగించి తయారీ, సాంకేతిక, ఆర్థిక మహాశక్తిగా ఎదగాలి. రాజకీయాలు కేవలం ఎన్నికల లాభాల కోసం కాకుండా జాతీయ నిర్మాణం కోసం పనిచేయాలి. విద్య, ఆరోగ్యం, పరిశోధనలు, మౌలిక వసతులపై యుద్ధ స్థాయిలో పెట్టుబడులు పెట్టాలి. సొంత శక్తితో ప్రపంచానికి దారి చూపే దేశంగా భారత్ ఎదగాలి. అదే మన తరానికి ఉన్న బాధ్యత. మన తర్వాతి తరాలు గర్వంగా చూసే భారతాన్ని నిర్మించడం ఇప్పుడు మన చేతుల్లోనే ఉంది.

# యువత ఉపాధికై పౌర ఆధారిత పరిపాలన



ప్రొ.టి.ప్రభాకరరెడ్డి
ఆర్థిక శాస్త్రవేత్త

ప్రజాస్వామ్యం ప్రజల అభివృద్ధి కై, రాష్ట్రాల పని తీరు మెరుగుపడేట్లుగా ఉండాలని, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేట్లుగా తోడ్పడాలని దీనికై పౌర ఆధారిత పరిపాలన నెలకొల్పాలని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్త ఫ్రావిన్స్ ఫుకుయామా చెప్పడం గమనించాలి. ఎందుకనగా ప్రస్తుతం ప్రభుత్వాలు తమకు తోచిన రీతిలో వెళ్తూ ప్రజల అవసరాలు ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, యువత అవసరాలను విస్మరిస్తున్నారు.

గతకొన్ని సంవత్సరాలుగా ఈ ధోరణి కాస్త ఎక్కువైనట్లు కనిపిస్తుంది. ఫుకుయామా చెప్పినట్లు ప్రభుత్వాలు ఎక్కువ రోజులు పరిపాలన ప్రశాంతంగా కొనసాగించాలంటే ప్రజల అభిప్రాయాలు తీసుకొని వాటిని అమలుచేసేలా కృషి చేయాలి. ముఖ్యంగా Generation–Z అధికంగా ఉన్న మన దేశంలో యువత చదువులు, ఉపాధిపై ధ్యాస పెట్టాలి. Gene–Z; 13 నుండి 23 వయస్సుగలవారు ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వలన ముఖ్యం గా క్రియాశీల రాజకీయాలలో చోటు లభించక, ప్రజాస్వామ్యంపై ఆశలు సన్నగిల్లి, ఒక చక్కని మార్పుకై ప్రభావం చూపని ప్రభుత్వాలని జవాబుదారీతనంతో పనిచేయించడానికి ఒకే చోటకు వచ్చి నిరసన వ్యక్తం చేయడం చాలా దేశాలలో గమనించాం.

జెన్–Z నిరసనలు చూసినట్లయితే, టునిషియాలో 2010లో యువత పెద్ద ఎత్తున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, అలాగే లంచగొండితనానికి వ్యతిరేకంగా నేపాల్, ఇండోనేషియా, సెర్బియా, పెరు, ఫిలిప్పీన్స్ దేశాలలో ప్రభుత్వాలని నిలదీయడం లాంటి ఉదాహరణలు మనదేశంలో రాకముందే ప్రభుత్వాలు స్పందించాలి. ఇవేకాకుండా శ్రీలంకలో 2022లో, బంగ్లాదేశ్‌లో 2024 మడగాస్కర్ దేశాలలో యువత పెద్ద ఎత్తున అవినీతిని నిర్మూలించడానికై ప్రభుత్వాలని నిలదీయడం గమనార్హం. చాలా దేశాలలో యువత అహింసా పద్ధతిలో ఉద్యమాలు నడిపి వారి శక్తిని ఒక అనూహ్యమైన ఆయుధంగా మలచుకొని, ఎన్నికల పై, సంస్థాగత మార్పుకై ఉపయోగించారు.

దీనికి కారణాలు చూసినట్లయితే తీవ్రమైన ఆర్థిక క్లిష్ట పరిస్థితులు, రాజకీయ అధికారానికి వెలు పల ఉంచడం, పెచ్చుమీరిన అవినీతి ప్రభుత్వాలని ఇరకాటంలో పెట్టాయంటే సందేహం లేదు.

వారి డిమాండ్లు చూసినట్లయితే నాణ్యమైన విద్య ముఖ్యంగా ఉన్నత విద్య తగినన్ని మెళకువలతో ఇవ్వాలని, తద్వారా ఉపాధి లభిస్తుందని, దీనిపై ఒక (Employment Policy) ఉపాధి కల్పన విధానాన్ని రూపొందించాలని వారు అడుగుతున్నారు. అలాగే కరప్షన్ ఫ్రీ (corruption free) పరిపాలన అందించాలని, ప్రతి రూపాయిని (Audit) ఆడిట్ చేయాలని కోరుతున్నారు. ఖర్చు చేసిన ఇవే కాకుండా ప్రభుత్వాలు వేసే పన్నుల క్రమబద్ధీకరణ, ఒకే వస్తువుపై లేదా సర్వీస్‌పై పదే పదే పన్నులు వేయకుండా చూడాలని వారి వాదన.

అలాగే ప్రతి సంవత్సరం చివరన ఖర్చు చేసిన బడ్జెట్‌ని public expenditure review జరిపి ఏయే వర్గాలకి ఎంతెంత లబ్ధి చేకూర్చారనేది తెలియచెప్పాలి. స్పష్టంగా, పారదర్శకంగా నివేదికలని వెబ్‌సైట్‌లో పెట్టాలి. అప్పుడే ప్రజలు తమ సందేహాల ని నివృత్తి చేసుకొని ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తారు.

ఇక మనదేశ పరిస్థితి చూసినట్లయితే చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. ఉద్యోగాల్లో చేరిన యువతకి తగిన నైపుణ్యాలులేక నానా ఇబ్బందులపాలవుతున్నారు. నైపుణ్యాల పెంపుకై ప్రవేశపెట్టిన పథకాలు తగిన ఫలితాలు ఇవ్వట్లేదు. ఒక్కోవ్యక్తిపై దాదాపుగా 60వేల రూపాయ లు, 3 నుండి 6 మాసాలలో ఖర్చు చేస్తే ఫలితం శూన్యం. నిష్పక్షపాత మానిటరింగ్ కరవైంది. తద్వారా ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారు. ఆస్ట్రేలియా లాంటి skill share centres ని ప్రభుత్వమే నడిపి, యువతకి నైపుణ్యాలని అందించి, ఉపాధి చూపించాలి.

ప్రస్తుతం నడుపుతున్న ATI (Advanced Training Institutes)లని యువతకి ఉపాధి అందించే శిక్షణా కార్యక్రమాలకై ఉపయోగించాలి. ఉద్యోగులకి civil servantsకి ఆన్‌లైన్ శిక్షణలు ఏర్పరచి ఖర్చులు తగ్గించాలి. యువత అధికంగా ఉన్న దేశం కాబట్టి, యువత శ్రేయస్సుకై విధాన కల్పన, వాటి అమలు యుద్ధప్రాతిపదికన జరగాలి. లేనిచో పెనుప్రమాదం పొంచి ఉందని గమనించాలి.

# తడిసిన ధాన్యం మొత్తాన్ని కొంటాం

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని, రైతులు ఏలాంటి ఆందోళనకు గురి కావద్దని, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నెలకొన్న తాజా పరిస్థితి లపై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,మంత్రివర్గ సహచరులతో పాటు పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర రాష్ట్రంలోని కలెక్టర్లు , పోలీస్, రవాణ, పౌర సరఫరాల శాఖాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర రైతాంగానికి నష్టం వాటిల్లే ఏ చర్యలను ప్రభుత్వం చూస్తూ ఊరుకొబోదన్నాని, ఇది రైతు పక్షపాత ప్రభుత్వం అని చివరి గింజ వరకు కొనుగోలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి పునరుద్ఘాటించారు.
అకాల వర్షాలకు తడిసిన 9,214 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించామని చెప్పారు. ఇప్పటి వరకు 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయగా, ఇందులో 44.67 లక్షల మెట్రిక్ టన్నులు సాధారణ రకాల ధాన్యం కాగా 12.33 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని ఆయన వివరించారు. ఇసుక సరఫరా చేసే లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మళ్లించి సత్వరమే ధాన్యాన్ని మిల్లులకు రవాణ చేసేందుకు వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**కొనుగోళ్లను వేగవంతం చేయాలి : సిఎం రేవంత్‌రెడ్డి**

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో వర్షాలపై సిఎం రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగిన అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీచేశారు. స్పష్టం చేశారు. కల్లాల్లోని ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తైన కేంద్రాలనుంచి టార్పాలిన్లను తరలించాలని అన్నారు. బలమైన ఈదురుగాలులు వీస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు.

# కేంద్రం రైతులను మరోసారి మోసం చేసింది

ఎస్‌కెఎం నేతలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం 2026–27 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలను నామమాత్రంగా పెంచి రైతులను దగా చేసిందనిసంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం)కన్వీనర్లు పశ్య పద్మ, తీగలు సాగర్ ,బి రాము, మామిడాల భిక్షపతి, వి నాగిరెడ్డి, జక్కుల వెంకటయ్య, రవీందర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, పెట్రోల్, విద్యుత్, నీరు వంటి సాగు పెట్టుబడి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఎంఎస్‌పి ఏమాత్రం సరిపోవని తక్షణమే సవరించాలని వారు డిమాండ్ చేశారు. మద్దతు ధరలను సవరించి శాస్త్రీయంగా పెంచేవరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. కేంద్రం ప్రకటించిన నామమాత్రపు మద్దతు ధరను నిరసిస్తూ బుధవారం ఎస్‌కెఎం ఆధ్వర్యంలో నారాయణగూడ చౌరస్తావద్ద నిరసన వ్యక్తంచేశారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌కెఎం నేతలు మాట్లాడుతూ మద్దతు ధరల ప్రకటనతో నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న 'రైతు వ్యతిరేక' స్వభావం మరోసారి బట్టబయలైందన్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలతో సాగుకు అయ్యే సమగ్ర వ్యయం (సి2+50శాతం) కంటే కనీసం 50 శాతం అధికంగా మద్దతు ధర నిర్ణయించాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పెంచాల్సి ఉండగా ఇప్పటికే అంతకంటే చాలా తక్కువగా ఉండే 'ఎ2+ఎఫ్ఎల్' సాగు వ్యయాల ఆధారంగా మద్దతు ధరను ప్రకటించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి దేవభక్తుని సంధ్య, ఉపాధ్యక్షులు ప్రభులింగం, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోశాధికారిడిజి నరేంద్ర ప్రసాద్ సహాయ కార్యదర్శులు లెల్లెల బాలకృష్ణ, ఉడుత రవీందర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకుడు దశరథ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు సుధాకర్ యస్ ఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, రైతు సంఘం నాయకులు జి.వెంకట్రాములు, ప్రభులింగం, డి.జి ప్రసాద్, తుకారాం నాయక్ పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులకు

# రూ.1173 కోట్ల నిధుల విడుదల

మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/హైదరాబాద్ : మొక్కజొన్న సాగులో రైతులు, కొనుగోళ్ల లో ప్రభుత్వం కలిసి చరిత్ర సృష్టించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటివరకు మొక్కజొన్నను 2.42 లక్షల మంది రైతుల నుండి సుమారు 13.42 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో లక్ష మంది రైతుల ఖాతాలలో రూ.1173 కోట్లను జమా చేస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో వెనుకంజ వేసిన పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం కూడా మొక్కజొన్న కొనుగోలు చేయమని చేతులు ఎత్తేసిన సమయంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతులకు భరోసాగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. రైతులు మద్ధతు ధర లేక నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రంలో పండిన మొక్కజొన్న పంట మొత్తాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్‌కు రూ.2400 మద్ధతు ధర చెల్లించి మొక్కజొన్న కొనుగోలు చేపట్టినట్లు వివరించారు. ఈ కొనుగోళ్లకు సంబంధించిన మొత్తం వ్యయభారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు తరలించిన మొక్కజొన్నతో పాటు, ఇంకా సెంటర్లకు వస్తున్న పంటను కూడా ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు.రైతుల కష్టానికి గౌరవం దక్కేలా, పంటకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్ , మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి తదితర అధికారులు పాల్గొన్నారు.

# త్వరలో ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికలు

మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : త్వరలోనే ఆర్‌టిసి కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆ తర్వాత ఎన్నికైన సంఘాలతో కలిసి ఆర్‌టిసి విలీన ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్మికులకు పిఆర్‌సి అమలుతో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతి రెండో మంగళవారం ప్రత్యేకంగా సమయం కేటాయించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్ నగరం వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకుని మరో ఢిల్లీలా మారకూడదనే ఉద్దేశంతోనే పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బస్సులను పెద్ద ఎత్తున అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో కాలుష్య రహిత ప్రజా రవాణాను పెంపొందించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) మరో కీలక అడుగు వేసిందని పేర్కొన్నారు. గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా కూకట్‌పల్లి డిపోకు చెందిన 60 నూతన ఎలక్ట్రిక్ బస్సులను మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం టిజిఎస్‌ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డితో కలిసి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.
అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఒక్క హైదరాబాద్‌లోనే 540 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1050 ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయని ఆయన వెల్లడించారు. వై.నాగిరెడ్డి మాట్లాడుతూ శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం లేని ప్రయాణాన్ని అందించడంతో పాటు ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని ఈ ఇవి బస్సులు కల్పిస్తాయని నాగిరెడ్డి వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండి. నాగిరెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, కలెక్టర్ మను చౌదరి, ఆర్‌టిసి ఇడిలు సిహెచ్.వెంకన్న, రాజశేఖర్‌లు నూతన బస్సుల్లో ప్రయాణించారు.



## రాజకీయంగా ఎదుర్కోలేకనే విజయన్ ఇంటిపై ఇడి దాడులు

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రాజకీయంగా ఎదుర్కోలేక దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. పినరయి విజయన్ నివాసంతో పాటు ఆయనకు అనుబంధంగా ఉన్న ప్రాంతాల్లో ఈడీ నిర్వహించిన దాడులను బుధవారం ఓ ప్రకటనలో ఆయన తీవ్రంగా ఖండించారు. కేరళంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వరుసగా ప్రజాభిమానాన్ని పొందుతూ ముందుకు సాగుతుండటాన్ని కేంద్రం జీర్ణించుకోలేకపోతోందని వ్యాఖ్యానించారు.

# అర్చకులకు అండగా ప్రభుత్వం



## రూ.71.20 లక్షల గ్రాట్యుటీ చెక్కుల పంపిణీ

## గ్రాట్యుటీ పెంపు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారంతో దేవాదాయ శాఖలో మార్పులు : మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: దేవాదాయ శాఖ పరిధిలో పనిచేసిన అర్చకులు, ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత కూడా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ఆలస్యం కాకుండా అందించడం ద్వారా వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. బంజారాహిల్స్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ అర్చక ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం 12 మందికి 'అర్చక సంక్షేమ నిధి' ద్వారా రిటైర్మెంట్ గ్రాట్యుటీ, డెత్ గ్రాట్యుటీ కింద రూ.71.20 లక్షల చెక్కులను మంత్రి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదాయ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.
దేవాలయాల్లో సేవలందిస్తున్న అర్చకులు, ఉద్యోగులకు పదవీ విరమణ లేదా మరణానంతరం అందించే గ్రాట్యుటీ మొత్తాన్ని రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈవోల సీనియారిటీ, పదోన్నతుల ఫైళ్లను క్లియర్ చేయడం ద్వారా దేవాలయాల నిర్వహణ మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, తెలంగాణను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సమగ్ర సాంస్కృతిక విధానంతో కళాకారుల సంక్షేమం

## తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభ తీర్మానం



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో సమగ్ర సాంస్కృతిక విధానం ఏర్పాటుచేసి కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభ తీర్మానించింది. తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభలు హైదరాబాద్‌లో జయప్రదంగా ముగిశాయి. ఈనెల 25,26 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ మహాసభలు ఉత్తేజ పూరితంగా జరిగాయి. మొదటి రోజు వందలాది మంది కళాకారులతో, వేషధారణతో ప్రజాకళాకారుల ర్యాలీ నారాయణగూడ సత్యానారాయణరెడ్డి భవన్ నుండి మార్వెల్ ఫంక్షన్ హాల్ వరకు ఉద్వేగభరితంగా సాగింది. మండే ఎండలో సైతం బాలబాలికలు, మహిళలు సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొనడం విశేషం. ప్రముఖ సినీ నిర్మాత, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, ఇప్టా పతాకాన్ని ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలపక్షం వహించి వారి సమస్యల పరిష్కారం కోసం కళాకారులుగా పాటుపడాలని ఉద్బోధించారు. మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, కళవేన శంకర్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్, పల్లె నరసింహల ఆధ్వర్యంలో సాయంకాలం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి.
రాష్ట్ర ప్రజానాట్యమండలి నాయకులు కె.లక్మినారాయణ, కె.ఉప్పలయ్య, పి.నళిని, ఇప్టా నాయకులు కె.స్వామి తదితరులు పాల్గొన్నారు. 26వ తేదీన 2వ రోజు బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో 200 మందితో ప్రతినిధులు సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ప్రగతిశీల దృక్పథంతో, సామాజిక దృష్టి కోణంలో పనిచేస్తున్న ప్రజా కళాకారులు అభినందనీయులని తెలియజేస్తూ ఇప్టా చరిత్ర చాలా గొప్పదని ప్రశ్నించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, ప్రజానాట్యమండలి అధ్యక్ష ప్రధానకార్యదర్శులు కె.శ్రీనివాస్, పల్లె నరసింహ, రాష్ట్ర ప్రజానాట్యమండలి నాయకులు కె.లక్ష్మీ నారాయణ, కె.ఉప్పలయ్య, పి.నళిని, రేగుంట చంద్రశేఖర్, కొండలరావు, జగన్, ఆరుట్ల రవి, ఇప్టా నాయకులు కె.స్వామి సీనియర్ నాయకులు వై.రాజేందర్ పాల్గొన్నారు.

## జూన్ 2న అపాయింటెడ్ డేట్ ప్రకటించాలి

ఆర్‌టిసి జెఎసి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని, అన్ని కార్మిక సంఘాల ఏకాభిప్రాయాన్ని ప్రభుత్వం గౌరవించడంతో పాటు ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకొని జూన్ రెండో తారీఖున అపాయింటెడ్ డేట్ ప్రకటన చేసి, కార్మికులకు తీపి కబురు చెప్పాలని ఆర్‌టిసి జెఎసి నాయకులు కోరారు. మే డే సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి కార్మిక సంఘాల సమక్షంలో మాట్లాడుతూ ముందు విలీనం కావాలా లేదా ఎన్నికలు కావాలా ఈ రెండిటిలో ఏది కావాలో కార్మిక సంఘాలన్నీ ఒకే అభిప్రాయానికి వచ్చి, రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని కోరగా, అన్ని కార్మిక సంఘాలు ముందుగా విలీనమే కావాలని తర్వాత ఎలక్షన్లు నిర్వహించాలని ముఖ్యమంత్రికి వ్రాతపూర్వకంగా లేఖలను ఇవ్వడం జరిగిందన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముందు ఎలక్షన్ నిర్వహిస్తామని, తర్వాత విలీనం ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పడం సమంజసం కాదని, దీంతో కార్మికులలో గందరగోళం ఏర్పడిందని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వ పెద్దలను జెఎసి ఆధ్వర్యంలో కలిసి చర్చిస్తామని తెలిపారు.



# విజయన్ ఇంట్లో ఈడి సోదాలు రాజకీయ దాడి : సిపిఐ(ఎం)

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇంట్లో ఈడి సోదాల పేరుతో బిజెపి చేయిస్తున్న రాజకీయ దాడి అని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయ రాఘవన్, బి.వి.రాఘువులు విమర్శించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబిభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. విజయ రాఘవన్ మాట్లాడుతూ ప్రశ్నించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తూ వాటిని దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి సిపిఐ(ఎం) నేతలపై ఒక్క కేసు కూడా లేదని, తమది విలువలతో కూడిన నీతివంతమైన పార్టీ అన్నారు. అలాంటి సిపిఐ(ఎం) నేతలపై ఈడిని ఉసికొల్పుతున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రజలను సమీకరించి రాజకీయ, న్యాయ పోరాటాలు చేయనున్నట్టు ప్రకటించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని అందరికీ ఉచిత విద్య, వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తేవడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై రాజకీయాలు వద్దు : రైతు కమిషన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతుల సమస్యలను ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సరికాదని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి, సభ్యులు గడుగు గంగాధర్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని రోజులుగా ధాన్యం, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోందని కోదండరెడ్డి తెలిపారు. రైతులకు బాసటగా నిలబడాల్సిన నాయకులు వారిని మానసికంగా దెబ్బతీసేలా, రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదన్నారు.
ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొనుగోలు వ్యవస్థలు బలహీనపడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ఎకరానికి 7క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని, సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరగాల్సిన బాధ్యత పూర్తిగా కేంద్రానిదేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని చెప్పారు. రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ మాట్లాడుతూ రైతులతో కలిసి ఉండాల్సిన వారు యాత్రల పేరుతో రాజకీయాలు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, జిల్లా అధికారులు, సివిల్ సప్లై శాఖ సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. లారీల కొరత ఉన్న చోట్ల ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు.రైతులు అపోహలకు లోనుకాకుండా వాస్తవ పరిస్థితులను గమనించాలని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.

## 'రైతు డిస్కం' దరఖాస్తు తిరస్కరించాలి

బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నేత హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: 'రైతు డిస్కం' డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న దరఖాస్తును తిరస్కరించాలని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ను కోరారు. ఈమేరకు కమిషన్‌కు ఆయన బుధవారం లేఖ రాశారు.

# నా వ్యాఖ్యలను వక్రీకరించారు

బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ బాల్కసుమన్



ప్రజాపక్షం/హైదారబాద్ : సింగరేణి కార్మిక సంఘం సమావేశంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించారని, హరీష్ రావు మాట్లాడిన వ్యాఖ్యలపై ప్రజల దృష్టి మరల్చడానికి ప్రయత్నిస్తున్నారని బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ బాల్కసుమన్ అన్నారు. తనపైన కేసు పెట్టాలని డిజిపికి పిర్యాదు చేశారని, తనపైన పెట్టే దృష్టిని సింగరేణి సంస్థపైన పెట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులు,ప్రజల ఓట్లతోనే తాను రెండు సార్లు గెలిచానన్నారు. సిఎం కార్యాలయం డైరెక్షన్ మేరకే తనను ట్రోల్ చేస్తున్నారని, మళ్లీ కేసు పెట్టి జైలుకు పంపుతారేమోనని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
పురపాలక సంఘం - ఆర్మూర్, జిల్లా: నిజామాబాద్
టెండర్ & కొటేషన్ నోటీస్
E1/08/MCA/2026-27, Date: 27-05-2026
పట్టణములో వార్డు నెం.(01) నుండి (36) అవసరమగు ప్రదేశాలలో కల్వర్టుల నిర్మాణము చేయుటకు, ఆర్&బి కార్యాలయము వద్ద గల టాయిలెట్లు మరమ్మత్తులు చేసి మురికి కాలువ నిర్మాణము చేయుటకు, డంపింగ్ యార్డ్ వద్ద మిషనరీ ఏర్పాటులో భాగముగా షెడ్డు నిర్మాణము చేయుటకు మరియు యం.పి ల్యాడ్స్ నిధుల నుండి బక్కరు గుట్ట క్రిమిటోరియం వద్ద బోర్ డ్రిల్ చేసి మోటారు ఏర్పాటు చేయుటకు గాను టెండర్లు కోరుచున్నాము. మిగితా వివరాల కొరకు తెలంగాణ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ https://tender.telangana.gov.in లో లేదా పురపాలక సంఘ కార్యాలయము నందు పని వేళల్లో మున్సిపల్ ఇంజనీర్ గారిని సంప్రదించగలరు.
పట్టణములో వివిధ వార్డులలో పడిపోయినటువంటి మోటార్లు (వివిధ సామర్థ్యము కలిగిన) తీయించుటకు రేటు కొరకు కొటేషన్లు **తేది: 30.05.2026 ఉ.11:30 ని.ల** వరకు సమర్పించగలరు. నీటి సరఫరా లీకేజిలు అరికట్టుటలో భాగముగా కొనుగోలు చేయు లీకేజి మెటీరియల్స్ నాన్ యస్.యస్.ఆర్ ఐటమ్స్ (కార్యాలయ నోటీస్ బోర్డు నందు పొందుపరచనైనవి) రేట్ల కొరకు, వివిధ సామర్థ్యం కలిగినటువంటి మోటార్లు, పంపులు, ప్యానల్ బోర్డుల మరమ్మత్తుల కొరకై రేట్ల కొరకు, వివిధ సామర్థ్యం కలిగినటువంటి స్లూస్‌వాల్వ్ ల మరమ్మత్తు రేట్ల కొరకు మరియు నీటి సరఫరా కొరకు ట్రాక్టర్ ట్యాంకర్ డ్రైవర్‌తో రేటు కొరకు కొటేషన్లు కోరుచున్నాము. ఇట్టి కొటేషన్లు **తేది: 03.06.2026 సా.3:00 గం.ల** వరకు కార్యాలయములో సమర్పించగలరు.
సం/- కమీషనర్
పురపాలక సంఘం, ఆర్మూర్
DIPR R.O. No. : 3138-PP/CL/ADVT/2026-27, Date: 27-05-2026

## మధ్యాహ్న భోజన కార్మికురాలు మరియమ్మ ఆకస్మిక మృతి



ప్రజాపక్షం/ తల్లాడ:తల్లాడ మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన ఇనపనూరి మరియమ్మ(58) బుధవారం ఉదయం ఆకస్మిక మృతి చెందింది. ఆమెకు భర్త, పిల్లలు ఉన్నారు. ఆమె గత 20సంవత్సరాలుగా మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పనిచేస్తూ విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందింది. ఆమె మృతి పట్ల మధ్యాహ్న భోజన పథకం ఎఐటియూసి సంఘం రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, మండల మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు ఇనపనూరి సాయమ్మ, ఎక్కిరాల మరియమ్మ, భవాని, పార్వతీ, ఆదూరి రావేలు, రాధ, లక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి మనోధైర్యాన్ని కల్పించారు.

## గోధుమవాగు గోతిలో పడి దుక్కిటెద్దులు మృతి



గోధుమవాగులో అక్రమ ఇసుక తవ్వకాలు

ప్రజాపక్షం/చుంచుపల్లి : చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి గ్రామ పంచాయతీ వద్ద గోధుమవాగులో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సిద్దల వెంకన్న ఎడ్లబండిపై ఇసుక తీసుకురావడానికి వాగులోకి వెళ్లగా నీటితో నిండిపోయిన లోతైన గోతిని గుర్తించకపోవడంతో బండి అదుపుతప్పి గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో రెండు దుక్కిటెద్దులు అక్కడికక్కడే మృతి చెందగా, రైతు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం గోధుమవాగులో నిత్యం ఎడ్లబండ్లపై అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతూనే ఉందని, అదేవిధంగా నిరంతర ఇసుక తవ్వకాల వల్ల వాగులో ప్రమాదకర గోతులు ఏర్పడ్డాయి ఆరోపిస్తున్నారు. వాగులో నీటితో నిండిపోయి ఈ గోతులు బయటకు కనిపించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి తెలిపారు. ప్రతిరోజూ గ్రామస్తులు, రైతులు వాగు దాటుతూ రాకపోకలు సాగిస్తుండగా ఇలాంటి ప్రమాదకర గోతులు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. అధికారులకు అక్రమ ఇసుక తవ్వకాల విషయం తెలిసినా పట్టించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, వాగు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసి ప్రమాదకర గోతులను పూడ్చివేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.


## గిరిజన విద్యార్థుల విజయాలు జిల్లాకు గర్వకారణం

ఐటిడిఏ పిఒ రాహుల్




ప్రజాపక్షం/భద్రాచలం: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు పది, ఇంటర్, జేఈఈ, ఎఫ్‌సెట్ పరీక్షల్లో చక్కటి ఫలితాలు సాధించడం జిల్లాకే గర్వకారణమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రతిభా సత్కార కార్యక్రమంలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రతిష్టను పెంచారని తెలిపారు. తల్లిదండ్రులు, గురువుల కృషికి విద్యార్థుల విజయాలే నిజమైన గుర్తింపు అన్నారు. ఇంటర్ దశ నుండే కెరీర్‌పై దృష్టి సారించి ఎంసెట్, నీటి, జేఈఈ, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధంకావాలన్నారు. వివిధ పరీక్షల్లో ఉత్కృత్తమ మార్కులు సాధించిన బాలబాలికలను పిఓ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, గురుకులం ఆర్‌సిఓ అరుణకుమారి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, ప్రిన్సిపళ్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చొద్దు వ్యవసాయ సంచాలకులు : బి.వాణి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిన అవశేషాలను కాల్చడం వలన భూసారం తగ్గిపోతుందని, వ్యవసాయ సంచాలకులు బి. వాణి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని వెంకటగిరి, పోలేపల్లి, కొండాపురం, ఎంవీ,పాలెం, తనగంపాడు గ్రామాలలో రైతులకు పంట వ్యర్థాల దహనం, నకిలీ విత్తనాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, నిఘా సమితులపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలలో ఆమె మాట్లాడుతూ...నేలలోని ఉపయోగర సూక్ష్మ జీవులు నశించడం, వానపాముల సంఖ్య తగ్గిపోవడం, పర్యారణ కాలుష్యం పెరగడం జరుగుతుందని రైతులకు వివరించారు. అలాగే నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కావున రైతులు ధృవీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. అంతేకాకుండా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన నిఘా సమితుల ద్వారా నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టడంతో పాటు పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిసి ఎఒలు శరత్, అరుణ, ఎఇఒలు, ఏదులాపుం మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ కందుకురి శేషమ్మ,ఏఈఓలు, పంచాయతీకార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## సారూ స్పందించరా..? వదిలేశారా.. వద్దనుకున్నారా?

కబ్జాలపై కదలని అధికార యంత్రాంగం



ప్రజాపక్షం/ ఖమ్మం : నిలువ నీడలేక పేదవాళ్లు తలదాచుకునేందుకు చిన్న గుడిసె వేసుకుంటే చాలు పోలీస్ బూట్ల చప్పుళ్లతో ఆ ప్రాంతంలో ఒక యుద్ధ వాతావరణం నెలకొంటుంది. ఆ వెనుక చేతిలో ఫైళ్లతో రెవెన్యూ అధికారులు కారులో నుంచి సర్వే నెంబర్లు, హద్దుల కథలు వినిపిస్తుంటారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ ఎంతటి నేరమో, ఘోరమో దానికి ఎటువంటి శిక్షలు పడతాయో వివరించి ఉన్న నాలుగు సామన్లను విసిరి కొట్టి కూల్చివేస్తారు. మరి ధనవంతుల విషయంలో ఈ చట్టం ఎందుకు చుట్టంగా మారుతుందో అర్థం కావటం లేదు. ధనవంతులు అక్రమిస్తే సలాం చేస్తారా వారు అక్రమిస్తే నేరం కాదా అన్న సామాన్యుని ప్రశ్నకు సమాధానం ఉండదు. ఇప్పుడు ఖమ్మం నగరంలో ఆక్రమణల పర్వం యధేచ్ఛగా సాగుతుంది. కార్పోరేషన్, రెవెన్యూ అధికారులకు ఆక్రమణలపై ఫిర్యాదులు అందాయి. ఎందుకో కానీ ఉలుకు పలుకు లేదు. ప్రభుత్వ స్థలమేగా అని వదిలేశారా, లేక పైరవీల నడుమ మనకేందుకు తలనొప్పి వద్దనుకున్నారో తెలియటం లేదు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూ కబ్జాలు ముఖ్యంగా ప్రభుత్వ స్థలాలను అక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరించారు. అధికారులకు పూర్తి స్వేచ్ఛనిచ్చి కబ్జాదారుల చెర నుంచి ప్రభుత్వ భూమిని రక్షించేందుకు ఫెన్సింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతా బాగానే ఉందనుకుంటున్న దశలో గడిచిన ఆరు నెలలుగా మళ్లీ కబ్జాల పర్వం మొదలైంది. ప్రభుత్వ స్థలాలు నాగార్జున సాగర్ కాలువ కట్టలు ఇప్పుడు యధెచ్ఛగా అక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. రెండేళ్ల పాటు మౌనం వహించిన కబ్జారాయుళ్ల కాలువలు, ప్రభుత్వ స్థలాలు అక్రమించి అనుమతుల కోసం దరఖాస్తు చేస్తున్నారు. డబ్బులిస్తే దేనికైనా రెడీ అంటూ కాసుకూర్చున్న కార్పోరేషన్‌లోని కొందరు అధికారులు దొడ్డిదారిన అనుమతులు ఇచ్చే పనిలో ఉన్నారు. రాజకీయ మార్పులే కబ్జాలు ప్రారంభం కావటానికి కారణమా అన్న చర్చ జోరుగా సాగుతుంది. రెండేళ్ల కాలంలో అటు నుంచి ఇటు చాలా మంది వచ్చి చేరారు. వారిలో ఆక్రమణల చరిత్ర కలిగిన కొందరు ఇప్పుడు తమ బంధువులు, మిత్రులతో ఆక్రమణలకు తెర లేపారు. అక్రమించే వారిలో కోటీశ్వరులు తప్ప సామాన్యులు ఎవరు లేరు. అందుకే కాబోలు రెవెన్యూ, పోలీస్ కార్పోరేషన్ అధికారులు మౌనం వహిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను పేదలు అక్రమిస్తే తప్పు. సంపన్నులు అక్రమిస్తే మేము రక్షణ ఇవ్వలేం అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉంది.

## ముస్లిం కుటుంబాలకు కూనంనేని శుభాకాంక్షలు

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం కుటుంబాల వారికి సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు శుభా కాంక్షలు తెలిపారు. త్యాగం, సేవాభావం, సోదరభావానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ సమాజంలో ఐఖ్యతను పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రతీ కుటుంబంలో సుఖ సంతోషాలు నెలకొని, శాంతి సామరస్యంతో జీవించాలని, అన్ని వర్గాల ప్రజలు పరస్పరం గౌరవంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

## అంబేద్కర్ సెంటర్‌ను ఆధునీకరించండి



ప్రజాపక్షం/ఖమ్మం: ఖమ్మం, వైరా ప్రధాన రహదారిలో జిల్లా పరిషత్‌కు సమీపంలోని అంబేద్కర్ సెంటర్‌ను ఆధునీకరించాలని కాంగ్రెస్ నాయకులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతి పత్రం సమర్పించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఫౌంటెన్‌తో పాటు ఇనుప మెట్లను ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతాన్ని సుందరంగా ఆధునీకరించాలని కోరారు. కోరిన వారిలో మురలీ, రఫీ షేక్, సుందర్‌రావు, రతన్‌రాజు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## వడదెబ్బకు వ్యక్తి మృతి



ప్రజాపక్షం/ఖమ్మం: వడదెబ్బ తగిలి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని సులనగర్‌లో బుధవారం జరిగింది. సూరేపల్లి జయరామయ్య (62) తీవ్రమైన ఎండలకు వడదెబ్బకు గురయ్యారు. వడదెబ్బతో ఇబ్బందులు పడుతున్న అతన్ని ఆసుపత్రికి తరలించి వైద్య సాయం అందించారు. చికిత్స పొంది ఇంటికి వచ్చిన అనంతరం వాంతులు, విరోచనాలయ్యాయి. తిరిగి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. జయరామయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## విద్య ఉంటే విజయం మీ వెంటే



ఎసిపి వసుంధర యాదవ్

ప్రజాపక్షం/సత్తుపల్లి:చదువుకు విలువ ఇస్తే భవిష్యత్తు అందంగా ఆవిష్కరించబడుతుంది. విద్యే విజయానికి మార్గమని, కష్టపడి చదివితేనే విజయం సాధ్యమవుతుందన్నారు సత్తుపల్లి ఎసిపి వసుందర యాదవ్ (ఐపిఎస్). తెలంగాణ పాలీసెట్ ఎంట్రెన్స్2026లో 120/120 మార్కులతో రాష్ట్ర ప్రథమ స్థానం సాధించి సత్తుపల్లి ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో నిలబెట్టిన స్థానిక విశ్వశాంతి విద్యాలయ విద్యార్థి ఎం.డి. అర్ఫాజ్ అలీను గురువారం ఏసీపీ వసుందర యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది తరాల పేదరికాన్ని ఒకే ఒక్క తరంలో పోగొట్టగల శక్తి చదువుకే ఉందన్నారు. విద్య మనిషిని సాధారణ స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకెళ్తుందని. చదువుతో పేదవాడు కూడా ధనవంతుడు కావచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, సమయపాలన, క్రమశిక్షణతో చదివితే జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు. సరర్ఫాజ్ అలీ సాధించిన ఈ ఘనవిజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయ యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, విద్యార్థి తండ్రి అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



ప్రజాపక్షం/చుంచుపల్లి : అకాల వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. చుంచుపల్లి మండలంలోని పెనగడప ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో సుమారు 1200 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉన్నాయి, వాటిని సుజాతనగర్‌లోని రైస్ మిల్‌కు రెండు రోజుల్లోపు తరలింపు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేసి పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షపు నీరు ధాన్యం నిల్వల వద్ద చేరకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొఉనగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలిస్తూ లోడింగ్, రవాణా పనులను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. రైతులకు కేంద్రాల్లో తాగునీరు, నీడ, సదుపాయాలు వంటి అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సిఒ ప్రేమ్ కుమార్, డిఎం సతీష్, చుంచుపల్లి తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ సుభాషిని, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభ్యుదయ వాది వీరేశలింగం గృహ సందర్శన



ప్రజాపక్షం/ ఖమ్మం : అభ్యుదయ వాది సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన ప్రముఖులు రాజమహేంద్రవరంలోని వీరేశలింగం స్వగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గజ్జె తిక్కన్నగా పేరొందిన విరేశలింగం పలు సంఘ సంస్కరణలకు నాంది పలికారన్నారు. తెలుగు సాహిత్య రంగంలో అద్భుత సేవలు అందించారని హితకారిణి సమాజం వివేక వర్ధిని పత్రిక ద్వారా తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. వితంతు వివాహాలు, స్త్రీ విద్య, బాల్య వివాహాల నిర్మూలన కోసం ఆయన పని చేశారన్నారు. సందర్శించిన వారిలో రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షులు డా॥ దుర్గాప్రసాద్, వివిధ కళాశాలల గ్రంథపాలకులు, డా॥ విజయ్‌కుమార్, డా॥ రవికుమార్, నాగరాజు, సిహెచ్ మల్లేశం తదితరులు ఉన్నారు.

## విఒఎ, ఐకెపి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- దీక్షలకు సిపిఐ సంపూర్ణ మద్దతు



ప్రజాపక్షం/మణుగూరు:విఒఎ, ఐకెపి కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని, మణుగూరు ఐకెపి కార్యాలయం ముందు వివో ఏఐకె పి కార్మికులు సంయుక్తంగా రిలే దీక్షలు చేస్తున్న వీరిని సిపిఐ నాయకులు సందర్శించి తమ దీక్షలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఐకెపి, వివో ఏలు గ్రామాలలో ప్రభుత్వ స్కీం లలో పనిచేస్తున్నారని గత ప్రభుత్వం ఇచ్చినటువంటి జీవితాలు సరిపోవడం లేదని ఆందోళన చేసినప్పుడు, ఇప్పుడు ఉన్నటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీరికి కనీస వేతనం 20 వేల రూపాయలకు పెంచుతావని హామీ ఇచ్చిందని ఇచ్చిన హామీ అమలు చేయాలని, వీరు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న ఆందోళన న్యాయమైనదని కావున వీరికి కనీస వేతనం అమలు చేయాలని, వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్ అవకాశం కల్పించాలని, తదితర డిమాండ్స్ ను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఇస్తున్నటువంటి గౌరవ వేతనం ఎటు సరిపోవడం లేదని, నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని ఇల్లు గడిపే పరిస్థితి సామాన్య కుటుంబాలకు లేదని, పొద్దున దాకా పనిచేసే జీతం లేక అప్పుల పాలు కావలసిన పరిస్థితి వస్తుందని, కావున ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీని అమలు చేయాలని కనీస వేతనం 20000 ఇచ్చిన హామీ అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అన్నింటిలో వారు భాగస్వామ్యం అవుతున్నార ని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారనీ ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. మీ ఆందోళనకు సిపిఐ, ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, సిపిఐ సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, గోపిశెట్టి శివయ్య, ఆధర్ల రాములు, ఎం. రమేష్, వెంకటేశ్వర్లు, మరియు పిఓఏ ఐకెపి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు 'సిబిల్ స్కోరే' అడ్డంకి!

- ఎలక్ట్రిక్ బైక్‌లు, ఆటోల కోసం దరఖాస్తు చేసిన నిరుద్యోగుల్లో 90శాతం మందికి నిరాశ
- కూసుమంచి ఎస్‌బిఐ మేనేజర్ ఎన్ శ్రీనివాస్ కఠిన నిబంధనలు




ప్రజాపక్షం/కూసుమంచి:కూసుమంచి మండలంలో ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న ఎలక్ట్రిక్ బైక్‌లు, ఆటోలు మంజూరు పథకం పేద నిరుద్యోగ ఎస్సీ యువతకు ఆశాజ్యోతి కావాల్సి ఉండగా, బ్యాంకులు సివిల్ స్కోర్ నిబంధనలతో ఆ ఆశలు ఆవిరవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పటికీ, కూసుమంచి ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ ఎన్ శ్రీనివాస్ కఠిన ప్రమాణాల కారణంగా నూటికి 90శాతం మందికి పైగా అర్హత కోల్పోతున్నట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది పేద కుటుంబాలకు గతంలో తీసుకున్న చిన్నపాటి రుణాలు, ఫైనాన్స్ బకాయిలు, కరోనా కాలంలో చెల్లింపుల ఆలస్యం వంటి కారణాలతో సివిల్ స్కోర్ తగ్గిపోయింది. దీంతో ప్రస్తుతం సబ్సిడీతో వచ్చే రుణాలకు కూడా బ్యాంకులు తిరస్కరణ తెలుపుతున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. ప్రభుత్వం పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పథకాలు తీసుకొస్తే, బ్యాంకులు మాత్రం కార్పొరేట్ రుణాల మాదిరిగా కఠిన నిబంధనలు పెడుతున్నాయి అంటూ పలువురు నిరుద్యోగ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూసుమంచి మండలంలో దరఖాస్తులు చేసిన పలువురు అభ్యర్థులు ఇప్పటికే అన్ని ధ్రువపత్రాలు సమర్పించినప్పటికీ, చివరి దశలో సివిల్ స్కోర్ కారణంగా తిరస్కరణకు గురవుతున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఉపాధి పథకాలు నిజంగా పేదలకు అందాలంటే బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మరో వైపు, గ్రామీణ పేదలకు సివిల్ స్కోర్‌పై సరైన అవగాహన కూడా లేదని స్థానికులు అంటున్నారు. కొందరి పేర్లపై తెలియకుండానే పెండింగ్ ఫైనాన్స్‌లు, పాత మొబైల్ లోన్లు, చిన్న రుణాలు ఉండటంతో వారు అనర్హులవుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వ పథకాలు ప్రకటించడం ఒకటి, వాటిని నిజంగా పేదలకు అందించకపోవడం మరోకటి అనే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఈ అంశంపై స్పందిస్తూ ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని, సివిల్ స్కోర్‌ను పూర్తి స్థాయి ప్రమాణంగా పరిగణించవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలంటే బ్యాంకింగ్ నిబంధనల్లో సడలింపులు తీసుకురావాలని, లేకపోతే పథకం కాగితాలకే పరిమితమవుతుందని హెచ్చరిస్తున్నారు.

**ఎస్‌బిఐ మేనేజర్ శ్రీనివాస్ వివరణ.....**

సివిల్ స్కోర్ లేని కారణంగా తిరస్కారణకు గురవుతున్న దరఖాస్తుదారుల పరిస్థితి ఏమిటని అందులో పేదలు, నిరుద్యోగులు ఉన్నారని వారి పరిస్థితి ఏమిటని ప్రజాపక్షం విలేకరి వివరణ కోరగా కూసుమంచి ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మేము చేయగలిగేది ఏమీ లేదు ప్రభుత్వ నిబంధనలో అలా ఉన్నాయి, కంప్యూటర్‌లో ఏ విధంగా ఉందో దానినే మేము ఫాలో కావాల్సి ఉంటుందని, మేము మార్పు చేసేది కూడా అక్కడ ఏమి లేదు, చేయగలిగేది కూడా ఏమీ లేదు అని తెలిపారు.

## ప్రజల హృదయాలను గెలిచిన నాయకుడు మదన్‌లాల్



నియోజకవర్గ అభివృద్ధికి శ్రమించిన నేత

తండ్రి ఆశయ సాధనలోనే తనయ

ప్రజాపక్షం/వైరా:వైరా మాజీ శాసనసభ్యులు స్వర్గీయ బానోతు మదన్‌లాల్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వైరాలో ఇండోర్ స్టేడియం సమీపంలో వర్ధంతి కార్యక్రమాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళి అర్పించారు. ఈ వర్ధంతి సభలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మదన్‌లాల్ కూతురు మనీషా లక్ష్మి , వనమా విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు చిలకా కోటయ్య, దొంతిబోయిన వెంకటేశ్వర్లుతో పాటు బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ర్ధంతి సభలో మదన్‌లాల్ కూతురు మనీషా లక్ష్మి మాట్లాడుతూ నిరంతరం ప్రజల హృదయాల్లో మనసు సంపాదించుకున్న నా తండ్రి చూపిన మార్గంలోనే తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజాసేవకే అంకితం అవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పం సురేష్, మాదినేని దుర్గాప్రసాద్, షేక్ లాల్‌మహ్మద్, కామినేని శ్రీనివాసరావు, కొత్తా వెంకటేశ్వరరావు, ఏదునూరి శ్రీనివాసరావు, కారుకొండ బోస్, కందుల ఓంకార్, పారుపల్లి నాగం, తన్నీరు నాగేశ్వరరావు, ఆదూరి ప్రేమ్, బట్టా భద్రయ్య, దారెల్లి పవిత్ర కుమారి, బొడ్డు రామకృష్ణ, దొంతెబోయిన చింతయ్య, మడుపల్లి కృష్ణ, మన్నెం సత్యానందం, నల్లగొండ నాని, బండారు శ్రీను, తన్నీరు కిషోర్,వల్లెపు రాము, దాసరి శ్రీనివాసరావు, ముదిగొండ వెంకటనారాయణ, కరీముల్లా పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలి



ప్రజాపక్షం/మహబూబాబాద్:మహబూబాబాద్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, 18వ వార్డు కౌన్సిలర్ రేషపల్లి నవీన్ 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల ముఖాముఖి ప్రత్యేక సమావేశంలో పలు విషయాలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యంగా గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్డు స్లీపింగ్ మిషన్, సిల్ట్ మిషన్ జరిగిందని అవి నేటికీ ఉపయోగించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన మరమ్మత్తులు చేయించి వాటిని వినియోగంలోకి తేవాలన్నారు. ట్రాక్టర్ల సంఖ్య పెంచి పట్టణంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. 25 వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్ మాట్లాడుతూ పట్టణం విస్తరిస్తుందని జిల్లా కేంద్రమైన మహబూబాబాద్‌లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య సరిపోవడం లేదని వెంటనే అధికారులు పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి మానుకోట అభివృద్ధికి,పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరగడానికి కృషి చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## ధాన్యం కొనుగోలులో జాప్యం



ప్రజాపక్షం/మహాదేవపూర్; ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారి సమస్యలను బిజెపి ఎంపిలు ఈటెల రాజెందర్,రఘునందన్ రావు,నాయకులకు మహాదేవపూర్ మండల నాయకడు సూరం మహేష్ వివరించారు.బుధవారం రైతు గోస బిజెపి భరోసా కార్యక్రమంలో భాగంగా జయశంకర్ జిల్లా కాటారం మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించే క్రమంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు,సమస్యలు రైతుల ధాన్యం కొనుగోలులో జరుగుతున్న జాప్యం,ధాన్యం తరలింపులో కాంట్రాక్టర్లు రైతులను దోచుకుంటున్నారని వివరించి పరిశ్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు




ప్రజాపక్షం/వేలేరు : వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతులు వానాకాలం పంటలకు సంసిద్ధమౌతున్న వేళ ఫర్టిలైజర్స్ యాజమాన్యం ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండడమే కాకుండా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని వేలేరు మండల వ్యవసాయశాఖ అధికారి కవిత అన్నారు.బుధవారం వేలేరు మండల ఫర్టిలైజర్స్ యాజమాన్యంతో వేలేరు మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలుసూచనలు చేశారు.మండలంలోని ఫర్టిలైజర్స్ యాజమాన్యం ఎరువులు,విత్తనాలు అమ్మేటప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే అమ్ముకోవాలని ప్రతికొనుగోలు దారుడికి తప్పని సరిగా రసీదు ఇవ్వడమేకాకుండా స్టాక్ రిజిస్టర్లు కలిగి ఉండాలని కోరారు.ఎవ్వరైనా నాణ్యమైన విత్తనాలు అందించకుండా నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు కార్యక్రమంలో డీలర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్,వేణు,శ్రీకాంత్,రాజు,కుమారస్వామి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను ఎంపిడిఓ పర్యవేక్షణ

ప్రజాపక్షం/మంగపేట:మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద కొత్తపేట బుచ్చంపేట బాలన్నగూడెం చెరువుల వద్దా పూడిక మట్టి పనులను బుధవారం క్షేత్ర స్థాయిలో పరిలించిన మండల పరిషత్ అధికారి పోరిక బద్రు నాయక్ అనంతరం ఉపాధి హామీ కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో పనులు చేస్తున్నారు. త్రాగు అందుతుందా సేద తీర్చడానికి టెంట్ ఆరోగ్య శాఖ నుండి మందులు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ముందస్తుగా అందుబాటులో ఉన్నాయా ఎన్ని గంటలకు వచ్చి ఎప్పుడు వెళ్తున్నారు. గతంలో ఉపాధి హామీ పనుల రూపాయలు వచ్చాయా ఫీల్డ్ అసిస్టెంట్ హాజర్లు వేస్తున్నారా ప్రతి రోజు వస్తున్నాడా వేసవి కాలం కావున ఉదయం వచ్చి కొలతల ప్రకారం కూలి పనిచేస్తున్నారా సగటున న్యాయంగా ప్రభుత్వం అందించే రూపాయలు అందుతున్నాయా ఎవ్వరి జాబ్ కార్డు బ్లాక్ అయితే వారి వివరాలు మాకు తెలియజేయండి అని ఉపాధి హామీ కూలీల బాగోగులు అడిగి తెలుసుకొని ఉపాధి హామీ కూలీలకు సలహాలు సూచనలు ఇచ్చారు. వెంట ఎపిఓ అంకూస్ టెక్నీకల్ అసిస్టెంట్ ఫీల్డ్ ఆసిస్టెట్స్ గద్దం రూపేష్, కల్తీ సత్యం, ఎంపెల్లి సమ్మయ్య, ఆశ వర్కర్స్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి




ప్రజాపక్షం / హనుమకొండ / వేలేరు : శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత తెలిపారు.బక్రీద్ పండుగ సంధర్భంగా బుధవారం వరంగల్ కమీషనరేట్ కార్యాలయంలో మతపెద్దలతో పీస్ కమిటీ మీటింగ్‌ను నిర్వహించారు .ఈసంధర్భంగా డిసిపి మాట్లాడుతూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతిఒక్కరూ జరుపుకోవాలని డిసిపి కవిత ఆకాంక్షించారు.ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జుపుకునేవిధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు.బక్రీద్ పండుగ సంధర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతారణంలో జరిగేలా మతపెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని,ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జురుగుతుందని తెలిపారు.ఈసమావేశంలో కాజిపేట,హనుమకొండ ఏసీపిలు ప్రశాంత్‌రెడ్డి,నరసింహారావుతో పాటు సెంట్రల్‌జోన్ పరిధిలోని ఇన్స్పెక్టర్లు అన్నిమతాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం సహించం

తడి-పొడి చెత్త వేర్వేరుగా సేకరణ తప్పనిసరి*ఊర చెరువు రిటైనింగ్ వాల్ పనులు వేగవంతంగా పూర్తి *హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయి ఆదేశం





ప్రజాపక్షం/హనుమకొండ:హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయి బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా సందర్శించి అభివృద్ధి పనుల పురోగతి, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ముందుగా గోపాలపూర్ ఊర చెరువు వద్ద ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఊర చెరువు డీసిల్టేషన్ టెండర్లు పూర్తయిన నేపథ్యంలో వెంటనే పనులు ప్రారంభించి, వర్షాకాలం ప్రారంభానికి ముందే చెరువును పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని సూచించారు.అదేవిధంగా 56వ డివిజన్‌లోని గోపాలపూర్ ఊర చెరువు సమీపంలో "వేస్ట్ టు ఆర్ట్" కార్యక్రమంలో భాగంగా చెత్త వేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. చెత్త లేకుండా పరిశుభ్రంగా, సుందరీకరణతో తీర్చిదిద్దిన ప్రాంతాలను పరిశీలించి నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు.అనంతరం 53వ డివిజన్ ఆదర్శ్ నగర్‌లో విండో కంపోస్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. బాలసముద్రంలో ఉన్న వెహికిల్ షెడ్, సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను తనిఖీ చేశారు. డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం తగిన స్థాయిలో జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా తడిపొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత జవాన్లు, ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.బాలసముద్రంలోని వర్మీ కంపోస్టింగ్ యూనిట్, విండో కంపోస్ట్, బయో కంపోస్ట్ యూనిట్లను పరిశీలించిన కలెక్టర్, బయో కంపోస్ట్ యూనిట్లు 100 శాతం సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బయో మీథనైజేషన్ ప్లాంట్‌ను కూడా సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీల్లో సిఎంఒహెచ్ డాక్టర్ రాజారెడ్డి,జిల్లా ఇరిగేషన్ అధికారి కిరణ్ కుమార్, డిఇ హర్ష వర్ధన్, సూపర్వైజర్ నరేందర్, ఎస్ఐ భాషా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ యువత ఉద్యోగ సాధనకు ఎస్‌సి స్టడీ సర్కిల్ బలమైన వేదిక కావాలి

నిరుద్యోగ యువత ఉద్యోగ సాధనలో ఎస్‌సి స్టడీ సర్కిల్ ఒక బలమైన వేదికగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.బుధవారం వడ్డేపల్లి సమీపంలోని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్‌సి స్టడీ సర్కిల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. స్టడీ సర్కిల్‌లో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, గతంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల వివరాలను అధికారు లు కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఇక్కడ చేరిన ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తూ విజయాన్ని సాధించాలని సూచించారు. పేద నిరుద్యోగ యువతకు నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత శిక్షణ అందించి పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దడమే ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.డిగ్రీ పూర్తి చేసి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ సర్కిళ్లు అన్ని విధాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాల సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు లో ఉన్నత అధికారులుగా ఎదిగే అవకాశాన్ని వదులుకోకుండా క్రమశిక్షణతో చదువుతూ లక్ష్య సాధనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత ఆత్మవిశ్వాసం తో ముందుకు సాగాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణా అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని తమ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ హనుమకొండ జిల్లా అధికారి బి. నిర్మల, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కె. జగన్మోహన్, వార్డెన్ కృష్ణ, కనకరాజు, బి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సురక్షితమైన పని వాతావరణం కల్పించడం ప్రతీ సంస్థ బాధ్యత

కలెక్టర్ డాక్టర్ సత్య శారద




ప్రజాపక్షం / వరంగల్ : పని ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మహిళలు వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలు తమ రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, పిల్లలకు చిన్నప్పటి నుంచే లింగ సమానత్వం, పరస్పర గౌరవం నేర్పించాలని అన్నారు. షీ టీం ప్రతినిధి సుజాత మాట్లాడుతూ మహిళలపై ఎక్కడైనా వేధింపులు జరిగినట్లయితే షీ టీంను 8712685142 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం షీ బాక్స్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సంక్షేమ అధికారి మాట్లాడుతూ మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2013లో లైంగిక వేదింపుల చట్టాన్ని అమలు చేసిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు జిల్లా స్థాయి కార్యాలయాల్లో 59, మండల, గ్రామస్థాయి కార్యాలయాల్లో 59, ప్రైవేట్ సంస్థల్లో 26 కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డిఎల్ఎస్ఎ అడ్వకేట్ సురేష్ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపుల కేసుల్లో గోప్యత పాటిస్తూ విచారణ చేపట్టాలని, ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా ఇంటర్నల్ పిర్యాదు కమిటీ ఉండాలన్నారు. కమిటీలు ఏర్పాటు చేయని సంస్థలకు జరిమానాలు విధించే నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెంగిక వేదింసుల చట్టానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరణ చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిసిఇఓ రామ్ రెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ సాంబశివరావు, డిబిసిడిఓ పుష్పలత, డిఆర్‌డిఎ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిటి రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన



ప్రజాపక్ష/గూడూరు;మహబూబాబాద్ జిల్లా బొద్దుగొండ గ్రామపంచాయతీ పరిధిలో చిల్లగండితండా నుండి కొంగరి గిద్ద వరకు నిర్మించనున్న బీ టి రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయ క్ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ 2 కోట్ల 80 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. ఈస ందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని ప్ర ధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందన్నా రు.గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు తాగునీరు విద్యుత్ విద్య వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభు త్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పే దలు పేదలు గిరిజనులు వెనుకబడిన వర్గాల సం క్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వం లో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలువుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు.ప్రతి గ్రామా న్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ రహదారి నిర్మాణంతో విద్యార్థులు రైతులు అత్యవసర సేవలకు వెళ్లే ప్రజలకు ఎంతో ఉపయోగం కలుగుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో బొద్దుగొండ సర్పంచ్ బండ కృష్ణ వార్డుసభ్యులు గ్రామ పంచాయతీ కార్యదర్శి సృజన మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న రాష్ట్ర నాయకలు బుడెగే సతీష్ మండల నాయకలు బీరం శ్రీపాల్‌రెడ్డి కొమ్మాలునాయక్ పాల్గొన్నారు

## త్వరితగతిన ధాన్యాన్ని తరలించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రజాపక్షం/భూపాలపల్లి :ఎస్ఎం కొత్తపల్లి ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని ఎస్.ఎం కొత్తపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహు ల్ శర్మ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి లారీల కొరత లేకుండా చూడాలని త్వరితగతిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారుల ను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కటింగ్ లేకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సంబంధిత అధికారులకు సూ చించారు. మిల్లు యజమానులు ధాన్యం కట్టింగ్ అక్రమంగా చేసినట్లయి తే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, డిసిఓ మాలోతు వాళ్య నాయక్ రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల వద్ద రవాణ కొరత



ప్రజాపక్షం /ఖానాపురం : రైతులు ఎండనక వాననక ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసి ధాన్యం కాంటాలై ట్రాన్స్ పోర్ట్ లారీల కొరతతో మిల్లుల వద్ద దిగుమతి కాక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించే సివిల్ సప్లై శాఖ అధికారులు కనీసం కొనుగోలు కేంద్రాల వద్దకు లారీల కొరత ఏర్పడిన మిల్లుల వద్ద దిగుమతి కాక రైతులు నానా ఇబ్బందులు పడుతున్న పట్టించుకున్న పాపాన పోలేదని పలువు రైతులు సివిల్ సప్లై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ పరిధిలోని 10 కొనుగోలు కేంద్రాల ద్వారా నేటి వరకు 73 వేల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సొసైటీ సిఇఒ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ ట్రాన్స్ పోర్ట్ కొరత వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాలు అయిన బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వ ఉన్నాయని , రైతులు ఏర్పాటు చేసుకున్న ట్రాక్టర్లు ఆయా మిల్లుల వద్ద హమాలీల కొరతతో దిగుమతి కాక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నట్లు , తక్షణమే కొనుగోలు కేంద్రాల వద్దకు ట్రాన్స్ పోర్ట్ వాహనాలు వస్తే రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని సిఇఒఅన్నారు. మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను పెంచి త్వరగా దిగుమతులు అయ్యే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు అధికారులను వేడుకుంటూన్నారు. మండుతున్న ఎండలకు ధాన్యం తరిగిపోవడం ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితిలో రైతులు బిక్కుబిక్కుమంటూ రోజులు లెక్కపెట్టుకుంటూ గడిపే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇట్టి విషయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక చొరవ తీసుకొని సివిల్ సప్లై అధికారులను ట్రాన్స్ పోర్టు కొరత లేకుండా, మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను పెంచే విధంగా సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ పురమాయించాలనిమండల రైతులు కలెక్టర్ ను కోరుతున్నారు.

## పంట అవశేషాలను కాల్చొద్దు

ఆత్మ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్:పంట అవశేషాలు కాల్చి రైతు లు అనవసరంగా ఇబ్బందులకు గురికావద్దని ఆత్మ కమిటీ చై ర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ధా న్యపు కొనుగోలు కేంద్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ సుధాకర్ రె డ్డి, మండల వ్యవసాయ అధికారి నరసింహారావుతో కలిసి పరిశీలించి రెండు, మూడు రోజులలో మొత్తం ధాన్యం మిల్లులకు తరిలించే విధంగా త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులనుకోరారు. రైతులతో మాట్లాడుతూ పత్తి, వరి, మొక్కజొన్నలాంటి ఇతర పంటల అవశేషాలను రై తులు అవగాహన లోపంతో కాల్చడం వల్ల భూసారము దెబ్బతిని, ఉపయోగపడే అనేక సూక్ష్మజీవులు చనిపోవడంతో ఎన్ని మందులు వేసిన ప ంట దిగుమతి రాదని, అంతేకాకుండా కా ల్చడం వలన పక్కనే ఉన్న ఇతర పంటలు కాలిపోతున్నాయని, మోనో కార్బన్‌డ యాక్సైడ్ విడుదల కావడంతోదానిని నిలిచిన పక్క రైతులు ఊ పిరాడక అనేక ప్రా ంతాల్లో చనిపోవడంతో అనేక నష్టాలు ఉ న్నందున పర్యావరణ చట్ట ప్రకారంజరిమానాలు, జైలు శిక్ష లతో రైతులు ఇబ్బందుల పాలు కాకుం డా,పంట అవశేషాలను భూమిలోనే కలియ దున్నడంతో అనేక ఉపయోగాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర బాధ్యులు శ్రీపాల్,సంగెం రమ,రేణుక, ప ద్మ, బొల్లం ఉప్పలయ్య, బత్తిని నర్సయ్య, వెంకటయ్య అప్పాల వెంకన్నలు పాల్గొన్నారు.

## ఉదయం తనిఖీలు..సాయంత్రం సమీక్షలు

ప్రజాపక్షం/జనగామ:ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉదయం మండలాలు, గ్రామాల వారిగా కొనుగోలు కేంద్రాలు తనిఖీ చేయడంతో పాటు సాయంత్రం సమీక్ష నిర్వహించి ధాన్యం, మొక్కజొన్నలు ఎప్పటికి అప్పుడు మిల్లులకు తరలించేలా కృషి చేస్తున్నారు. ప్రతి రోజు ఐదారు సెంటర్లలో కొనుగోళ్లను పరిశీలిస్తూ తక్షణమే తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వెంటనే లారీలు వచ్చే విధంగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. బుధవారం రఘునాథపల్లి మండలంలోని పలు కేంద్రాలను సందర్శించి పరిశీలించడంతో పాటు సాయంత్రం బెన్షాలోమ్‌తో కలిసి సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు లక్షా 52వేల 924 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా లక్షా 44వేల 549 మెట్రిక్ టన్నులు మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. 23వేల 275 మంది రైతుల ఖాతాలో 282 కోట్ల రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. అదే విధంగా లక్షా 22వేల 942 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఓపిఎంఎస్‌లో నమోదు చేయడం జరిగిందని అందుబాటులో 572 మంది హమాలీలు ఉన్నారన్నారు. మిల్లులకు వచ్చే ధాన్యానికి సరిపడా హమాలీలను పెట్టుకొని త్వరగా అన్‌లోడింగ్ అయ్యేలా అధికారులు పర్యవేక్షించారు. కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన ఓపిఎంఎస్ నమోదును ఎప్పటికప్పుడు చేయాలన్నారు. రవాణా, గోదాంల నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిఆర్‌డిఓ భాస్కర్, మార్క్‌ఫెడ్ డెం చంద్రశేఖర్, డసో కోదండరాములు, డిఎంఒ రామకృష్ణ, అదనపు డిఆర్‌డిఓ నూరుద్దీన్, పౌరసరఫరాల డిఎం హతిరామ్, జిలీల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, డిసిఎస్‌ఒ సరేష్‌రెడ్డి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని పాల్గొన్నారు.

# పవిత్ర పుష్కర స్నానం పారవశ్యంలో భక్త జనం

కాళేశ్వరం క్షేత్రంలో భక్తుల సందడి
పుష్కర స్నానం ఆచరించిన బర్దీపూర్ పీఠాధిపతి



ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాలు బుధవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. త్రివేణి సంగమ తీరానికి భక్తుల తాకిడి పెరిగి పుష్కర స్నానాలతో సందడిగా మారింది. సుదూర ప్రాంతాల నుండి భగభగమంటున్న ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుండే కాళేశ్వరం క్షేత్రానికి చేరుకన్నారు. అనంతరం భక్తులు త్రివేణి సంగమ సరస్వతి నదిలో పుష్కర స్నా నాలు ఆచరించి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. తీరం వద్ద ఇసుకతో సైకత లింగాలు ఏర్పాటు చేసిన మహిళా భక్తులు దూపదీప నైవేద్యాలు సమర్పించి తమ కుటుంబాలతో కలిసి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దీపాలు వెలిగించి తీరంలో వదిలి నదీ మాతల్లికి రెండు చేతులెత్తి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామి వారిని నేత్ర ప ర్వంగా దర్శించుకుని భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆలయంలో భక్తుల తాకిడి పెరిగి సర్వదర్శనం క్యూలై న్లు నిండిపోయి భక్తులతో బారులు తీరాయి.క్యూలైన్ల వెంట దేవస్థానం వాలంటీర్లు భక్తులకు తాగునీరు,మజ్జిగ ప్యాకెట్లు అందించారు.

**పష్కర స్నానం ఆచరించిన బర్దిపూర్ పీఠాధిపతులు**

కాళేశ్వరం క్షేత్రంలో కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా ఝురాసంగం మండలం బర్దిపూర్‌కు చెందిన శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు, తెలుగు రాష్ట్రాల మహామండలేశ్వర్ శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ త్రివేణి సంగమ సరస్వతీ తీరంలో బుధవారం ఉదయం పుష్కర స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకు ముందు పీఠాధిపతికి ప్రధాన రాజగోపురం వద్ద ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి ప్రత్యేక పూజల అనంతరం పీఠాధిపతికి స్వామి వారి శేష వస్త్రాలు అందించి శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జ్యోతి, ఆర్‌జెసిరామకృష్ణారావు, కార్యనిర్వహణ అధికారి మహేష్, దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మ పాల్గొన్నారు.



## భార్య చేతిలో భర్త హతం

**ప్రజాపక్షం/రామడుగు :** కుటుంబ సభ్యులకు తెలియకుండా భర్త ఎకరం భూమి అమ్మకానికి పెట్టడానికి కోపం పెంచుకున్న భార్య భర్తనే హత్య చేసిన సంఘటన మండలంలోని కొక్కెరకుంట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొక్కెరకుంట గ్రామానికి చెందిన వేముండ్ల రాజయ్య (65)కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. కాగా రాజయ్య కుమార్తెల వివాహానికి వ్యవసాయంలో వచ్చిన నష్టానికి పలువురి వద్ద అప్పులు చేశాడు. ప్రస్తుత పరిస్థితుల్లో అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా ఒక ఎకరం భూమిని అమ్మకానికి పెట్టాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు భూమి అమ్మడాన్ని అడ్డుకున్నారు. ఈ విషయమై గత 10 రోజులుగా కుటుంబంలో తీవ్రంగా గొడవలు జరుగుతుండడంతో విషయం కాస్త రామడుగు పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చిన రాజయ్య తన అప్పులు తీర్చడం కోసం వ్యవసాయ భూమిని అమ్మక తప్పదని కుటుంబ సభ్యులకు తేల్చి చెప్పడంతో ఆగ్రహించిన భార్య వేముండ్ల కనకమ్మ ఎలాగైనా భూమి అమ్మకాన్ని ఆపాలంటే తన భర్తను చంపాలని నిర్ణయం తీసుకుంది. మద్యం మత్తులో ఉన్న రాజయ్య తల, ఛాతిపై రోకలి బండతో బుధవారం ఉదయం మోది కొట్టి చంపిందని తెలిపారు. గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితురాలిని అదుపులోకి తీసుకొని మృతుడి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

## జూన్ 5 నుండి వేములవాడలో సిపిఐ రాజకీయ శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్ :** వేములవాడలోని మున్నూరు కాపు సత్రంలో బుధవారం సిపిఐ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే జూన్ నెల 5, 6, 7 తేదీలలో వేములవాడలోని 2వ బైపాస్ రోడ్డులో గల బిగ్ బాస్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు జరగనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణా తరగతులకు ప్రజలు, పార్టీ శ్రేణులు అన్ని రకాల సహాయ సహకారాలు అందించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు కలవేణి శంకర్ హాజరయ్యారు. వారితో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని సిపిఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బోయిని అశోక్, సిరిసిల్ల జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణు, కడారి రాములు, మీసం లక్ష్మణ్, పంతం రవి, మంద అనిల్, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలు దొంగిలించిన ఆగంతకులు


గర్రెపల్లి ప్రాథమిక పాఠశాలలో సిసి కెమెరాల దొంగతనం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సాధారణంగా ఏదైనా దొంగతనం జరిగితే సీసీ కెమెరాలు ద్వారా పట్టుకోవడం సహజం కానీ సీసీ కెమెరాలు దొంగతనం జరిగితే ఇలా పట్టుకోవడం ఎలా.? సీసీ కెమెరాలను దొంగలించిన ఘటన సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. మంగళవారం తుఫాను కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో ప్రాథమిక పాఠశాలలో సిసి కెమెరాల దొంగతనం, విధ్వంసం జరిగినట్లు హెచ్ఎం అశోక్ కుమార్ తెలిపారు. పాఠశాలలోని 3 కెమెరాలు దొంగిలించబడ్డాయి అని వాటిలోని అనేక భాగాలు పగిలిపోయి ఉన్నాయని తెలిపారు. ఆ పరికరాల సమీపంలోకి బలవంతంగా ప్రవేశించి రాళ్లతో పాడు చేసిన స్పష్టమైన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. గ్రామ సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్ విషయం తెలిపారని అన్నారు.

## వరి, మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేయాలి

అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** వరి, మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖల అధికారులతో మరియు రైస్ మిల్లర్లతో, లారీ అసోసియేషన్ వారితో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ గురించి సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోళ్లు 80 శాతం వరకు పూర్తయిందని మిగిలిన కొనుగోళ్లు పూర్తి స్థాయిలో త్వరితగతిన పూర్తి చేయాలని దానికి అనుగుణంగా చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందని అదేవిధంగా ధాన్యం దిగుమతి విషయంలో రైస్ మిల్లర్లు వేగం పెంచాలని రైస్ మిల్లర్లను కోరడం జరిగిందని అన్నారు. రైతులు ఎవ్వరూ ప్రతిపక్షాల కల్లబొల్లి అసత్యపు మాటలను నమ్మవద్దని రైతుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని గుర్తు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో పౌరసరఫరాల శాఖ డి.ఎం శ్రీకాంత్ రెడ్డి, శ్రీనాథ్ అధికారులు, రైస్ మిల్లుల యజమానులు, లారీ అసోసియేషన్ వారు తదితరులు పాల్గొన్నారు.

# బీభత్సం సృష్టించిన గాలి వాన

కూలిన ఇండ్లు, నేలకొరిగిన చెట్లు, హోర్డింగులు

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన మక్కలు, వడ్లు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. బలమైన గాలితో పాటు వర్షం కురవడంతో నగరంలోని చెట్లు, హోర్డింగ్‌లు, కరెంట్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. రూరల్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం, మక్కలు తడిసిపోయాయి. కరీంగనర్ రూరల్ మండలంతో పాటు చొప్పదండి, గంగాధర, మానకొండూర్ మండలాల్లో వర్షం తీవ్ర ప్రభావం చూపింది. చొప్పదండి నియోజకవర్గంలోని చొప్పదండి, గంగాధర మండలాల్లో గంగాధరతో పాటు బూరుగుపల్లి, లక్ష్మి దేవి పల్లి లో నష్టం వాటిల్లింది. చొప్పదండి మండలంలో చొప్పదండితోపాటు ఆర్నకొండ రాగంపేట, గుమ్లాపూర్ గాలివాన ప్రభావానికి చెట్లు నేలకొరగగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అర్ధరాత్రి వరకు పలు గ్రామాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ధాన్యాన్ని సాధ్యమైనంత తొందరగా కొనుగోలు చేయాలని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే కరీంనగర్ మండలంలోని బొమ్మకల్, చేగుర్తి, నగునూర్ తదితర గ్రామాల్లో వర్షం ప్రభావంతో ఇండ్లు కూలిపోయాయి, బొమ్మకల్ గ్రామానికి చెందిన గండికోట రాజేశ్ ఇల్లు పూర్తిగా నేలమట్టమయింది. అలాగే చేగుర్తి, బొమ్మకల్, నగునూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. బొమ్మకల్ గ్రామంలో కేంద్రమంత్రి బండి సంజయ్ బుధవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలన్నారు. అలాగే కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పి.. అప్పటికప్పుడు హమాలీలను మాట్లాడి ట్రాక్టర్లు ఏర్పాటు చేసి స్వయంగా ధాన్యాన్ని కాంట చేయించి రైస్ మిల్లులకు తరలించారు.

**జిల్లా కేంద్రంలో..** నగరంలో గాలివాన ధాటికి పలు ప్రధాన రహదారులతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, అంతర్గత రోడ్లపై పెద్ద ఎత్తున చెట్లు, వాటి కొమ్మలు విరిగిపడ్డాయి. కలెక్టరేట్ రోడ్డుతో పాటు పలు ప్రధాన రహదారుల్లో స్మార్ట్ సిటీ వీధి దీపాల స్తంభాలతో పాటు, పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పరిస్థితిని సమీక్షించేందుకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ నగరంలో బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. వేరువేరుగా పలు డివిజన్లలో పర్యటించి....విరిగిపడిన చెట్లు, వాటి కొమ్మలు, కూలిన గోడలు, తెగిపడిన విద్యుత్ తీగలను క్షేత్రస్థాయిలో పరిశీలించి...అధికారులు, సిబ్బంది, కార్మికులను ఆదేశించారు.



మేయర్, కమీషనర్ పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగాయి.

**మానకొండూరు మండలంలో....** మానకొండూర్ మండలంలో మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాలలో రహదారులపై భారీ వృక్షాలు నేలమట్టం కావడంతో వాహనదారులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెల్ది నుండి వేగురుపల్లికి వెళ్లే రహదారిపై స్తంభాలు, వృక్షాలు పడిపోవడంతో వెళ్లడానికి రహదారి లేక వెల్ది గ్రామంలో ఆర్టీసి బస్సులు నిలిచిపోయాయి.బస్సులో ప్రయాణించిన లక్ష్మీపూర్, వేగురుపల్లి, ఊటూరు, గ్రామాలకు చెందిన ప్రయాణికులు బస్సులోనే ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెల్ది, లక్ష్మిపూర్, రంగపేట, ఊటూరు, లింగాపూర్, జగ్గయ్యపల్లి, వేగురుపల్లి గ్రామాలలో గాలివాన బీభత్సానికి 11 కెవి లైన్‌లో 58 పోల్స్, ఎల్‌టీ లైన్లో 33 పోల్స్ అలాగే 20 ట్రాన్స్ఫార్మర్స్ నేలమట్టం అయ్యాయి. బుధవారం రాత్రి వరకు మరమ్మతులు కొనసాగడంతో విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. ఈ విపత్తు వలన సుమారు రూ.10 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు మానకొండూరు ఏఈ ఆర్. సత్యనారాయణ తెలిపారు.



## అంజన్న సన్నిధిలో ప్రభుత్వ విప్ ఆది

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం లో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి వారిని బుదవారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వస్తి, వేదమంత్రాలతో ఆయనకు ఘన స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్. అంజనా రెడ్డి, ఏఈఓ గుండి హరిహరనాథ్, టెంపుల్ సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవాలకు బిజిగిరి షరీఫ్ దర్గా ముస్తాబు

**ప్రజాపక్షం/జమ్మికుంట :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామంలోని ప్రముఖ ముస్లిం పుణ్య క్షేత్రం హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహ్మతుల్లాహ్ అలై దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభవుతున్నాయి. వందల ఏళ్ల నుంచి కులమతాలకతీతంగా సర్వమతాలకు వేదికగా కుల, మత, వర్గ, సామాజిక వైషమ్యాలకు అతీతంగా జరిగే ఉర్సు ఉత్సవాలు వేదికగా నిలుస్తుంది. నేటి నుంచి



మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి దర్గాను దర్శించుకుంటారు. తమ కష్టాలు తొలిగిపోవాలని కోరికలు నెరవేరాలని వేడుకుంటారు. వివిధ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తులు రావడం విశేషం.

**ఉర్సు ఉత్సవాలు...** ఉర్సు ఉత్సవాల సందర్భంగా 28 గురువారం బక్రిద్ పండుగ సాయంత్రం గుసుల్ షరీఫ్ కార్యక్రమం నిర్వహిస్తారు. దర్గా ముతావలి మహ్మద్ అక్బర్ అలీ దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో జరిగే చాదర్ గుల్ కార్యక్రమంలో దర్గా ముజావర్లు హైదరాబాద్ నుంచి తెచ్చిన చాదర్లు దర్గాలోని సమాధులకు అలంకరించనున్నారు. రాత్రి కొత్తగూడెం వాస్తవ్యులైన కీ.శే.గాజి గోవర్ధన్ మిత్ర బృందం సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదానం చేయనున్నారు. ముఖ్య ఘట్టమైన సంధల్ షరీఫ్ (గ్రంధలేవనం) ను మొల్లపల్లె, పెద్ద బిజిగిరి షరీఫ్ గ్రామాల నుంచి ఉత్సాహపూరిత వాతావరణంలో భక్తుల మేళతాలాల మధ్య సంధల్‌ను ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో సమాధులకు అలరింపజేస్తారు. ఉర్సు సందర్భంగా మహ్మద్ ప్రవక్త ఉపదేశాలను అలపిస్తూ ఖవ్వాలి సమ్మేళనాలు జరుపుతారు. ప్రముఖ ఖవ్వాలి పార్టీ నాందేడ్ కు చెందిన మహ్మద్ సలీమ్, మహారాష్ట్రలోని లాతూర్ పాషా బృందం ఖవ్వాలీలు అలపించనున్నారు. కొత్తగూడెంకు చెందిన భక్తులు గాజి గోవర్ధన్ మిత్ర బృందం గత 19 సంవత్సరాల నుంచి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

**ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు ...** ఉర్సు ఉత్సవాలు జరుపుటకు దర్గా ముతవలి కమిటీ దర్గాను చారిత్రక కట్టడాలకు రంగులు వేయించారు. దర్గాను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం తాగునీరు, వైద్యం, పోలీస్ బందోబస్తు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్, ఉపాధ్యక్షుడు మొహ్మద్ అబ్దుల్ కరీం, కార్యనిర్వహణ అధ్యక్షుడు మొహ్మద్ తౌఫిక్ హుస్సేన కార్యదర్శి మహ్మద్ జమాల్ అష్రఫ్, సంయుక్త కార్యదర్శి నయిమొద్దీన్, షాహుస్సేన్, సర్వర్, సభ్యులు మహమ్మద్ లతీఫ్ హుస్సేన్, ఇమ్రాన్ హుస్సేన్, ఆజమ్, జలీల్ తాజ్ పాల్గొననున్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యా న్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిల్లులకు చేరిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్‌లోడింగ్ చేసి, డాటా ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్ బిఎస్ఎస్ వరప్రసాద్, ఎంపీడీవో సిహెచ్.గణేష్, నాయబ్ తహసిల్దార్ ఉమాపతి, ఆర్ఐలు, సర్పంచ్ ఫోన్ కంటి చిన్న వెంకట్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దోమకొండ చిన్న రాజన్న, సంబంధిత అధికారులు, సెంటర్ ఇన్చార్జ్, తదితరులు పాల్గొన్నారు.

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన**

జగిత్యాల రూరల్ మండలం చలిగల్‌లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని బుధవారం సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. చేపట్టనున్న పాఠశాల నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలను సమగ్రంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జగిత్యాల డిఈఓ రాము, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకిమ్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట :** అధికారంలో ఉన్న కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు తమ బాధ్యతలను విస్మరించి రైతులను మోసపుచ్చుతూ నాటకాలు ఆడుతున్నాయని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. వడ్లు, మక్కలు, సన్‌ఫ్లవర్, శనగలు, జొన్నలు కొనమంటే కాంగ్రెస్ నాయకులమీద నెపం పెడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నాయకులు వడ్లు కొనాలని ఇక్కడ ధర్నాలు చేస్తున్నారని, పెరిగిన పెట్రోల్, డిజిల్ పెరిగాయని ఇక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు రోడ్డెక్కుతున్నారన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు ఇబ్రహింనగర్, గోనేపల్లి గ్రామాల్లోని వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యంతో కన్నీరు పెడుతున్న రైతులను ఓదార్చారు. ఈసందర్భంగా చిన్నకోడూరులో మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎరువులకు వడ్లు కొనుగోళ్లకు ఏనాడు ఇబ్బంది రాలేదన్నారు. బిఆర్ఎస్ నేతలు రాధకిషన్ శర్మ, మాజీ ఎంపిపి మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్, శ్రీహరి పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** రైతులు కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చి కోసి ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో పాలక ప్రభుత్వాలు సరైన సమయానికి వాటిని కొనుగోలు చేయడం లేదని,అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. తీవ్రమైన ఎండలు మండిపోవడం మూలంగా వంద మందికి పైన వడదెబ్బతో మృతి చెందారని, రైతులు ఎండకు ఎండుతూ వర్షానికి నాన్నతో తీవ్రమైన అవస్థలు పడుతున్నారని, ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతుందని గన్ని బ్యాగులు, హమాలీల కొరత ఉండడం మూలంగా ఆలస్యం అవుతుందని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎఫ్.సి.ఐ గోడౌన్‌లో నిల్వ ఉంచాలని, మద్దతు ధర ఇవ్వాలని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు చొరవ చూపాలని, మక్కలు పూర్తిగా కొనుగోలు చేయక డబ్బులు ఇవ్వకపోవడం మూలంగా రైతులు అనేక ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సామాన్యులపై పెను




భారం వేసిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మహాసభల ప్యాట్రన్ కలవేన శంకర్, ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, టేశీనివాస్ సమ్మయ్య, కోశాధికారి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఆహ్వాన సంఘం నాయకులు పొనగంటి కేదారి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కాశెట్టి లక్ష్మయ్య, పిట్టల సమ్మయ్య, వెల్దండి దామోదర్, పిట్టల శ్రీనివాస్, బెజ్జంకి కాళిదాస్, అల్లేపు రాజు, కేంసారం నర్సయ్య, పి.శ్రీనివాస్, జక్కుల ఆగయ్య, బాగోతం వీరయ్య, ఏం.తిరుపతి, పి.కొమురయ్య, గందే కొమురయ్య, మహేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతులు ఇబ్బంది

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి రైతులు అరిగోస పడుతున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బుధవారం కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, దుర్శెడ్ గ్రామాల్లో సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరుకుల్ల గ్రామంలో రూ.20 లక్షలతో వేసిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం ఇస్తే ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రణాళిక లేక ధాన్యం కొనుగోలు చేయడం ఇబ్బందిగా మారితే కేంద్రం వద్దకు పైసలివ్వడం లేదని లేఖ రాసే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానకి ఉందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార మండల ఎంపిడివో, ఎంపివో జగన్మోహన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి అభినవ్, సర్పంచ్ రమేశ్, ఉప సర్పంచ్ రాకేశ వార్డు మెంబర్లు, బిజెపి నాయకులు అనిల్, సంపత్, రాము, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాస్, గోపాల్, రమేశ్ మండల నాయకులు కమలాకర్ రెడ్డి, శివరామకృష్ణ, అమరేందర్ రెడ్డి, సుజన్, శ్రీనివాస్, శంకరయ్య, అరవింద్, దేవేందర్, నగేశ్, అనిల్ పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయంలో నో 'మీడియేటర్స్'



బాలసదనం ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని బాలసదనం, వృద్ధాశ్రమం, తహసీల్దార్ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అకస్మిక తనిఖీ చేశారు. మే 29న ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా బాల సదనం ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సుల్తానాబాద్‌లోని బాలసదనం, వృద్ధాశ్రమం, తహసీల్దార్ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మే 29న ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా బాలసదనం ప్రారంభోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాలసదనం నిర్వహణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, చిన్నారులకు సౌకర్యవంతమైన మరియు భద్రమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ అక్కడి వసతులు, ఆహారం, పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. తదుపరి సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవా ద్వారా వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చే దరఖాస్తులను సకాలంలో స్క్రూటినీ పూర్తి చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తులకు ఎలాంటి అవకాశం ఉండదని స్పష్టం చేసిన కలెక్టర్, ప్రజలు తమ సమస్యలను నేరుగా తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలకు సత్వర సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పర్యటనలో బి.డబ్ల్యూ.ఓ. వేణుగోపాల్, సుల్తానాబాద్ తహసీల్దార్ బషీరోద్దీన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీ : యువకుడు మృతి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** టిప్పర్ లారీ ఢీ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సుల్తానాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మధ్యాహ్నం ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన కోట నిరంజన్ రెడ్డి తన బైక్‌పై నాంసానిపల్లి గ్రామ వాసి అయినటువంటి పోతుగంటి రాజుతో కరీంనగర్ వెళుతుండగా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి ఎస్సారెస్పీ కెనాల్ దగ్గరికి చేరుకునేసరికి కరీంనగర్ వైపు బూడిద లోడుతో వెళ్తున్నటువంటి టిప్పర్ డ్రైవరు వాహనాన్ని అతివేగంగా ఆజాగ్రత్తగా నడిపి వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడగా మృతుడు కోట నిరంజన్ రెడ్డి నడుంపై నుండి లారీ టైర్ ఎక్కడంతో తీవ్ర గాయాలై అంబులెన్స్‌లో ఆసుపత్రి చేరుకునే సరికి చనిపోయాడు. అదేవిధంగా పోతుగంటి రాజుకు చిన్నచిన్న గాయాలు అయినాయి. ఈ విషయంలో మృతుడి భార్య కోట అపర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై చంద్రకుమార్ డ్రైవర్ పెంచాల రవీందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జవాబు పత్రాలు ఇవ్వండి

# వెల్లువెత్తిన సిబిఎస్ఇ విద్యార్థుల అభ్యర్థన

**న్యూఢిల్లీ:** సిబిఎస్ఇ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్ఎం) పద్ధతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానం కారణంగానే తమ సమాధాన పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థులు ఆరోపించడం తీవ్ర దుమారం రేపింది. దీంతో జవాబు పత్రాల స్కానింగ్ కాపీల కోసం విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థనలు వస్తున్నాయి. పరీక్ష రాసిన ప్రతి నలుగురు విద్యార్థుల్లో ఒకరు బోర్డుకు అభ్యర్థన పంపిస్తున్నారు. ఈ ఏడాది దాదాపు 17 లక్షల మంది విద్యార్థులు సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షలు రాశారు. వీరిలో ఇప్పటివరకు 4,04,319 మంది విద్యార్థులు తమ జవాబు పత్రాల స్కానింగ్ కాపీలను అడిగినట్లు బోర్డు వెల్లడించింది. మొత్తంగా 11,31,961 ఆన్సర్ బుక్‌ల కోసం విద్యార్థుల నుంచి ఈ అభ్యర్థనలు వచ్చినట్లు తెలిపింది. ఇందులో 8,98,214 జవాబు పత్రాలను ఇప్పటికే ఆన్ లైన్‌లో షేర్ చేశామని, మిగతా వాటిని బుధవారం సాయంత్రంలోగా అందుబాటులో ఉంచుతామని పేర్కొంది. మార్కుల వెరిఫికేషన్, జవాబు పత్రాల పునర్వల్యాంకన కోసం రూపొందించిన ప్రత్యేక పోర్టల్ 29 నుంచి లైవ్‌లోకి వస్తుందని సిబిఎస్ఇ బోర్డు వెల్లడించింది. మే 13 న సిబిఎస్ఇ బోర్డు 12 వ తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. ఇందులో ఉత్తీర్ణత గత ఏడాదితో పోలిస్తే 3 శాతం తగ్గింది. అయితే ఈ ఏడాది జవాబు పత్రాల వల్యాంకనం కోసం కొత్తగా తీసుకొచ్చిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్ఎం) వల్లే తమకు తక్కువ మార్కులు వచ్చాయని కొంత మంది విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన బోర్డు విద్యార్థులకు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలను అందిస్తామని, సరిచూసుకొని పునర్వల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అయితే ఈ పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. పునర్వల్యాంకన ప్రక్రియలో భాగంగా సిబిఎస్ఇ అప్‌లోడ్ చేసిన భౌతికశాస్త్ర సమాధానపత్రం తనది కాదని దిల్లీకి చెందిన వేదాంత్ అనే విద్యార్థి ఆరోపించాడు. సంజన అనే 12వ తరగతి విద్యార్థిని కూడా తన రసాయనశా సమాధాన పత్రం తారుమారైందని ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన బోర్డు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది.

**సిబిఎస్ఇ ఫలితాలపై న్యాయ విచారణ: రాహుల్ గాంధీ డిమాండ్**

సిబిఎస్ఇ ఫలితాల్లో భారీ అవకతవకలు జరిగాయని, దీనిపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బుధవారం డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో చాలా మంది విద్యార్థులకు తప్పుడు మార్కులు రావడం గురించి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఈ అంశంపై రాహుల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. సీబీఎస్ఈ ఫలితాల్లో జరిగిన తప్పులు, అవకతవకలపై దేశంలోని పిల్లలు, వారి తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రధాని మోదీకి జవాబుదారీతనం లేదని విమర్శించారు. సిబిఎస్ఇ ఫలితాల్లో భారీ అక్రమాలు జరిగాయని, దీనిపై స్వతంత్ర జ్యుడీషియల్ విచారణ జరిపించడంతో పాటు వేగంగా విచారణ పూర్తయ్యేందుకు ఒక సిట్ ఏర్పాటు చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. పరీక్షా పత్రాలను వల్యాంకనం చేసిన 'సిఒఇఎంపిటి' సంస్థపై కూడా ఆయన ఆరోపణలు చేశారు. గతంలో ఈ సంస్థ తెలంగాణలో గ్లోబ్ ఎరేనా పేరుతో పరీక్షా పత్రాలను వల్యాంకనం చేసింది. అప్పటిలో తెలంగాణలో 2019 ఇంటర్ ఫలితాల వెల్లడిలో జరిగిన అక్రమాలపై కూడా వివాదం నడిచింది. ఇప్పుడు అదే సంస్థ




'సిఒఇఎంపిటి' పేరుతో కొనసాగుతోంది. దీనిపై రాహుల్ స్పం దిస్తూ... సంస్థ పేరు మారింది కానీ, వారి ఉద్దేశాలు, స్వభావం మాత్రం మారలేదని విమర్శించారు. గతంలోనే వివాదాలు ఉన్న సంస్థకు మళ్లీ జవాబు పత్రాల వల్యాంకనం చేసే అవకాశం ఎలా కల్పించారని, ఏవైనా నియమ, ని బంధనలు ఉల్లంఘించారా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సం స్థకు బాధ్యతలు అప్పగించే ముందు సరైన తనిఖీ నిర్వహించారా అని నిలదీశారు. సిబిఎస్ఇ ఫలితాల్లో జరిగిన తప్పులపై ప్రభుత్వాన్ని, సంస్థను రాహు ల్ తప్పుపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'మీ శ్రమను, మీ భవిష్యత్‌ను ఇతరులు ఎవరూ దోచుకోవడానికి వీల్లేదు' అంటూరాహుల్ స్పందించారు.

## రూ.10 వేల కోట్ల
### ఎల్ఐసిలోవాటా విక్రయ సన్నాహాలు




**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసిలో మరోసారి వాటా విక్రయానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వచ్చే నెలలో ఈ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దాదాపు 2 శాతం వాటాకు సమానమైన షేర్లను విక్రయించాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వాటా విక్రయం ద్వారా సుమారు రూ.10 వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నాయి. సంస్థాగత మదుపర్లకు ఈ వాటాలు విక్రయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ జూన్ చివరిలో లేదా జులైలో ఉండొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ లావాదేవీని నిర్వహించడానికి గోల్డ్‌మన్ శాక్స్, మోతీలాల్ ఓస్వాల్, బీఎన్‌పీ పరిబాస్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ వంటి ప్రముఖ సంస్థలతో ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఒక విభాగం పని చేస్తోందని తెలిసింది. 2022 మే నెలలో ఎల్ఐసీ 3.5 శాతం వాటాకు సమానమైన షేర్లను ఐపిఒ ద్వారా విక్రయించి సుమారు రూ.21 వేల కోట్లు సమీకరించింది. అయితే సెబీ నిబంధనల ప్రకారం... జాబితా అయిన 10 ఏళ్లలోపు లిస్టెడ్ కంపెనీ తన పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను కనీసం 25 శాతానికి పెంచాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వానికి ఎల్ఐసిలో 96.5 శాతం వాటా ఉంది. పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను పెంచే ప్రయత్నాల్లో భాగంగానే ప్రభుత్వం ఈ తాజా వాటా విక్రయానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ప్రభుత్వం గానీ, ఎల్ఐసీ గానీ అధికారికంగా స్పందించలేదు.

### నీట్ పేపర్ లీకేజీ

## మరో ఇద్దరి అరెస్ట్

**నూఢిల్లీ:** నీట్ జీ పరీక్ష లీకేజీ కేసులో బుధవారం ఇద్దరు అరెస్టయ్యారు. లాతూరుకు చెందిన ఓ డాక్టర్‌ను, పుణె కోచింగ్ ఇన్స్‌టిట్యూట్‌కు చెందిన ఫిజిక్స్ టీచర్‌ను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ముగ్గురు నీట్ విద్యార్థులకు సహకరించిన కేసులో డాక్టర్ మనోజ్ షిరూర్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. రేణుకాయి కెమిస్ట్రీ క్లాసెస్ వ్యవస్థాపకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావకర్ కుమారుడికి మనోజ్ ప్రశ్నలు అందించినట్లు తెలిసింది. నీట్ కెమిస్ట్రీ పేపర్‌ను సెట్ చేసిన పీవీ కులకర్ణి నుంచి మనోజ్ ప్రశ్నలు రాబట్టినట్లు భావిస్తున్నారు. ఆర్సీసీ వ్యవస్థాపకుడు శివరాజ్‌ను ఈ కేసులో ఇప్పటికే సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పుణెలో ఉన్న డాక్టర్ అభంగ్ ప్రభు మెడికల్ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్న తేజస్ హర్షద్ కుమార్ షాను సిబిఐ అదుపులోకి తీసుకుంది. పేపర్ లీకేజీ కేసులో అరెస్టు అయిన మనీషా హవల్దార్ నుంచి ఫిజిక్స్ ప్రశ్నాపత్రాన్ని షా అందుకున్నట్లు తెలుస్తోంది. నీట్ జీ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకు మొత్తం 13 మంది అరెస్టు అయ్యారు. ఈ కేసులో పాల్గొన్న ముఠాను అరెస్టు చేసేందుకు సిబిఐ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇప్పటి వరకు 49 లొకేషన్లలో సీబీఐ సోదాలు చేపట్టింది. అనేక డాక్యుమెంట్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లను సీబీఐ సీజ్ చేసింది. మే 3వ తేదీన జరిగిన నీట్ జీ పరీక్షను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మే 12వ తేదీన ప్రకటించిన విషయం తెలిసిందే. ఢిల్లీ, జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, లాతూరు, అహిల్యానగర్ నుంచి 13 మందిని అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. విద్యార్థులకు ప్రశ్నపత్రాన్ని లీక్ చేసి, లక్షలు సంపాదించిన మధ్యవర్తులను అరెస్టు చేశారు.



## ఆశారామ్‌కు రాజస్థాన్ హైకోర్టు షాక్

**జైపూర్:** ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపుకు రాజస్థాన్ హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. మైనర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో కింది కోర్టు విధించిన జీవిత ఖైదును హైకోర్టు సమర్థించింది. ఈ మేరకు ఆశారాం దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుతం మధ్యంతర వైద్య బెయిల్‌పై బయట ఉన్న 86 ఏళ్ల ఆశారాం వెంటనే అధికారుల ఎదుట లొంగిపోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే ఇదే కేసులో సహ నిందితులుగా ఉన్న శిల్పి, శరత్‌చంద్‌ను నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు విముక్తి కల్పించింది. జస్టిస్ అరుణ్ మోంగా, జస్టిస్ యోగేంద్ర కుమార్ పురోహిత్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 2013 ఆగస్టులో జోధ్‌పూర్‌లోని తన ఆశ్రమంలో మైనర్ బాలికపై ఆశారాం లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం జోధ్‌పూర్‌లోని ప్రత్యేక పోక్సో కోర్టు 2018 ఏప్రిల్ 25 న ఆశారాంను దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆశారాం హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై 2026 ఫిబ్రవరి 16 నుంచి ఏప్రిల్ 20 వరకు హైకోర్టు రోజువారీ విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు బుధవారం తుది తీర్పు ఇచ్చింది. విచారణ సమయంలో ఆశారాం తరఫు న్యాయవాదులు




ఇది కట్టుకథ అని వాదించారు. అయితే బాధితురాలి తరఫు న్యాయవాది పిసి సోలంకి ఈ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. పోక్సో చట్టం ప్రకారం బాధితురాలి వాంగ్మూలమే శిక్ష విధించడానికి సరిపోతుందని, ఈ విషయాన్ని సుప్రీం కోర్టు అనేక సార్లు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఆశారాం ఇప్పటికే గుజరాత్‌లోని గాంధీనగర్ ఆశ్రమంలో మరో మహిళపై అత్యాచారం కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. వద్ధాప్యం, అనారోగ్య కారణాలతో అనేక సార్లు బెయిల్ కోసం ప్రయత్నించిన ఆయనకు, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు మధ్యంతర వైద్య బెయిల్ మంజూరు చేసింది. తాజా తీర్పుతో ఆయన మళ్లీ జైలుకు వెళ్లకు తప్పని పరిస్థితి ఏర్పడింది.

## 1 నుంచి రాజస్థాన్‌లో పెట్రోల్ బంక్‌ల బంద్

**జైపూర్:** రాజస్థాన్‌లో పెట్రోల్ బంక్ డీలర్లు జూన్ 1 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు బంకులు వసి ఉంచుతామని హెచ్చరించారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు వాహనదారులతో పాటు పెట్రోల్ పంపుల యజమానులకు షాక్ ఇస్తున్నాయి. ఒక పక్క అనేక ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ దొరకక వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే... మరోపక్క తాము కూడా నిర్వహణ ఖర్చులు భరించలేక, చమురు సంస్థల అసంబద్ధ విధానాల వల్ల నష్టపోతున్నామని పెట్రోల్ డీలర్లు అంటున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 1 వ తేదీ నుంచి అన్ని బంకులను వసివేసి నిరవధిక నిరసనలకు దిగుతామని వెల్లడించారు. ఆయిల్ ధరలు పెరగడం, నిర్వహణ ఖర్చులు అధికం కావడం, ఆయిల్ కంపెనీలు అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలు, ప్రభుత్వ వైఖరి కారణంగా తమపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని పెట్రోల్ డీలర్లు అంటున్నారు. తమ డిమాండ్లను అటు ప్రభుత్వాలు, ఇటు చమురు కంపెనీలు పట్టించుకోవడం లేదని అన్నారు. పెట్రోల్ బంకుల యజమానుల ప్రకారం... పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే రాజస్థాన్‌లోనే పెట్రోల్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న వ్యాట్ కారణంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువ. దీనివల్ల ఇతర రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ప్రజలు... పక్క రాష్ట్రాలకు వెళ్లి తక్కువ ధరలో పెట్రోల్, డీజిల్ పోయించుకుని వస్తున్నారు. దీంతో రాజస్థాన్‌లో అమ్మకాలు పడిపోతున్నాయి. ఫలితంగా చాలా బంకులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అందులోనూ గ్రామీణ, చిన్న పట్టణాల్లో పెట్రోల్ వినియోగం చాలా తక్కువ. అలాంటి చోట నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగి... బంకుల నిర్వహణ ఆర్థికంగా భారమవుతోంది. ప్రభుత్వానికి నాలుగు రోజుల సమయం ఇచ్చామని, ఈ లోగా సమస్యలు పరిష్కరించకుంటే తాము జూన్ 1 నుంచి పెట్రోల్ బంకులు వసివేస్తామని డీలర్లు తెలిపారు.



# మణిపూర్ జాతి హింస కేసుల సత్వర విచారణ

### సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ:** మణిపూర్ జాతి హింసాకాండపై కొనసాగుతున్న విచారణను వేగవంతం చేయాలని, దీనిపై నివేదిక అందజేయాలని అధికారులను సుప్రీం కోర్టు బుధవారం ఆదేశించింది. కొండ జిల్లాల్లో 'గిరిజన సంఘీభావ యాత్ర' నిర్వహించిన అనంతరం, 2025 మే 3న మణిపూర్‌లో జాతి హింస చెలరేగింది. గిరిజన తెగల(ఎస్టీ) హోదా కల్పించాలన్న మైతేయి సామాజిక వర్గానికి వ్యతిరేకంగా ఈ నిరసన జరిగింది. ఈ సందర్భంగా చోటుచేసుకున్న హింసలో 260 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. బుధవారం... భారత ప్రధాన న్యాయవర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం, సిట్ నివేదిక ప్రకారం 400 మందికి పైగా నిందితులపై 207 కేసుల్లో అభియోగ పత్రాలు దాఖలయినట్లు తెలిపింది. బాధితులపై సావహిక అత్యాచారానికి పాల్పడి, వారిని నగ్నంగా ఊరేగించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు నిందితులు, అరుణ్ ఖుండోంగ్‌బామ్, నమీరక్‌పామ్ కిరణ్ మీటీకు గౌహతి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరుపుతోంది. 'ప్రస్తుతం జరుగుతున్న విచారణను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని మేము భావిస్తున్నాము. బాధితులకు న్యాయ సలహా ఇచ్చేందుకు, మణిపురి భాషలో మంచి ప్రావీణ్యం ఉన్న న్యాయ సహాయ న్యాయవాదులను అందించాలని మేము సీబీఐ, ఇతరులను కోరాము. ప్రస్తుతం జరుగుతున్న విచారణ స్థితిని తదుపరి విచారణలో దాఖలు చేయాలి' అని పేర్కొంది. ప్రారంభంలోనే, బాధితుల కుటుంబాలకు న్యాయ సహాయం అందించే అంశంపై మాత్రమే విచారణ జరుపుతామని, ఇతర విషయాలలో తాము జోక్యం చేసుకోబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. సీబీఐ నివేదికను ప్రస్తావిస్తూ, 20 ఛార్జిషీట్లు దాఖలయ్యాయని, 16 కేసులలో విచారణలు ప్రారంభమయ్యాయని ధర్మాసనం తెలిపింది. కాగా, సిట్ స్థితి నివేదిక ప్రకారం 400 మందికి పైగా నిందితులపై 207 కేసులలో ఛార్జిషీట్లు దాఖలయ్యాయని పేర్కొంది. మాజీ ఐపీఎస్ అధికారి దత్తాత్రేయ పడ్సల్గికర్ దాఖలు చేసిన నివేదిక ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్ 7, 18 తేదీలలో కొన్ని హింసాత్మక ఘటనలు జరగడంతో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి 'ప్రమాదకరంగా' ఉందని, రాష్ట్ర పోలీసులు ఒత్తిడికి గురయ్యారని ధర్మాసనం పేర్కొంది. వ్యవస్థపై బాధితులకు ఉన్న విశ్వాసం అత్యంత కీలకమని, వారిలో 'విశ్వాసాన్ని పెంపొందించే చర్యలు' తీసుకోవాల్సిన అవసరం ఉందని కూడా ధర్మాసనం తెలిపింది. కాగా 2025 సెప్టెంబరు 8 న గౌహతి హైకోర్టు ఇద్దరు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. వారిపై ఇంకా అభియోగాలు నమోదు కానప్పటికీ, వారు రెండేళ్లుగా కస్టడీలో ఉన్నారని, దీనిని 'అన్యాయమైన, సుదీర్ఘమైన నిర్బంధం' గా అభివర్ణించింది. 'ఇక్కడి ఆరోపణలు తీవ్రమైనవి, దిగ్భ్రాంతికరమైనవి అయినప్పటికీ, విచారణ లేకుండా నిరవధిక నిర్బంధం అనేది విచారణకు ముందు ఇచ్చే శిక్ష కిందకు వస్తుందని, ఇది చట్టరీత్యా అనుమతించబడదని ఈ కోర్టు విస్మరించలేదు' అని గౌహతి హైకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. తీవ్రమైన లైంగిక హింస ఆరోపణల కారణంగా బెయిల్‌ను రద్దు చేయాలని సీబీఐ కోరింది. బుధవారం విచారణ సందర్భంగా కొంతమంది బాధితుల తరపు న్యాయవాది నిజాం పాషా వాదనలు వినిపిస్తూ, 2025 మే 9 న నేరాల దారుణ స్వభావాన్ని గుర్తించిన ఇదే కోర్టు, జాప్యం జరిగిందంటూ సెప్టెంబరు 8 న బెయిల్ మంజూరు చేసిందని అన్నారు. దీనిపై సుప్రీం కోర్టు ధర్మాసనం స్పందిస్తూ, 'ఇది స్వేచ్ఛకు సంబంధించిన విషయం అయినందున బెయిల్‌ను రద్దు చేయడానికి తీవ్రమైన కారణం అవసరం. నిజాన్ని బయటపెట్టడమే మా ప్రధాన లక్ష్యం. దానికి కోసం ఎలాంటి పునరావాస చర్యలు అవసరమైతే వాటిని పరిశీలిస్తాము' అని తెలిపింది. గత మార్చిలో బాధితుల కోసం రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయ న్యాయవాదిని నియమించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.



## విమాన సర్వీసుల్లో ఎయిరిండియా కోత

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో సంక్షోభంతో ఇప్పటికే అంతర్జాతీయ సర్వీసులను కుదించిన ఎయిరిండియా ఇప్పుడు దేశీయ సర్వీసులను కూడా తగ్గించుకోవాలని నిర్ణయించింది. విమాన ఇంధన ధరలు భారీగా పెరగడమే ఇందుకు కారణమని విమానయాన వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్ సంక్షోభం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా విమాన ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ క్రమంలో ఎయిరిండియా జులై, ఆగస్టు నెలల్లో తన దేశీయ విమాన సర్వీసులను 15 నుంచి 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ రూట్లను పూర్తిగా రద్దు చేయకుండా కేవలం విమానాల ఫ్రీక్వెన్సీని మాత్రమే తగ్గించాలని సంస్థ భావిస్తోంది. ఈ మార్పులపై ఎయిరిండియా అధికారిక ప్రతినిధి స్పందించారు. ఇంధన ధరల ప్రభావం వల్లే కొన్ని దేశీయ రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా క్రమబద్ధీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. పరిస్థితులు చక్కబడిన తర్వాత మళ్లీ పాత షెడ్యూల్ ప్రకారం అన్ని విమానాలను పునరుద్ధరిస్తామని చెప్పారు. ప్రయాణికుల డిమాండ్, మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తామని ఎయిరిండియా వెల్లడించింది. షెడ్యూల్ మార్పుల వల్ల ఇబ్బంది పడే ప్రయాణికులకు పూర్తి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. టికెట్లు బుక్ చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ విమానాల్లో సీట్లు కేటాయించడం, అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీలను మార్చుకునే అవకాశం కల్పించడం, పూర్తి డబ్బును రిఫండ్ చేయడం వంటి ఆప్షన్లను అందిస్తామని తెలిపింది.





**తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం**

శాన్‌ఫ్రాన్సిస్‌కో వెళుతున్న ఎయిరిండియా విమానం కొంత దూరం వెళ్లి తిరిగి వచ్చేసింది. సుమారు 8 గంటల పాటు ఆ విమానం గాలిలో ఉంది. ఆ తర్వాత సురక్షితంగా మళ్లీ దిల్లీలో ల్యాండ్ అయింది. సాంకేతిక లోపం తలెత్తడం వల్ల విమానం మార్గమధ్యలోనే తిరుగు ప్రయాణమైనట్లు విమానయాన సంస్థ తెలిపింది. ఆ విమానంలో సుమారు 230 మంది ప్రయాణికులు ఉన్నారు. దిల్లీ నుంచి శాన్ ఫ్రాన్సిస్‌కో వెళుతున్న ఫ్లైట్ ఏఐ173 విమానం మే 27 న దిల్లీకి వెనుదిరిగినట్లు ఎయిరిండియా సంస్థ తెలిపింది. సాంకేతిక సమస్య వల్ల ఆ విమానం వెనక్కి వచ్చినట్లు చెప్పారు. ఎయిరిండియా భద్రతా ప్రమాణాల ప్రకారం ఆ విమానాన్ని తనిఖీ చేయనున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. దిల్లీ నుంచి బయలుదేరి వెళ్లిన ఆ విమానం సుమారు వదు గంటల పాటు ప్రయాణం చేసి చైనా వైమానిక క్షేత్రంలో ఉన్న సమయంలో అకస్మాత్తుగా వెనుతిరిగింది.

## ఆరు నెలల్లో యాంటీ డ్రోన్ వ్యవస్థలు

### అమిత్ షా వెల్లడి

**బికనీర్:** సరిహద్దుల ఆవలి నుంచి డ్రోన్ల ద్వారా డ్రగ్స్, ఆయుధాల అక్రమ రవాణాకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఆరు నెలల్లోగా యాంటీ డ్రోన్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మన భూభాగంలోకి ప్రవేశించిన డ్రోన్ల జాడ కనిపెట్టి అందులోని వస్తువులు, సరుకులు ఎవరు అందుకుంటున్నదీ గుర్తించడం అత్యంత ముఖ్యమన్నారు. ఈ విషయంలో స్థానిక పోలీసులు, పౌర యంత్రాంగం మెరుగైన సమన్వయంతో ఇలాంటి ప్రమాదాలను సమర్థంగా ఎదుర్కొనవచ్చని మంత్రి వివరించారు. సరిహద్దు సమగ్ర భద్రతకు సరిహద్దు భద్రతా దళం(బిఎస్ఎఫ్), సాయుధ బలగాలు, స్థానిక యంత్రాంగం, పౌరుల మధ్య బహుళ అంచల 'ఫోర్ పాయింట్ సెక్యూరిటీ గ్రిడ్' ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి సమన్వయం వల్లనే సంపూర్ణ సురక్షిత సరిహద్దు అనే సంకల్పం నెరవేరుతుందని స్పష్టం చేశారు. ఈ దిశగా ఇప్పటికే బీహార్, గుజరాత్, త్రిపుర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో చర్యలు ప్రార ంభించామని వివరించారు. డ్రో న్లు, ఇతర మార్గాల్లో దొంగచాటుగా జరిగే మాదకద్రవ్యాలు, ఆయుధాల రవాణాను అడ్డుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించడం మన బాధ్యతని అన్నారు. అమిత్ షా రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లా సాంచులోని బోర్డర్ పోస్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బీఎస్ఎఫ్ జవాన్లనుద్దేశించి మాట్లాడారు. సరిహద్దులకు 50 కిలోమీటర్ల పరిధిలో వెలిసే అక్రమ నిర్మాణాలు, అసాధారణ మార్పులు, అనుమానాస్పద కార్యకలాపాలపై బిఎస్ఎఫ్ యంత్రాంగం ఎప్పటికప్పుడు సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను అప్రమత్తం చేయాలని కోరారు.



## సిబిఎస్ఇ త్రిభాషా సూత్రం: కేంద్రానికి 'సుప్రీం' నోటీసులు

**న్యూఢిల్లీ:** జులై 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సిబిఎస్ఇ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. ఈ అంశంపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీతో కూడిన ధర్మాసనం.. కేంద్రం, సిబిఎస్ఇ, ఎన్‌సిఇఆర్‌టికి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఈ వ్యవహారం రాజ్యాంగపరమైన అంశాలతో ముడిపడి ఉందని సిబల్ అన్నారు. భాష అనేది ఛాయిస్‌కు సంబంధించిన విషయమని, దానిని బలవంతంగా రుద్దలేమని తెలిపారు. ఈ వ్యవహారంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించిన సర్వోన్నత న్యాయస్థానం... తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. త్రిభాషా విధానాన్ని అమలు చేయడానికి సిబిఎస్ఇలాజిస్టికల్ సంసిద్ధతపై నివేదిక సమర్పించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీని ఆదేశించింది. 2026–27 విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు రెండు భారతీయ భాషలతో పాటు మొత్తం మూడు భాషలు తప్పనిసరిగా చదవాలని సీబీఎస్ఈ పేర్కొంది. ఏదైనా విదేశీ భాష చదవాలని కోరుకునే విద్యార్థులు తతీయ భాషగా మాత్రమే దాన్ని ఎంపిక చేసుకోవచ్చని ఈనెల 15న జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి) 2020, పాఠశాల విద్య జాతీయ పాఠ్య ప్రణాళిక 2023కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది.



## తమిళనాడు మత్స్యకారులను విడుదల చేయించండి

### ప్రధానిని కోరిన తమిళనాడు సిఎం జోసెఫ్ విజయ్

**నూఢిల్లీ:** న్యూఢిల్లీలో ప్రధాన నరేంద్ర మోదీని తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ బుధవారం నాడు కలిసారు. నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం రాగి శాసనాలను' తిరిగి భారతదేశానికి రప్పించేందుకు ప్రధానమంత్రి చేసిన కృషికి సిఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీలంక నౌకాదళం తమిళనాడు మత్స్యకారులను అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 2026లోనే ఇటువంటి అరెస్టు ఘటనలు 12 జరిగాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని, అలాగే 266 చేపల వేట పడవలను స్వాధీనం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఆ మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరవలసిందిగా ఆయన ప్రధానమంత్రిని అభ్యర్థించారు.



## అక్టోబరు ఏడు దాడుల సూత్రధారి

# హమాస్ సాయుధ దళాల అధిపతి ఒడెహ్ హతం

### ఏ ఒక్కరినీ వదిలిపెట్టం

### ఇజ్రాయెల్ కట్జ్ ప్రతిజ్ఞ




**గాజా :** హమాస్ సాయుధ దళాల కొత్త అధిపతి, అక్టోబరు 7 (2023) దాడుల సూత్రధారి మొహ్మద్ ఒడెహ్‌ను ఐ.డి.ఎఫ్ హతమార్చింది. హమాస్ కొత్త అధిపతిగా బాధ్యతలు చేపట్టిన 11 రోజులకే ఇజ్రాయెల్ సైనిక దళాల గగనతల దాడుల్లో కుటుంబ సమేతంగా హతుడయ్యాడు. పదకొండు రోజుల క్రితం ఆయన స్థానంలో ఉన్న సాయుధ దళాల అధిపతిని ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. వెంటనే కొత్త అధిపతిగా ఒడెహ్‌ను హమాస్ నియమించింది. ఇప్పుడు ఆయన కూడా మరణించాడు. సెంట్రల్ గాజాలోని అల్–జయితౌన్ బహుళ అంతస్తుల భవన సముదాయంలోని పైభాగంలో ఉన్న మూడు అంతస్తులను ఇజ్రాయెల్ సేనలు ధ్వంసం చేశాయి.

మంగళవారం సాయంత్రం గాజా స్ట్రిప్‌లో చేసిన ఈ దాడుల్లో ఒడెహ్ హతుడయ్యాడని ఇజ్రాయెల్ బుధవారం ప్రకటించింది. గాజాలో హమాస్‌కు సహాయంగా తన వంతు ఉగ్రవాద బాధ్యతలు నిర్వహిస్తున్న గాజా పౌర రక్షణ సంస్థ తెలియజేసిన సమాచారం ప్రకారం ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో కనీసం ముగ్గురు మరణించారు. మరో ఇద్దరే మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఒడెహ్ మరణాన్ని ధృవీకరించారు. "గాజాలో పనిచేస్తున్న హమాస్ ఉగ్రవాద సంస్థ నాలుగవ కమాండర్ అధిపతిగా బాధ్యతలు తీసుకున్న ఒడెహ్‌ను నిన్న హతమార్చాం, నరకపు అగాధంలో ఉన్న అతడి భాగస్వాములను కలుసుకోవడానికి అతడిని పంపినాం" అని ఎక్స్ వేదికగా ఇజ్రాయెల్ కట్జ్ ఒక పోస్టింగ్ పెట్టారు. కొన్ని నెలలుగా ఒడెహ్ కదలికలపై నిఘా పెట్టామని, అతడు తమ దాడులకు భవనాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని ఇజ్రాయెల్ సైన్యం, షిన్‌బెట్ భద్రతా సంస్థలు ప్రకటించాయి. ఈ దాడిలో ఒడెహ్ భార్య, ఎదిగిన కుమారుడు కూడా హతులయ్యారు. "2023 అక్టోబర్ ఏడో తేదీన ఇజ్రాయెల్ భూభాగంలోకి ప్రవేశించి సామాన్య, అమాయక పౌరులను ఊచకోత కోశారు. అత్యాచారాలు చేశారు. అనేకమంది స్త్రీలు, పురుషులను బందీలుగా చేసి తీసుకువెళ్ళి నరకం చూపించారు. వారిని శవాలుగా తిరిగి ఇజ్రాయెల్‌కు పంపించారు. ఇలాంటి వారిపై ప్రతీకారం తీర్చుకుంటామని, వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని మేం ఇంతకుముందే శపథం చేశాం, అందులో భాగంగానే సూత్రధారి ఒడెహ్‌ను కూడా నరకానికి పంపించాం" అని కట్జ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. గాజాలో హమాస్‌ను అధికారం నుండి తొలగించడం, అదే సమయంలో ఆ ప్రాంతం నుండి స్వచ్ఛంద వలసలను సరైన సమయంలో సరైన పద్ధతిలో ముందుకు తీసుకువెళ్ళడం ఇజ్రాయెల్ నిర్దేశించుకున్న లక్ష్యాలని ఆయన పునరుద్ఘాటించారు. కాగా ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోందని హమాస్, పాలస్తీనా ప్రభుత్వాలు విమర్శించాయి. గడచిన అక్టోబరులో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఇప్పటివరకూ 900 మంది పాలస్తీనియన్లు మరణించారు.

## పాకిస్థాన్ 'అబ్రహాం ఒప్పందం'లో

# చేరడాన్ని సమర్థించబోం

### రక్షణమంత్రి ఆసిఫ్



**ఇస్లామాబాద్ :** అబ్రహాం ఒప్పందంలో పాకిస్థాన్ చేరడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని ఆ దేశ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ నిర్ద్వంద్వంగా చెప్పారు. "సమా" టివీకి ఇచ్చిన ఇంటర్వ్యూ లో సోమవారం ఆయన మాట్లాడుతూ, ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణీకరించేందుకు అబ్రహాం ఒప్పందాలలో పాకిస్థాన్ చేరడాన్ని తాను సమర్థించబోనని చెప్పారు. ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చల్లో పాల్గొంటున్న దేశాలు ఇజ్రాయెల్–అరబ్ దేశాలమధ్య దౌత్య, ఆర్థిక, భద్రతాసంబంధాలను నెలకొల్పే అబ్రహాం ఒప్పందాలలో చేరాలని, వాటిపై విధిగా సంతకాలు చేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోమవారం పశ్చిమాసియా శాంతి చర్చల నిబంధనల్లో కొత్త మెలికి పెట్టిన నేపథ్యంలో పాకిస్థాన్ రక్షణమంత్రి ఆసిఫ్ పైవిధంగా స్పందించారు. పాకిస్థాన్ అనుసరిస్తున్న మౌలిక సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉండే ఏ ఒప్పందంలోనే తమ దేశం చేరకూడదని వ్యక్తిగతంగా తాను భావిస్తున్నానన్నారు. అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలకు పాకిస్థాన్ ప్రభుత్వమే ఏకైక అధికారిక మధ్యవర్తిగా గుర్తింపు పొందింది. అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి ఒప్పంద సంప్రదింపులలో సంధాన కర్తలుగా పాకిస్థాన్ ప్రతినిధుల తోపాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రైన్ దేశాల ప్రతినిధులు ఉన్నారు. ఇప్పటికే యుఎఇ, బహ్రైన్ దేశాలు అబ్రహాం ఒప్పందాలపై సంతకాలు చేసి ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలను ఏనాటి నుండో కొనసాగిస్తున్నాయి. ఇక సౌదీ అరేబియా, ఖతార్, పాకిస్థాన్, తుర్కియే, ఈజిప్టు, జోర్డాన్ దేశాలు కూడా అబ్రహాం ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ అధిపత్యాన్ని అంగీకరించాలని, ఆ దేశంతో సాధారణ సంబంధాలు నెలకొల్పుకోవాలని డోనాల్డ్ ట్రంప్ ఆకాంక్షిస్తున్నారు.

అమెరికా–ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరితే ఇజ్రాయెల్ వ్యక్తం చేస్తున్న భయాలను పారద్రోలేందుకు ట్రంప్ తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. గడచిన శనివారం నెతన్యాహూతో ఫోన్ సంభాషణల్లో కూడా ట్రంప్ ఆయనకు ధైర్యం చెప్పారు. దాడి చేసి ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఇప్పుడీ కొత్త మెలిక కూడా ఇజ్రాయెల్ రక్షణ కోసమే.



# యూరప్‌లో మే నెల వడగాలి

## ఫ్రాన్స్‌లో ఏడుగురు మృతి

### స్కాట్లాండ్‌లో కార్చిచ్చు

**పారిస్ :** యూరప్ దేశాలలోని పలు చోట్ల వేడి గాలులు, తీవ్ర ఉష్ణోగ్రత ప్రజలను భయభ్రాంతులను చేస్తోంది. ఫ్రాన్స్‌లో వేడి గాలుల కారణంగా ఏడుగురు మరణించారు. బ్రిటన్ చరిత్రలో లేనివిధంగా తీవ్ర వేడిగాలులు నమోదయ్యాయి. మరోవైపు స్కాట్‌లాండ్‌లో కార్చిర్చు ప్రజలను భయపెడుతోంది. దీంతో అక్కడ రహదారులను మూసివేశారు. ఎడింబర్గ్‌లోని కొండల్లో మంటలు చెలరేగి ఉష్ణోగ్రతలు భయపెడుతున్నాయి. మరోవైపు సౌదీ అరేబియాలో కూడా వడగాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. హాజ్ యాత్రికులు తీవ్రస్థాయిలో 50 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలను ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా బ్రిటన్‌లోని కొన్ని ప్రాంతాలలో కూడా వేడిగాలులు, ఉష్ణోగ్రత ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈసారి చాలా తొందరగా వేసవికాలం ప్రవేశించింది. దీంతో బ్రిటన్, ఐర్లాండ్‌లలో ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయిలో పెరిగాయి. పశ్చిమ యూరప్‌లో తీవ్రంగా ప్రభావితం చేస్తున్న, వేసవికాలం ఆరంభంలోనే తీవ్ర ఉష్ణోగ్రతలవల్ల ఫ్రాన్స్‌లో ఏడుగురు మరణించారు. పలు దేశాలలో ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయిలో పెరిగాయి. ఈ వారం అంతా ఫ్రాన్స్ దేశాన్ని వేడి గాలులు వెంటాడతాయని, ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల సెల్సియస్ దాటి పోయే అవకాశం ఉందని మేటియో ఫ్రాన్స్ వాతావరణ సంస్థ ముందస్తు అంచనావేసింది. లండన్ సమీపంలో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంతకుముందురోజు కేవలం 33 డిగ్రీలు మాత్రమే నమోదైంది. పోర్చుగల్‌లో కూడా తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దేశంలోని బీచ్‌లు అన్నీ ప్రజలతో కిటకిటలాడుతున్నాయి.

# పిడిఎస్ పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ల మార్జిన్ సహాయం. రెండోది పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌లో సాంకేతిక ఆధునికీకరణ, సంస్కరణల పథకం. రాష్ట్రాల్లో ఆహార ధాన్యాల రవాణా, నిర్వహణ, ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ల మార్జిన్‌కు స్థిర ఆర్థిక సహాయం అందించడం ఒకటి.

ప్రజలకు చివరి దశ వరకు సేవలు సమర్థంగా చేరేలా, లీకేజీలు తగ్గేలా, ఆహార భద్రత బలోపేతం అయ్యేలా సమగ్ర, ప్రజాకేంద్రీకృత, సమన్వయ పీడీఎస్ వ్యవస్థను నిర్మించడం రెండోది. సార్థక్‌పీడీఎస్ పథకం కింద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, బ్లాక్‌చైన్ వంటి ఆధునిక సాంకేతికతలతో పీడీఎస్ కార్యకలాపాలను ఆధునికీకరించనున్నారు. రియల్‌టైమ్ పర్యవేక్షణ, కృత్రిమ మేధస్సు ఆధారిత ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు, విశ్లేషణ వ్యవస్థలు, డేటా ఆధారిత పర్యవేక్షణ కోసం రాష్ట్ర కమాండ్ కంట్రోల్ సెంటర్లు, అంతర్జాతీయ ప్రమాణాల ప్రక్రియలతో పీడీఎస్‌లో పారదర్శకత, భద్రత, స్థిరత్వం పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

దేశ ప్రజలకు తగిన పరిమాణంలో నాణ్యమైన ఆహార ధాన్యాలు అందించి ఆహార, పోషక భద్రత కల్పించడం కేంద్ర ప్రభుత్వ సామాజిక, చట్టబద్ధ బాధ్యత అని కేంద్రం తెలిపింది. గత దశాబ్దంలో టీపీడీఎస్ పూర్తి కంప్యూటరీకరణ, ఐఎంపీడీఎస్, స్మార్ట్ పీడీఎస్ వంటి డిజిటల్ కార్యక్రమాలను కేంద్రం అమలు చేసింది. 'మేరా రేషన్', 'అన్న మిత్ర', 'రైట్‌ఫుల్ టార్గెటింగ్ డ్యాష్‌బోర్డ్', 'అన్న సహాయత' వంటి ప్రజా సేవా యాప్‌లను కూడా ప్రవేశపెట్టింది. 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లో ఉన్న స్మార్ట్ పీడీఎస్ పథకం ద్వారా రేషన్ కార్డుల పూర్తి డిజిటలైజేషన్, ఆధార్ అనుసంధానం, ఈపీఓఎస్ ద్వారా ఫెయిర్ ప్రైస్ షాప్‌ల ఆటోమేషన్, ఆన్‌లైన్ కేటాయింపులు, కంప్యూటరీకృత సరఫరా వ్యవస్థలు 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమల్లోకి వచ్చాయి.

దేశంలో కొనసాగుతున్న తీవ్ర వడగాలులపై కేబినెట్లో చర్చించారు. తీవ్రమైన ఎండలు, వడగాలుల నుంచి ప్రజలను రక్షించేందుకు ఆయా మంత్రిత్వ శాఖలు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

## తూర్పు–దక్షిణ లెబనాన్‌లో 100 చోట్ల

# ఇజ్రాయెల్ దాడులు : 31మంది మృతి

**బీరూట్ :** హెజ్బొల్లా ఉగ్రవాద సైన్యాలపై దాడులను ముమ్మరం చేస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రకటన చేసిన తర్వాత తూర్పు,దక్షిణ లెబనాన్ ప్రాతాలలో ఐ.డి.ఎఫ్ ఉద్ధృత దాడులు కొనసాగించింది. దాదాపు 100 ప్రాంతాల్లో జరిగిన ఈ దాడుల్లో డజన్లకొద్దీ మరణాలు సంభవించాయి. మొత్తంగా 31 మంది మరణించినట్లు గుర్తించారు. మరో 40 మంది గాయపడ్డారు. మరణించినవారిలో చిన్నపిల్లలు కూడా ఎక్కువమంది ఉన్నారని లెబనాన్ ఆరోగ్యశాఖామంత్రి బుధవారం ప్రకటించారు. బెక్కా లోయలోని మాష్ఘరా గ్రామంపై ఐడిఎఫ్ గగనతల దాడులు చేసింది. ఏప్రిల్ మధ్యకాలంలో అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం రెండు దేశాలమధ్యా అమలులోకి వచ్చిన తర్వాత జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇదొకటి. ఇజ్రాయెల్ దళాలు ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులు చేస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ లెబనాన్‌లో గగనతలదాడులు, ఫిరంగి దాడులు ప్రతి రోజూ జరుగుతున్నాయి. మష్ఘరా, బుర్జ్ అల్ షమాలీ గ్రామాలను లక్ష్యంగా చేసుకుని ఐడిఎఫ్ దాడులు కొనసాగిస్తోంది. అదేసమయంలో హెజ్బొల్లా కూడా ఉత్తర ఇజ్రాయెల్‌లో, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనికులు ఆక్రమించిన ప్రాంతాలపైన రాకెట్ దాడులు కొనసాగిస్తోంది. ఆయుధాలు వదిలిపెట్టేందుకు తిరస్కరించిన హెజ్బొల్లా ఉగ్రవాద దళాలను అణచివేసేందుకు తమ దళాలకు మరిన్ని అధికారాలు ఇస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించిన తర్వాత లెబనాన్‌లో దాడులు విస్తారంగా పెరిగాయి. తూర్పు లెబనాన్‌లో హెజ్బొల్లా మౌలిక సదుపాయాలపై తాము దాడులు ఉద్ధృతం చేశామని ఐ.డి.ఎఫ్ ప్రకటించింది. లెబనాన్‌కు అదనపు బెటాలియన్స్‌ను తరలించినట్లు సైన్యాధికారులు చెప్పారు. ఈ పరిస్థితుల్లో అమెరికా నాయకత్వంలో నాలుగోసారి ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం, శాంతి చర్చలపై జూన్ మూడు,నాలుగు తేదీలలో సమావేశానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

# కేంద్రం నిర్ణయం ఆక్షేపణీయం

(మొదటి పేజీ తరువాయి)

పదేపదే జరుగుతున్న ప్రయత్నాలు రాజ్యాంగ విరుద్ధమైనవని సిపిఐ తీవ్రంగా ఆక్షేపించింది. నిరుద్యోగం కారణంగా యువతలో అశాంతి, ప్రశ్నపత్రాల లీకులు, పరీక్షల రద్దు, సిబిఎస్ఇ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ధరల పెరుగుదల, ఎరువుల ధరల పెరుగుదల, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఏ) రద్దు కారణం గా వ్యవసాయ సంక్షోభం, పెరుగుతున్న అసమానతలు, ప్రభుత్వం తన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమవడం వంటి తీవ్రమైన సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే ఈ ప్రయత్నమని ఆరోపించింది. అసహజ జనాభా మార్పులు అని పిలువబడే అంశాన్ని పరిశీలించడమనే మిషతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న కమిటీలు, కార్యక్రమాలు, బలహీనవర్గాల ప్రజలపై, ముఖ్యంగా ముస్లిం లు, వలసదారులు, దళితులు, ఆదివాసీలు, పేదలపై నిఘాపెట్టడానికి, వేధింపులకు పాల్పడేందుకు ,ఓటు హక్కును హరించడానికి, ప్రజాస్వామ్య హక్కులను నిరాకరించడానికి సాధనాలుగా మారే ప్రమాదం పొంచి ఉందని సిపిఐ హెచ్చరించింది. రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని, ప్రజా స్వామ్యాన్ని, ప్రతీ భారతీయుడి సమాన హక్కులను పరిరక్షించడానికి పార్టీ అచంచలమైన నిబద్ధతను సిపిఐ పునరుద్ఘాటించింది.

# రాజీనామా?

(మొదటి పేజీ తరువాయి)

సంకేతాలిచ్చారని భావిస్తున్నారు. కెపిసిసి అధ్యక్షుడు, డిప్యూటీ సిఎం డి.కె.శివకుమార్, కర్నాటక కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ రణ్‌దీప్ సుర్జేవాలా ఢిల్లీ నుంచి బెంగళూరుకు చేరుకున్నారు. సిద్ధరామయ్య రాజీనామా చేస్తే, డి.కె.శివకుమార్ ఈ నెల 30న కర్నాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి.

**'వద్దన్నాం.. ఆయన రాజీనామాకే నిర్ణయించుకున్నారు..'**

సీనియర్ కాంగ్రెస్ ఎంఎల్‌ఎ, పరిపాలనా సంస్కరణల కమిషన్ ఛైర్మన్ ఆర్.వి. దేశ్‌పాండే మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తాను రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు తనకు చెప్పారని తెలిపారు. సిద్ధరామయ్య నివాసం 'కావేరి'కి ఆయనతో పాటు, పలువురు మంత్రులు,ఎంఎల్‌ఏలు వెళ్ళారు. సిద్ధరామయ్యను కలిసి రాజీనామా చేయవద్దని పట్టుబట్టారు. దీనిపై అధిష్టానంతో చర్చిస్తామని కూడా మాట్లాడుతామన్నట్లు సమాచారం. కొందరు ఈ విషయాన్ని శాసనసభాపక్ష సమావేశంలో చర్చించాలని కూడా అన్నట్లు తెలిసింది. కానీ సిద్ధరామయ్య వాటినిపై సానుకూలంగా స్పందించలేదు. తాను పార్టీ అధిష్టానానికి మాట ఇచ్చానని, ఆ మాటకు కట్టుబడి ఉంటానని ముఖ్యమంత్రి బదులిచ్చారని చెప్పారు. గురువారం లేదా శుక్రవారం రాజీనామా చేసే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

సిద్ధరామయ్యను కలిసిన కలిసిన వారిలో మంత్రులు హెచ్.సి. మహదేవప్ప, జమీర్ అహ్మద్ ఖాన్, ఈశ్వర్ ఖండ్రే, సంతోష్ లాడ్, కె.జె. జార్జ్, ఎంఎల్‌ఏలు నంజేగౌడ, బి. నాగేంద్ర, ఉమేష్ మెటి, ఎ.ఎస్. పొన్నన్న, సలీం అహ్మద్ తదితరులు ఉన్నారు.ఆయన గవర్నర్ను కలిసేందుకు సమయం కోరారు; అంతేకాకుండా గురువారం నాడు తన అధికారిక నివాసంలో మంత్రివర్గ సహచరులతో అల్పాహార సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి పదవి రేసులో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు హోం మంత్రి జి.పరమేశ్వర నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి.

**సిద్ధూను తొలగిస్తే తీవ్ర పరిణామాలు : బిసి సంఘాల హెచ్చరిక**

కర్నాటక ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్ధరామయ్యను మార్చితే కాంగ్రెస్ పార్టీ, అధిష్టానం తీవ్ర పర్యవసానాలను ఎదుర్కొంటుందని కర్నాటక రాష్ట్ర వెనుబడిన తరగుత సంఘాలు సమాఖ్య హెచ్చరించాయి. అహిందా (బిసి, మైనారిటీ, దళిత వర్గాల) మద్దతుతోనే కాంగ్రెస్ పార్టీ కర్నాటకలో అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలని, కాంగ్రెస్‌లో సిద్ధరామయ్యతో సమాన స్థాయి కలిగిన నాయకుడు లేరని, ఆయనను తప్పిస్తే ఉద్యమం చేపడతామని సమాఖ్య అధ్యక్షులు రామచంద్రప్ప హెచ్చరించారు.

**బాంబులు కాల్చిన డి.కె. అభిమానులు**

డిప్యూటీ ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అభిమానులు కర్నాటకలోని పలు ప్రాంతాలలో బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. పలువురు స్వీట్లు పంచిపెట్టారు. బెంగళూరులోని శివకుమార్ అధికార నివాసం బైట కూడా పలువురు అభిమానులు బాణాసంచా కాల్చారు.

# ఎమ్మెల్యేగా పోటీ చేయను

(మొదటి పేజీ తరువాయి)

తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం పట్టణ ప్రాంతాల్లో మరో లక్ష ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని గృహ నిర్మాణం చేపడుతున్నామని, ఇప్పటికే రాష్ట్ర క్యాబినెట్ దీనిపై నిర్ణయం తీసుకుందని చెప్పారు. క్యూర్ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైందని, కేవలం 12 రోజుల్లోనే దాదాపు 40 ప్రభుత్వ స్థలాలను గుర్తించామని వెల్లడించారు. ఈ ఇళ్లను మహిళల పేరిట ప్రభుత్వం ఉచిత రిజిస్ట్రేషన్‌తో అందిస్తుందని, లబ్ధిదారులపై ఒక్క రూపాయి భారం కూడా ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదాయం కంటే పేదల గృహ హక్కుకే ప్రాధాన్యత ఇస్తామని, కోట్ల విలువైన ప్రభుత్వ భూములనైనా ఇందుకోసం వినియోగిస్తామని తెలిపారు. ఇప్పటికే తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, గిరిజన ప్రాంతాలకు 5 వేల వరకు మంజూరు చేశామని, రెండో విడతలో మరో 2 వేల ఇళ్లు జోడించడంతో మొత్తం 5,500 నుంచి 7 వేల ఇళ్ల వరకు కేటాయించినట్లు పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో చేపట్టిన సుమారు 45–46 వేల ఇళ్లలో వేల సంఖ్యలో ఇళ్లు అసంపూర్తిగా మిగిలిపోయాయని, నిర్మించిన వాటిలో కూడా అనేక చోట్ల ప్రజలు నివసించలేని పరిస్థితులు ఉన్నాయని ఆరోపించారు. మౌలిక వసతుల లేమి, కాలనీల నిర్వహణ సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు.

# లక్ష గృహాలు అర్హులైన పేదలందరికీ ఇస్తాం

### గ్రామీణ ప్రాంతాల్లో రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** హైదరాబాద్ నగరంలోని 24 నియోజక వర్గాల్లో లక్ష ఎల్ఐజి ఇళ్లు నిర్మిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇళ్ల నిర్మాణం కోసం మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, పార్లమెంట్ సభ్యులు ఒవైసీతో శాసన సభ్యులు మాజిద్ హుస్సేన్, మహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బుధవారం నగరంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ప్రధానంగా కుల్సుంపురా, అఫ్జల్‌గంజ్ సాగర్, కాలదేరా, గడ్డిఅన్నారంలలో శిథిలావస్థలో ఉన్న భవనాలను పరిశీలించారు. ఈ ప్రాంతాలలో ఎల్ఐజి ఇండ్ల నిర్మాణం కోసం అనువైన స్థలాలు ఏవి, వీటిలో ఏ ప్రాంతాలను ఎంపిక చేస్తే బాగుంటుంది అన్నదానిపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు ఆసిఫ్‌నగర్ మండలం జియాగూడలోని పోలీస్ క్వార్టర్స్, మంగాల్ బస్తీలోని వాంబే కాలని, నాంపల్లిలోని రెడ్ హిల్స్‌లో గల ఖాళీ స్థలాలు, శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్, మలక్‌పేటలోని ఆర్ అండ్ బి కాలనీ, గోల్కొండ మండలం ఫలక్‌నామలో గల రెండు పడకల ఇండ్ల కాలనీ తదితర ప్రాంతాలను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ప్రభుత్వ భూములను వేగవంతంగా మ్యాపింగ్ చేసి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసించే వారితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభు త్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో త్వరలోనే రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో తొలి విడత గృహాల పంపిణీ ప్రారంభించనున్నామని తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీన తొలివిడత ప్రారంభం అవుతుందని, అనంతరం రెండవ విడత కూడా అమలు చేస్తామని చెప్పారు. తొలి విడతలో నాలుగున్నర లక్షల ఇండ్లు, రెండో విడతలో రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో తొలివిడత లక్ష ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఎండి గౌతమ్, హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, ఇంచార్జి డిఆర్ఓ శ్రీధర్, హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇడి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

అదుపులోకి తీసుకున్నారు.

**బిజెపి, కాంగ్రెస్ ఉమ్మడి రాజకీయ నిర్ణయం : ఎం.ఎ.బేబీ**

ఢిల్లీలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు సంయుక్తంగా తీసుకున్న రాజకీయ నిర్ణయమే విజయన్‌పై ఇడి చర్యకు కారణమని బలమైన సంకేతాలు ఉన్నాయని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. ఇలాంటి చర్యలు పినరాయి విజయన్‌ను గానీ, తమ పార్టీగానీ భయపెట్టలేవని స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని, దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా వాడుకుని ప్రతిపక్ష నాయకుడిని హత్య చేయడానికి, వేటాడటానికి కాంగ్రె స్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ప్రజలు దృఢంగావిశ్వసిస్తున్నారని తెలిపారు. ప్రజలను సమీకరించి ఈ రాజకీయ నాటకాలను ఎదుర్కొంటామని ఆయన ప్రకటించా రు.

**ఇది ఉద్దేశ్యపూర్వక ఘటనే : పినరయి విజయన్**

కేంద్ర దర్యాప్తు సంస్థ తన ఇంట్లోకి ప్రవేశించి సోదాలు నిర్వహించాలని కోరుకోవడం మొదలుపెట్టి చాలా కాలమైందని, ఇది ఆకస్మికంగా జరిగిన ఘటన కాదని, ఉద్దేశపూర్వకంగా జరిగిందని పినరయి విజయన్ అన్నారు. తమ పార్టీ సభ్యులు కాని వారిపై ఇడి దాడి చేయాలని కాంగ్రెస్ కోరుకుంటోందని, ఈ సోదాలు దేశంలోని కొందరికి గొప్ప సంతృప్తిని ఇస్తున్నాయని పినరయి ఆరోపించారు. పినరయి విజయన్ ఇంటిపై ఎందుకు దాడి చేయలేదని, ఆయనను ఎందుకు అరెస్టు చేయలేదని గతంలో బహిరంగంగా ప్రశ్నించిన రాహుల్ గాంధీ వంటి వారు సంతోషంగా ఉన్నారని కూడా ఆయన అన్నారు. దేశంలోని ప్రతిపక్ష నాయ కులు, కార్యకర్తలపై బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తుందని విమర్శించారు.

**ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య : సిపిఐ**

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జరిపిన దాడులు స్పష్టమైన రాజకీయ కక్ష సాధింపు చర్య అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం విమర్శించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బరితెగించి దుర్వినియోగం చేయడానికి ఇది మరో ఉదాహరణ అని ఒక ప్రకటనలో పేర్కొంది. ఇలాంటి చర్యల లక్ష్యం వామపక్షాలను భయపెట్టడం, రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం, సమాఖ్య సూత్రాలను బలహీనపరచడమని తెలిపింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు, భిన్నాభిప్రాయాలు గల రాజకీయ గొంతులకు వ్యతిరేకంగా ఇడి వంటి సంస్థలను పదేపదే ఆయుధాలుగా ప్రయోగించటం ప్రజాస్వామ్యానికి, సమాఖ్యవాదానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తుందని సిపిఐ హెచ్చరించింది. రాజకీయ ప్రతిపక్షం గొంతు నొక్కడానికి, భయపెట్టడానికి జరుగుతున్న ఈ నిరంకుశ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, లౌకిక, సమాఖ్య శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చింది.

**స్టాలిన్ ఖండన :** పినరయ్ విజయన్ ఇళ్లపై ఇడి దాడులను తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. మోదీ ప్రభు త్వం ప్రతిపక్ష నాయకులకు వ్యతిరేకంగా కేంద్ర సంస్థల్ని ఆయుధాలుగా వాడుకుంటున్న ధోరణి పెరుగుతోందన్న ఆందోళనలను ఈ పరిణామం రేకెత్తిస్తోందన్నారు. పినరయ్ విజయన్‌ను బిజెపి ఇంకా ఎందు కు లక్ష్యంగా చేసుకోలేదు అని పదేపదే ప్రశ్నించిన కొందరు కాంగ్రెస్ నాయకుల బాధ్యతారహిత ఆరోపణలలోని డొల్లతనాన్ని కూడా ఇది బట్టబయలు చేస్తోందన్నారు.

ఇప్పుడు వాటిని కారుణ్య నియామకాల పేరుతో భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. సింగరేణి కార్మికులకు అతి తక్కువ పెన్షన్లు అందుతుండడంతో వారికి ఆసరా పెన్షన్లు కూడా ఇవ్వాలన్నారు.

**పెట్రో ధరలు పెద్ద ఎత్తున నిరసనలు**

కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా పెంచుతున్న పెట్రో ల్, డీజిల్ ధరలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సాంబశివరావు ప్రకటించారు. గతంలో ముడి చమురు ధర లు తక్కువగా ఉన్న సమయం పెట్రోలు ధరలను తగ్గించని కేంద్రం ఇప్పుడు యుద్ధం పేరుతో రూ.107 పై చిలుకు ఉన్న పెట్రోల్ ధరలను కేవలం 10 రోజుల వ్యవధిలో రూ.116కు పెంచడం దుర్మార్గమన్నారు. సంక్షోభం పేరుతో సామాన్య ప్రజలపై భారం మోపడం సరికాదని, కార్పొరేట్ సంస్థలపై ప్రత్యేక పన్నులు, సంపద పన్ను పెంచి పేదలపై భారం తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌పై కేసు లు పెట్టి మానసిక వేదింపులకు గురిచేయడం తగదని సాంబశివరావు అన్నారు. విశ్లేషణ సమయాల్లో విమర్శలు, సద్విమర్శలు చేయడం సహజమని, అందులో భాగంగానే ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేశారని, అంత మాత్రానికే ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం వారికే నష్టమని పేర్కొన్నారు.

**విద్య, వైద్యంరంగాల్లో దోపిడీని అరికట్టాలి**

విద్య, వైద్యరంగంలో ఫీజుల దోపిడీని అరికట్టాలని

# సమ్మె తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని సాంబశివరావు డిమాండ్ చేశారు. జూన్ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కార్పొరేట్ విద్యా సంస్థల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీని ప్రభుత్వం నియంత్రించాలన్నారు. వైద్యం పేరుతో కార్పొరేట్ ఆసుపత్రులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ఫీజులను అరికట్టాలన్నారు. డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ పరిస్థితుల్లో ఏమాత్రం మార్పులు కనిపించకపోగా, మరింత ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యం లో నిఘాను మరింత పటిష్టం చేయాలని ఆయన సూచించారు. గ్రామ పంచాయితీ కార్మికులకు మొదటి తారీకున వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని, అదే సమయంలో కార్మికులకు ఇటీవల పెంచిన కనీస వేతనం ఏమాత్రం సరిపోదని, న్యాయబద్ధంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆశా, అంగన్‌వాడీ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వ దృష్టి సారించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

**సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం: సీతారామయ్య**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సింగరేణిలో మితిమీరి నా రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో సింగరేణి ఉనికే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొంటున్నాయని వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణిలో బిఆర్ఎస్ కొద్దిగా జోక్యం చేసుకోగా, కాంగ్రెస్ జోక్యం ఎక్కువైందని, ఎప్పుడు లేనిది అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని వారు తెలిపారు.

గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ సింగరేణికి రూ.21 వేల కోట్లు బకాయిలు పెట్టగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అది ఏకంగా రూ.56 వేల కోట్లు చేరిందన్నారు. గతంలో ఏడాదికో రెండేళ్లకో ఓ కొత్త మైన్ సింగరేణికి వచ్చేదని, కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక మైన్ కూడా కేటాయించలేదని, ఇందుకు సంబంధించి యాజమాన్యం, ప్రభుత్వం పూర్తిగా ఉదాసీనతతో వ్యవహరిస్తున్నాయన్నారు. మరోవైపు బొగ్గు వెలికితీతను సైతం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం, మెడికల్ బోర్డును పూర్తిగా నిర్వీర్యం చేయడం, కార్మిక సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదన్నారు.

ఈ సమస్యలను నిరసిస్తూ యూనియన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులతో ఇటీవలే సమావేశం నిర్వహించి యాజమాన్యానికి చేసిన సూచనలు జూన్ రెండవ వారం లోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె తప్పదని వారు హెచ్చరించారు.

# ఫైనల్‌కు ఆర్‌సిబి

- క్వాలిఫయర్ – 1 మ్యాచ్‌లో 92 పరుగులతో గుజరాత్‌ను చిత్తు చేసిన బెంగళూరు
- కెప్టెన్ రజత్ పటీదార్ విశ్వరూపం



**ధర్మశాల :** రెండో టైటిల్‌పై కన్నేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్వాలిఫయర్–1లో గర్జించింది. ధర్మశాలలో ఏకపక్ష పోరులో గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. రజత్ పటిదార్(93) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రికార్డు స్కోర్ కొట్టిన ఆర్‌సిబి.. జాకబ్ డఫ్పీ(39–3), రసిక్ దార్ సలాం(24–2), భువనేశ్వర్(28–4) విజృంభణతో గుజరాత్‌ను చిత్తు చేసి నాలుగోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. ఘోర ఓటమి చవిచూసిన శుభ్‌మన్ గిల్ సేన ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్ 2లో తలపడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచింది. 19వ సీజన్ క్వాలిఫయర్–1లో 254 పరుగులతో అత్యధిక స్కోర్ రికార్డు బద్ధలు కొట్టిన ఆర్‌సిబి.. గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కనీసం పోరాడకుండానే మ్యాచ్‌ను బెంగళూరుకు అప్పగించేసింది. పేసర్లు జాకబ్ డఫ్పీ (39–3) రసిక్ దార్(24–2), హేజిల్‌వుడ్(39–1)లు వికెట్ల వేటతో చెలరేగగా ప్రత్యర్థిని 162 కే కట్టడి చేసిన రజత్ పటిదార్ బృందం 92 పరుగుల భారీ విజయంతో ఫైనల్లో అడుగుపెట్టింది. ఆర్‌సిబి నిలిపిన 255 పరుగుల లక్ష్యాన్ని చూసి నీరుగారిపోయిన గుజరాత్ ఛేదనలో ఆది నుంచి తడబడింది. ఓపెనర్ సుదర్శన్(14) బ్యాట్‌ను వికెట్లపై పడేసుకొని హిట్‌వికెట్‌గా వెనుదిరగగా.. భువనేశ్వర్ ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్(2)ను బౌల్డ్ చేసి గుజరాత్‌కు షాకిచ్చాడు. అనంతరం హేజిల్‌వుడ్ ఓవర్లో 4, 6, 4 బాదిన బట్లర్(29) బౌల్డయ్యాడు. రసిక్ దార్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిషాంత్ సింధు(5).. తర్వాతి బంతికే హేజిల్‌వుడ్ చేతికి చిక్కి హోల్డర్(0) చిక్కగా 51కే సగం వికెట్లు కోల్పోయింది గుజరాత్. అప్పటికే ఓటమి ఖరారవ్వగా సుందర్ తేలిపోయాడు. సహకరించేవాళ్లు లేక ఒంటరైన ఇంప్యాక్ట్ సబ్ తెవాటియా(68) పరుగుల అంతరం తగ్గించే ప్రయత్నం చేశాడు. అర్ధ శతకంతో విసిగించిన తెవాటియా 19వ ఓవర్లో పటిదార్ క్యాచ్‌తో డగౌట్ చేరాడు. సిరాజ్ చివరి వికెట్‌గా ఔటవ్వగా ఆర్‌సిబి 92 పరుగులతో విజయం సాధించింది.

**చితక్కొట్టిన పటిదార్ :** క్వాలిఫయర్ 1లో కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రికార్డు స్కోర్ కొట్టింది. విరాట్ కోహ్లీ(43), పడిక్కల్(30)లు అదిరే ఆరంభమివ్వగా.. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఆర్‌సిబి 76 పరుగులు చేసింది. అనంతరం కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో గుజరాత్ బౌలర్లను భయపెట్టాడు. ఖేజ్రోలియా వేసిన 15వ ఓవర్లో రెండు నో బాల్స్, వైడ్ నాలుగు ఫోర్లు, సిక్సర్ కలిపి 28 రన్స్ వచ్చాయి. మూడో వికెట్‌కు 95 రన్స్ జోడించిన కృనాల్(43)ను రబడ ఔట్ చేయగా గుజరాత్ ఊపిరిపీల్చుకుంది. కానీ, పటిదార్ రెండు సిక్సర్లతో స్కోర్ రెండొందలు దాటించాడు. ప్రసిధ్ వేసిన చివరి ఓవర్లో రెండు సిక్సర్లు బాదేశాడు. గుజరాత్ చెత్త ఫీల్డింగ్ కలిసి రావడంతో ఆర్సీబీ నాకౌట్‌లో అత్యధిక స్కోర్‌తో చరిత్ర సృష్టించింది. 2023లో ముంబై ఇండియన్స్‌పై 233/3తో గుజరాత్ సాధించిన రికార్డును బెంగళూరు బద్ధలు కొట్టింది.

## సింధు శుభారంభం




సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ షెట్టి శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు 21–17, 21–18తో వరుస గేమ్స్లో ఇండోనేషియా స్టార్, ప్రపంచ 6వ ర్యాంకర్ పుత్రి కుసుమ వర్దానిని ఓడించింది. గతేడాది వరల్ చాంపియన్షిప్, సుదిర్మన్ కప్లో వర్దాని చేతిలో ఎదురైన పరాజయాలకు ప్రతీకారం తీర్చుకుంది. కానీ, మరో మ్యాచ్‌లో ఉన్నతి హుడా 14–21, 10–21తో 8వ సీడ్ మోకా మియాజాకి (జపాన్) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్లో ఆయుష్ శెట్టి 21–11, 14–21, 12–21 విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్)చేతిలో ఓడిపోయాడు. డబుల్స్లో ప్రపంచ 4వ ర్యాంకర్ సాత్విక్‌చిరాగ్ 26–28, 21–15, 21–13 తేడాతో మలేషియాకు చెందిన చెన్ జీ యిప్రెస్లీ స్మిత్ జోడీపై చెమటోడ్చి గెలిచింది.

## గుకేశ్, ప్రజ్ఞా, దివ్య గెలుపు

**ఓస్లో (నార్వే):** నార్వే చెస్ టోర్నమెంట్ను భారత గ్రాండ్మాస్టర్లుడి. గుకేశ్, ఆర్. ప్రజ్ఞానంద, దివ్య దేశ్ముఖ్ విజయంతో ఆరంభించారు. ప్రపంచ చాంపియన్ గుకేశ్.. జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్తో దాదాపు 5 గంటల పాటు సాగిన హోరాహోరీ మారథాన్ పోరులో విజయం సాధించాడు. ఇద్దరి మధ్య క్లాసికల్ గేమ్ 144 ఎత్తుల తర్వాత డ్రాగా ముగిసింది. కానీ, అర్మగెడాన్ టైబ్రేకర్ నిర్ణయాత్మక గేమ్లో గుకేశ్ తన వ్యూహాత్మక ఎత్తుతో కీమర్ను చిత్తు చేసి 1.5 పాయింట్లు దక్కించుకున్నాడు. అమెరికా గ్రాండ్మాస్టర్ వెస్లీ సోను కూడా ప్రజ్ఞా అర్మగెడాన్లో ఓడించాడు. మరోవైపు నార్వే లెజెండ్ మాగ్నస్ కార్ల్సన్.. క్లాసికల్ గేమ్లోనే ఫ్రాన్స్కు చెందిన అలీరెజా ఫిరూజా చేతిలో ఓడిపోయాడు. మహిళల విభాగంలో దివ్య .. ప్రపంచ చాంపియన్ జూ వెన్జున్ (చైనా)ను అర్మగెడాన్ టైబ్రేకర్ ఓడించి ఔరా అనిపించగా.. కోనేరు హంపి క్లాసికల్ గేమ్లోనే అసౌబయేవా చేతిలో ఓడి నిరాశపరిచింది.

# ఖగోళ శాస్త్రంలో మాయన్ల ప్రతిభ







ప్రాచీన మాయా నాగరికత కేవలం శిల్పకళా నైపుణ్యంలోనే కాదు, ఖగోళ శాస్త్రంలోనూ అపార ప్రతిభ కనబరిచింది. శుక్రగ్రహం చలనాన్ని గమనించడానికి రూపొందించిన పరిశీలన కేంద్రాలను మాయన్ల అత్యంత విశిష్ట విజయాలలో ఒకటిగా పేర్కోవచ్చు. మాయా ప్రజలు శుక్రగ్రహాన్ని రాత్రి ఆకాశంలో మెరిసే ఒక నక్షత్రంగా మాత్రమే కాదు.. మానవ భవితవ్యాన్ని ప్రభావితం చేసే దివ్య శక్తిగా కూడా పరిగణించేవారు. ఈ గ్రహం ఆకాశంలో కనిపించిన సమయానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చేవారు. ముఖ్యంగా యుద్ధం లేదా సంధికి ఆ సమయాలనే ఎంచుకునేవారు. మాయా ఖగోళ శాస్త్రవేత్తలు శుక్ర గ్రహ చలనాన్ని అసాధారణ ఖచ్చితత్వంతో గమనించారు. వారు శతాబ్దాల ముందుగానే దాని చక్రాలను అంచనా వేసే సమగ్ర పట్టికలను రూపొందించారు. ఉక్స్మాల్, చిచెన్ ఇట్జా వంటి ప్రాంతాలలోని దేవాలయాలు శుక్రగ్రహ మార్గానికి సరిగ్గా సరిపడే కోణంలో నిర్మించబడ్డాయి. వీటి ద్వారానే నాటి శాస్త్రవేత్తలు శుక్రగ్రహ ప్రవర్తనను పరిశీలించి, అర్థం చేసుకునేవారు. శుక్ర గ్రహం ఉదయ నక్షత్రంగా కనిపించినప్పుడు, అది యుద్ధం లేదా దాడికి సూచనగా పరిగణించబడేది. సాయంత్ర నక్షత్రముగా మారినప్పుడు శాంతి, సమన్వయానికి చిహ్నంగా గుర్తింపు పొందేది. ఈ ఖగోళ భావనలు మూఢనమ్మకాలుగా కాకుండా, ఆకాశం, మానవ జీవనానికి మధ్య గాఢమైన గణితఆధ్యాత్మిక అనుబంధాన్ని ప్రతిబింబించేవి. మాయా ప్రజలు ఆకాశ చలనాలను భూమ్య సంఘటనలతో అనుసంధానించగలగడం ద్వారా తమ శాస్త్రం, విశ్వాసం, పురాతన శక్తి మధ్య ఉన్న అద్భుత సమ్మేళనాన్ని చూపించారు. టెలిస్కోపులు పుట్టకముందే, వారు నక్షత్రాలను గమనించారు. అధ్యయనం చేశారు. చలనాన్ని గుర్తించారు.

## అబ్బురపరుస్తున్న పెర్సెపొలిస్

ఇరాన్‌లోని అతి గొప్ప పురాతన అవశేషాలలో ఒకటైన పెర్సెపొలిస్ అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. కర్మదయా పర్వతంలోని అడవిలోఉన్న పెర్సెపొలిస్, ఒకప్పటి అచామెనిడ్ సామ్రాజ్యానికి రాజధాని నగరంగా విఖ్యాతమైనది. శిల్ప కళ, నగర నిర్మాణ శాస్త్రం, నిర్మాణ సాంకేతికత, కళారూపాల్లో పెర్సెపొలిస్ ప్రపంచంలోనే ప్రతిభావంతమైన పురాతన కట్టడాల స్థలంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ నగరం అచామెనిడ్ సామ్రాజ్యానికి శాసనకేంద్రంగా, ఉత్సవాల ప్రత్యేక కేంద్రంగా ఉండేది. క్రీస్తు పూర్వం 330లో అలెగ్జాండర్ దితన సేనలతో పెర్సెపొలిస్‌ను ఆక్రమించి, నగరాన్ని అగ్నికి ఆహుతి చేశాడని అంటారు. పెర్సెపొలిస్‌లోని ప్రతి నిర్మాణం, ప్రతి శిల్పం, ప్రతి స్తంభం అచామెనిడ్ సామ్రాజ్య కాలం నాటి కళను, నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తూ, మెసపొటేమియా నిర్మాణాలకు ప్రేరణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ద్వంద్వఎద్దు శిరస్సులతో కూడిన స్తంభ అగ్రభాగాలు, గొప్ప శిల్ప కళా నైపుణ్యానికి తార్కాణాలు. సుమారు 13 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించిన ఈ నగరం ప్రపంచ పురావస్తు, నిర్మాణ చరిత్రలో తిరుగులేని అవశేషం. పెర్సెపొలిస్ యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు పొందింది.



## శిశు సమాధులు..



ఇరాన్ వాయవ్య ప్రాంతంలోని, పురావస్తు ప్రాధాన్యంగల చపరాబాద్‌లో సుమారు 6,500 సంవత్సరాల క్రితం నాటివిగా భావిస్తున్న రెండు విశిష్టమైన శిశు సమాధులు వెలుగులోకి వచ్చాయి. 'ఫిక్స్.ఒఆర్‌జి' నివేదిక ప్రకారం, ఈ సమాధులను ఒక పురాతన నిర్మాణ అవశేషాల్లో సుమారు పది అడుగుల దూరంలో గుర్తించారు. ఇవి గర్భస్థ శిశువులను పాత్రల్లో ఉంచి సమాధి చేసిన ఉదాహరణలు కావడం విశేషం. ఈ పరిశోధనను టర్బియత్ మోదారెస్ విశ్వవిద్యాలయానికి చెందిన మహ్దీ అలిరెజాజాదే, ఇరానియన్ సెంటర్ ఫర్ ఆర్కియాలజికల్ రీసెర్చ్‌కు చెందిన హనాన్ బహ్రానీపూర్ నిర్వహించారు. వారు తెలిపిన ప్రకారం, ఈ రెండు పాత్రలు దాల్మా సంస్కృతికి చెందినవి. మొదటి పాత్ర భవనం లోపల వంటగదిగా భావిస్తున్న ప్రాంతంలో లభించగా, రెండవది నిల్వ గదిగా అనుమానిస్తున్న ప్రాంతంలో బయటపడింది. ఈ సమాధులకు ఉపయోగించిన పాత్రలు మొదట్లో రోజువారీ గృహ అవసరాల కోసం వాడినవే. వంటగదిలో లభించిన పాత్రపై పొగ మచ్చలు కనిపించాయి. దీనిద్వారా అది వంటకు ఉపయోగించారని పరిశోధకులు నిర్ధారించారు. రెండు సమాధుల్లో ఉన్న శిశువుల అవశేషాలను పరిశీలించగా, అవి 36నుండి38 వారాల గర్భధారణ దశలో మరణించినవని తేలింది. భవిష్యత్తులో ఈ అవశేషాలపై డిఎన్ఎ పరీక్షలు, రసాయనిక విశ్లేషణలు చేయాలని పరిశోధకులు యోచిస్తున్నారు. దీనిద్వారా ఆకాలంలోని ప్రజల జీవన విధానం, కుటుంబ నిర్మాణం, శిశు మరణాలకు సంబంధించిన ఆచారాలపై మరింత అవగాహన లభించే అవకాశం ఉంది.

# కార్మికవర్గ దిక్సూచి ఎఐటియుసి

## మాజీ ఎమ్మెల్యే, ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్ చాడ వెంకట్‌రెడ్డి – ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల లోగో ఆవిష్కరణ




**ప్రజాపక్షం/కరీంనగర్ :** భారతదేశంలో కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచేందుకు 1920లో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఎఐటియుసి ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్యే, ఎఐటియుసి రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్ చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన సంఘం రూపొందించిన ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభల లోగోను ఆహ్వాన సంఘం ప్యాట్రన్ కలవేన శంకర్, ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, టేకుమల్ల సమ్మయ్య, కోశాధికారి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్‌లతో కలిసి చాడ వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఆవిర్భవించిన ఎఐటియుసి భారత దేశ స్వాతంత్ర్యం కోసం కార్మిక వర్గాన్ని, ఉద్యోగ వర్గాన్ని ఐక్యం చేసి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నదని, సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మిక వర్గానికి ఆశాజ్యోతిగా నిలిచిందన్నారు. శ్రమకు తగ్గ ఫలితం కావాలని, పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని, కనీస వేతనాల కోసం నాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిందన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను, చివరికి సమ్మె చేసే హక్కును కూడా కాలరాయడానికి బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు. కార్మిక వర్గానికే కంచుకోటగా నిలిచే కరీంనగర్ జిల్లాలో సెప్టెంబర్ మాసంలో తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి నాలుగవ మహాసభలు జరగనున్నాయని, కార్మిక వర్గం భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు కరీంనగరే వేదిక అవుతుందని, ఈ మహాసభల విజయవంతం కోసం ఉమ్మడి జిల్లా కార్మిక వర్గం దాని అనుబంధ సంఘాలు కృషి చేయాలని వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ స్థలం సాధించే వరకూ పోరాటం

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని గబ్బిలాల్‌పేటలో మంజూరైన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించటంతో పాటు నిర్మాణ పనులు చేపట్టే వరకు పోరాటం ఆపేది లేదని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు. బుధవారం జరిగిన అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఉమా మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల నిర్మాణం చేపట్టే లక్ష్యంగా రాజకీయేతర జెఎసి ఏర్పాటైందన్నారు. ఈనెల 31, జూన్ 1,2 తేదీల్లో స్థానికులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో సంతకాల సేకరణ కార్యక్రమం, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి మానవహారం చేపడతామన్నారు. ప్రభుత్వానికి గబ్బిలాల్‌పేటలో ప్రభుత్వ స్థలం కేటాయించాలన్న ప్రజావాణిని తెలియచేసేందుకు నిర్ణయించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.శంకర్ అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, జయమ్మ, మల్లిక, మాధవి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, శివన్నారాయణ, సిఐటియు నాయకులు భాస్కర్, మాస్‌లైన్ న్యూ డెమక్రసీనేతలు శివబాబు, అశోక్, సునీత, మంజుల, కాంగ్రెస్ పార్టీ నేతలు వినయ్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో నూతన జెఎసి కమిటీని ఎన్నుకున్నారు.



## గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఎండి ఆసిఫ్ పాషా డిమాండ్ చేశారు. కేటీకే 5 ఇంక్లైన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆధ్వర్యంలో గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ భాష మాట్లాడుతూ వారం రోజులుగా ఆర్ఓ ప్లాంట్ పనిచేయకపోవడంతో గని కార్మికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, వేసవి తీవ్రత దృష్ట్యా యాజమాన్యం స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. వన్ సీమ్ మ్యాన్ రైడింగ్ ఎక్స్టెన్షన్ పనులు నిలిచిపోవడంతో కార్మికులు దూరప్రాంతాలకు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మ్యాన్ రైడింగ్ ఎక్స్టెన్షన్ పనులను యాజమాన్యం పూర్తి చేయాలని కోరారు. గనిలో యాష్ బ్రిక్స్ మరియు బ్రాటిస్ట్ క్లాత్ కొరత కారణంగా గనిలో సరైన గాలి ప్రసరణ లేకపోతే కార్మికుల ఆరోగ్య భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అవసరమైన సామగ్రిని తక్షణమే అందుబాటులో ఉంచి గనిలో భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమలో ఎఐటియుసి కార్మిక నాయకులు గోవిందుల తిరుపతి, రవి కుమార్, రాజేందర్, నారాయణ మూర్తి, నల్ల సత్తి, కుమార్, నాగేంద్రబాబు, ప్రవీణ్, నరేష్, రాయమల్లు, చుక్కన్న, సమ్మిరెడ్డి, రాంచందర్, సుధాకర్, రాజు, గౌతమ్, శ్రీధర్, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసిలో చేరిన సివిల్ డిపార్ట్‌మెంట్ కార్మికులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్‌జి1 ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న వివిధ యూనియన్లకు చెందిన ఆకుల లక్ష్మ ణ్, కొప్పుల రాజు, బాలాజీ, రాజశేఖర్ తదితరులు ఏఐటియుసి లో చేరారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ – ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ వారికి ఏఐటియుసి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. మంగళవారం రాత్రి గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఎల్లా గౌడ్ మాట్లాడుతూ, సింగరేణిలో కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎఐటియుసి పై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఏఐటియుసిని సింగరేణిలో మరింత బలోపేతం చేసేందుకు కార్మిక వర్గం ముందుకు రావాలని కోరారు.ఏఐటియుసి సివిల్ డిపార్ట్మెంట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్‌జి1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను,రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు బిట్టి వెంకటేశ్వర్లు,సివిల్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ అటికేటి రాజు,నాయకులు ఆకునూరి శంకరయ్య, బి.ఆర్.కె. రెడ్డి,గాండ్ల రాజయ్య,తిరుపతి,రంజిత్,రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలి : బోలగాని



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. యాదాద్రి జిల్లాలోని పలు మండలాలతో పాటు మోటకొండూర్ మండలంలోని వివిధ గ్రామాలలో ధాన్యం కేంద్రాలను సందర్శించి మోటకొండూరు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్త నడకన సాగుతుందని లారీలు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని,జిల్లా కలెక్టర్ చొరవ చూపి రైతులను ఆదుకోవాలని కోరారు. అకాల వర్ష సూచన ఉన్నందున ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యాన్ని కల్లాలలో పెట్టుకుని తార్పాలిన్ పట్టాలు లేక, స్థలం లేక ఇబ్బందుల గురవుతున్న పరిస్థితులలో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, నాయకులు బీరకాయల మల్లేశ, ఎండి శంషుద్దీన్, బోల శ్రీనివాస్, కోల్లూరి మల్లేశ, రేగు యాదయ్య, నల్ల యుద్ధవరెడ్డి, జివికలకపల్లి పాండు, నల్ల రాములు, పల్లె శ్రీనివాస్, అజి మస్తాన్, గాజుల స్వామి, బీరకాయల మధు, గట్టి కొప్పుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

## సిపిఐలో చేరికలు

### నియోజవర్గ అభివృద్ధిని చూసి పార్టీలోకి పలువురు ఆకర్షితులు

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/సుజాతనగర్ :** సుజాతనగర్ కొత్తగూడెం నియోజవర్గం అభివృద్ధిని చూసి ఆకర్షితులై ప్రజలు సిపిఐని ఆదరిస్తున్నారని భద్రాద్రి కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా తెలిపారు. బుధవారం సుజాతనగర్ మండలంలోని జామల తండా గ్రామంలో వివిధ పార్టీల నుండి సిపిఐలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎర్ర కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషామాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సుజాతనగర్ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి కోసం, కొత్తగూడెం ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలియజేశారు. గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయం, తాగునీరు మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా సిపిఐ పార్టీ అందుబాటులో ఉంటుందని, పార్టీలకు అతీతంగా ప్రజాసేవ చేస్తున్నామని సాబీర్ పాషాతెలిపారు. జామల తండా నాలుగో వార్డ్ మెంబర్ యుగంధర్, కళ్యాణ్, బిక్కు శ్రీను, కోటేష్, గణేష్ తదితరులు సిపిఐలో చేరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, కార్యవర్గ సభ్యులు భూక్యా దసురు, సిపిఐ మండల నాయకులు భూక్య శీను, గుగులోత్ బాలు, పొమ్య అనిల్ నాయక్, రాంబాబు, సిపిఐ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.





## నేడు మిర్యాలగూడలో రైతు సంఘాల ధర్నా

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వానాకాలం పంటల కనీస మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరిని నిరసిస్తూ వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నేడు మిర్యాలగూడలో నిర్వహించే ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పలువురు రైతు సంఘం నాయకులు కోరారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ఆరుగాలం శ్రమించే అన్నదాతల పొట్ట కొడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రం ప్రకటించిన కొత్త మద్దతు ధరలు పెట్టుబడుల వ్యయానికి కూడా సరిపోవని, ఇదొక అశాస్త్రీయ నిర్ణయమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇంధన ధరలను నియంత్రణలో ఉంచి ఆ తరువాత డీజిల్, పెట్రోల్ రేట్లను భారీగా పెంచడం వల్ల సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. రైతును రాజును చేస్తానని చెప్పే ప్రభుత్వాలు ఆచరణలో వారిని అప్పులపాలు చేస్తున్నాయన్నారు. కేంద్రం తన పద్ధతి మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా రైతాంగం తిరగబడక తప్పదని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై గురువారం నియోకవర్గ వ్యాప్తంగా జరిగే నిరసనల్లో రైతులు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో మల్లు గౌతంరెడ్డి, గోవిందరెడ్డి, చౌగాని వెంకన్న పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** మాదిగ, మాలలు క్రైస్తవాన్ని స్వీకరిస్తే వారి ఎస్‌సి హోదాను కోల్పోయే విధంగా 1950లో రాష్ట్రపతి తీసుకవచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బ్రదర్ ఇరుగు సంసోను, ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ఎక్స్ రోడ్డులో తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టి వెల్ఫేర్ సోసియేషన్ ఆధ్వర్యంలో నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు విద్య, వైద్య, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పరిస్థితులు కోల్పోయే విధంగా ఎస్‌సి హోదాను రద్దు చేయడం సరికాదన్నారు. తమకు రాజ్యాంగ హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. 2024లో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రంగనాథ్ మిశ్రా జాతీయ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. తక్షణమే దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిషప్ ముల్లంగి జాకబ్‌రాజు, బ్రదర్ జాటోత్ డేవిడ్ నాయక్, ధరావత్ రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో నెహ్రూ సేవలు అమోఘం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భారత దేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశ నిర్మాణంలో చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 22వ వార్డు చౌరస్తాలో నెహ్రూ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశాభివృద్ధికి నెహ్రూ బలమైన పునాదులు వేశారని తెలిపారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఆయన పాత్ర విశేషమని కొనియాడారు. శాస్త్రీయ దృక్పదంతో దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన మహా నేత నెహ్రూనని అన్నారు. నెహ్రూ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, కౌన్సిలర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## ఇసుక తక్కువగా వస్తుందంటూ బిల్డర్ల ఆందోళన



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలో ఇండ్ల నిర్మాణాలు చేసుకునేందుకు ఇసుకను ఆన్‌లైన్ బుక్ చేస్తే ఆన్‌లైన్‌లో చూపించిన వెయిట్ రావడం లేదని దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ప్రముఖ బిల్డర్ ఫారూఖ్, తాపీ పనివార్ల సంఘం అధ్యక్షులు రెబల్ శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తాము ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సమయంలో ఐదు టన్నుల ఇసుకకు రూ.4,31900 చెల్లించామని కానీ మాకు మూడున్నర నుంచి నాలుగు టన్నులు మాత్రమే ఇసుక రావడంతో సుమారు టన్నుపైన ఇసుక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చెల్లించిన డబ్బులకు సరిపడా ఇసుక రాకపోవడంతో ట్రిప్పుకు రూ.1వెయ్యి చొప్పున నష్టపోయమన్నారు. తాము 500 ట్రిప్పుల వరకు ఇప్పటి వరకు బుక్ చేసుకొని దిగుమతి చేసుకున్నామని సుమారు రూ.5లక్షలు నష్టపోయామని చెప్పారు. ఆన్‌లైన్‌లో చూపించిన ధరను మేము చెల్లిస్తున్నప్పుడు మాకు రావాల్సిన వెయిట్ ఇసుక ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. బుధవారం తమ వద్దకు మూడు ట్రాక్టర్లు రాగా వెయిట్ వేయిస్తే మూడు ట్రాక్టర్లలో కూడా టన్నుకు పైగా ఇసుక తక్కువగా ఉందన్నారు. ఇసుక తక్కువ వస్తుందని నిరూపించేందుకు వే బ్రిడ్జ్ కాంటాలు కూడా వేయించి పరిశీలించామన్నారు. ఇది కాకుండా ఇసుక తీసుకువచ్చిన డ్రైవర్లు రూ.200 బత్తా డిమాండ్ చేస్తున్నారని బత్తా ఇవ్వకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ విషయమై తాము కోర్టుకు వెళ్లడంతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సాజిద్‌ఖాన్, బిల్డర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తు

**ప్రజాపక్షం/డిండి:** గుండ్లపల్లి మండలంలోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ (2) పోస్టు నియామకానికి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి పగిడిపాటి నర్సింహా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28నుండి 30వ తేది వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలలోపు ఉండి 7వ తరగతి ఉత్తీర్ణత ప్రతం, ఆధార్‌కార్డు, రెసిడెన్సీ సర్టిఫికెట్‌తో పాటు వంటలో అనుభవం కలిగిన పత్రాలను గుండ్లపల్లి మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సి)నందు అందజేయాలని పేర్కొన్నారు.

# ఉపాధి హామీలో నల్లగొండ టాప్

1.23 లక్షల పనిదినాలతో రాష్ట్రంలో ఫస్ట్

స్పెషల్ సిఎస్ దాన కిషోర్

గ్రామాల అభివృద్ధితోనే గ్రామీణ జిడిపికి ఊపు

నవంబర్‌లోపు 941 గ్రామ సమాఖ్య భవనాలు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే గ్రామీణ స్థూల జాతీయోత్పత్తి పెరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన చిన్నకాపర్తి, నార్కెట్‌పల్లి గ్రామాల్లో ఉపాధి హామీ,జలసంచయ్ జన్ భాగీదారి పథకాల పనులను తనిఖీ చేశారు.నల్లగొండలో ఎస్ఎల్‌బీసీ వద్ద నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ పంపు,మహిళా సూపర్ బజార్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు.అనంతరం కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఏపీవోలు, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా 1.23 లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడంపై కలెక్టర్ బి.చంద్రశేఖర్,ఎంపీడీవోలను అభినందించారు.17 ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నా లక్ష్యాల సాధనలో పురోగతి సాధించడాన్ని ప్రశంసించారు.జిల్లాలో 941గ్రామ సమాఖ్య భవనాలు,14 ఫుడ్ స్టోరేజ్ గోదాముల నిర్మాణం చేపట్టామని,నవంబర్‌లోపు గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రైస్ మిల్లుల నిర్వహణకు స్థలాలు మంజూరు కోరడం అభినందనీయమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి రూ.34 వేల కోట్లు కేటాయించిందని,8,000 గ్రామ సమాఖ్య భవనాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని తెలిపారు. ప్రతి నెల 1వ తేదీన గ్రామపంచాయతీ ఉద్యోగులకు జీతాలు,పన్నులను గ్రామాలకే అప్పగించడం, రూ.800 కోట్లతో గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణం గ్రామాల స్వయం సమృద్ధికే నన్నారు. రాష్ట్రంలో8,029 ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయం సహాయక మహిళలు నిర్వహిస్తున్నారని, వారికి లాజిస్టిక్స్ ఇచ్చి రైస్ మిల్లులు ఏర్పాటు చేయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు.పెండింగ్‌లో ఉన్న రూ.300 కోట్లను త్వరలో విడుదల చేస్తామని,ఇంజనీర్ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు.దేశంలోనే మొదటిసారిగా అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు వేసేలా రాష్ట్రంలో 7,000 కి.మీ. గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. గత 2 సంవత్సరాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.65 వేల కోట్ల రుణాలు ఇచ్చామన్నారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధి హామీ, జల్ సంచయ్ జన్ భాగీదారి, పీఎంకేఎస్, మహిళా శక్తి పెట్రోల్ పంపులు, సోలార్ ప్రాజెక్టులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ వంటివి చేపట్టామని తెలిపారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్ స్పెషల్ కమిషనర్ లక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కేంద్రాల వద్ద జరుగుతున్న అలస్యం, అక్కడ ఉన్న రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనులు స్పీడప్ చేయాలని, వర్షాలకు రైతులెవరు దిగులు చెందవద్దని, రైతులు అధైర్యపడవద్దని, వర్షాలు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట ఆర్డిఓ కృష్ణారెడ్డి, తుర్కపల్లి ఎమ్మార్వో రవికుమార్ ఉన్నారు.



## రైతులు అధైర్యపడొద్దు.. తడిసిన ధాన్యాన్ని కొంటాం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. నిన్న రాత్రి కురిసిన అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం తడవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే కొనుగోలు కేంద్రానికి చేరుకుని రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తడిసిన ధాన్యాన్ని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే రైతులు ఎలాంటి అధైర్యానికి గురికావద్దని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా వెంటనే అదనపు లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతనంగా వంగపల్లి గోదాములో ధాన్యాన్ని నిల్వ చేసేందుకు వేసులు బాటు కల్పించడం జరిగిందని,లారీ కాంట్రాక్టర్ తో మాట్లాడి బొమ్మలరామారం,తుర్కపల్లి మండలంలో ఉన్న ధాన్యాన్ని అదనపు లారీలతో లోడ్ చేసి వంగపల్లి గోదాంలో అన్లోడ్ చేయవలసిందిగా తెలిపారు. రైతుల ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గోదాం వద్ద అన్లోడ్ విషయంలో ఏ అధికారి ఏ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యం విషయంలో కూడా రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, రైతులు నష్టపోకుండా అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఆయన వెంట ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వానాకాల పంటల సాగులో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని,నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ హెచ్చరించారు.బుధవారం ఉదయాదిత్య భవన్‌లో వ్యవసాయ, హార్టికల్చర్ శాఖల ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల యజమానులు,వ్యవసాయ అధికారులు,ఏఈవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి,నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకొంటాం నకిలీ విత్తనాల పట్ల, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నకిలీ విత్తనాలపై సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు.రైతులు వరి సాగుపై మాత్రమే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఏఎంఆర్‌పి కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో బావుల కింద సాగు చేసుకునే విధానాలపై రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రతిరోజూ 6 వేల నమోదులు పూర్తి చేసేలా లక్ష్యంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్,జిల్లా ఉద్యానఅధికారి సుభాషిని,తెలంగాణ సీడ్స్ రీజనల్ మేనేజర్ కృష్ణవేణి,వ్యవసాయ అధికారులు హాజరయ్యారు.

## అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం ఉద్యమిద్దాం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భువనగిరి మండల కార్యదర్శి దివంగత నాయకుడు ముదిగొండ రాములు 2 వ వర్ధంతి బుధవారం భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామంలో జరిగింది. వర్ధంతి సందర్భంగా ముదిగొండ రాములు స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ భువనగిరి మండల సిపిఐ కార్యదర్శిగా పార్టీ నిర్మాణం కోసం అహర్నిశలు కృషి చేసిన రాములు ధన్యజీవి అని కొనియాడారు. అంతరాలు లేని సమాజ నిర్మాణం కోసం తపనపడేవాడని కానీ దురదృష్టవశాత్తు అతను అనారోగ్యంతో మరణించినాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య శాఖ కార్యదర్శి ముదిగొండ ఠాగూర్ నాయకులు ముదిగొండ మహేష్ చిక్క బిక్షపతి, రాసాల బాలస్వామి, రాసాల నరసింహ, కుటుంబ సభ్యులు భార్య ముదిగొండ లక్ష్మి తండ్రి దేవయ్య కుమారుడు రాజు, కూతురు వెన్నెల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా వారి స్తూపం వద్ద ఎర్రజెండాను సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య ఎగరవేయడం జరిగింది.

## రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి



బాధితులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/భువనగిరి :** నల్గొండ చౌరస్తా నుండి హైదరాబాద్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణలో నష్టపోతున్న బాధితులకు న్యాయం చేయాలని బాధితులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరిలోని మున్సిపల్ బాధితులు చేస్తున్న ధర్నాకు నాయకులు మద్దతుగా నిలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న భువనగిరి శాసనసభ్యులు భువనగిరి పట్టణంలోని నల్గొండ చౌరస్తాకు మధ్యాహ్నం టైంలో విచ్చేసి రోడ్డు విస్తరణకు కొబ్బరికాయ కొట్టి జెసిబి తీసుకొని వచ్చి ఇండ్లను దగ్గర ఉండి కూలగొట్టడం మొదలుపెట్టడం జరిగిందన్నారు. బాధితులకు నోటీసులు ఇవ్వకుండా వారితో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ఇష్టారాజ్యంగా పనిని మొదలు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూనట్లు చెప్పారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని బాధిత కుటుంబాలు మున్సిపల్ ఆఫీస్ దగ్గర అకిలపక్ష నాయకులతో కలిసి నిరసన తెలుపుతు బాధిత కుటుంబాలకు ఏ విధంగా నష్టపరిహారం చెల్లిస్తారో తెలిపిన తర్వాత గతంలో కూడా భువనగిరి పట్టణంలో అనేక రోడ్డు వెడల్పు కార్యక్రమాలు జరిగాయి కానీ బాధిత కుటుంబాలను ఒప్పించి అఖిలపక్ష మీటింగ్ ఏర్పాటు చేసి అనంతరం వారికి నోటీసులు ఇచ్చిన తర్వాత రోడ్డు వెడల్పు కార్యక్రమం చేశారు. అదేవిధంగా ఇప్పుడు కూడా వారికి న్యాయం చేయాలని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తూ ఉండగా కాంగ్రెస్ కౌన్సిలర్ల భర్తలు వీధి రౌడీల్ల ప్రవర్తిస్తూ పోలీసుల సహాయంతో బాధిత మహిళలను కొట్టుకుంటూ తన్నుకుంటూ వారిపై నుండి మున్సిపల్ కార్యాలయంలోనికి వెళ్లడం జరిగింది. పోలీసులు కూడా బాధిత కుటుంబాలను, అఖిలపక్ష నాయకులను అక్కడ నుంచి వెళ్ళగొట్టి సమావేశం జరిపారు. ఈ కార్యక్రమంలో బాదితులు, నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలలో బాధితులకు వేగంగా సేవలు



జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సైబర్ నేరాలలో బాధితులకు వేగవంతమైన సేవలు అందించాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా అధికారులకు సూచించారు. ఫంక్షన్ వర్టికల్, కేసుల నిర్వహణ, డిజిటలైజేషన్, కేసుల స్థితిగతుల నమోదులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ అంశాలపై జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో పోలీసు అధికారులు, సైబర్ వారియర్స్, ఐటి సాంకేతిక సిబ్బందితో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల్లో రూ.50వేల లోపు డబ్బు కోల్పోయిన బాధితులకు మనీ రిస్టోరేషన్ మేనేజ్‌మెంట్ పోర్టల్ ద్వారా త్వరితగతిన రీఫండ్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసు చేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పెండింగ్ కేసులను త్వరితగతిన చేధించాలన్నారు. కోర్టు డ్యూటీ అధికారులు సిఎంఎస్ (కోర్టు మానిటరింగ్ సిస్టమ్)లో ప్రతిరోజూ కోర్టులో జరిగిన కార్యకలాపాలు, హియరింగ్స్, సమన్లు, సిసి నంబర్లు తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని తెలిపారు. రాత్రివేళల్లో నిర్వహిస్తున్న నైట్‌బీట్, పెట్రోలింగ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెట్రోలింగ్ వాహనాల్లో ఏర్పాటు చేసిన జిపిఎస్ వ్యవస్థ పర్యవేక్షించాలని ఆదేశించారు. దొంగతనాల నియంత్రణ బిట్ అధికారులు, పెట్రోకార్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. స్టేషన్ రైటర్లు, టెక్నికల్ టీం సిబ్బంది ప్రతి డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వివిధ కేసుల్లో నిర్దేశిత కాలవ్యవధిలో చార్జిషీట్లు దాఖలు చేసేలా ఎస్‌హెచ్‌ఓలకు సహాయకారిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, డిసిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ మగ్దూం అలీ, ఎస్‌ఐలు యాకూబ్, ఝాన్సీరాణి, ఐటి కోర్ ఆర్‌ఎస్‌ఐ రాజశేఖర్, సైబర్ వారియర్స్, టెక్నికల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతీ అభివృద్ధి పని ప్రజలకు తెలియజేయాలి

ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/నూతనకల్ :** ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను, జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జరుగుతున్న ప్రతి ఒక్క అభివృద్ధి పని ప్రజలకు తెలియజేయాలని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. బుధవారం మండలంలోని యడవల్లి ఆవాస గ్రామమైన గుండ్లసింగారం వద్ద గల పాలేరు వాగుపై రూ.13కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సూర్యాపేట, నూతనకల్, దంతాలపల్లి ప్రధాన రహదారిపై గత 70 సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలం వచ్చిన సమయంలో నీరు బ్రిడ్జి మీదుగా ప్రవహించడంతోపాటు బ్రిడ్జికి గల స్లాబు పెచ్చులు ఊడిపోయి సువ్వలు బయటికి కనిపించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయంతో ప్రయాణం చేయడం గమనించి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు బ్రిడ్జి దుస్థితని తెలియజేసి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని కోరడంతో నిర్మాణానికి సహకరించినట్లు తెలిపారు. సహకరించిన మంత్రులకు నియోజక వర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో తనతోపాటు చురుగ్గా పాల్గొని సహకరించిన తన సహచరుడు తీగల మల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పిఏసిఎస్ చైర్‌పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, తుంగతుర్తి పిఏసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఎరువులు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం రైతు సోదరులకు వ్యవసాయ శాఖలో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు జీలుగ 2026 వానాకాలం సీజన్ కొరకు అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాల ధరలు (50% సబ్సిడీతో): జీలుగ 30 కిలోలుమొత్తం ధర: రూ.4,905 రైతు చెల్లించవలసిన ధర: రూ.2,452.50 రైతులకు పచ్చిరొట్ట ఎరువులపై సబ్సిడీ విత్తనాలు అందజేయనున్నట్లు తెలిపారు. విత్తనాల కొరకు రైతులు ఆధార్ కార్డు , పట్టా దారు పాస్బుక్ జిరాక్స్ తీసుకురావాలని కోరారు. పూర్తి వివరాలకు పోచంపల్లి పిఏసిఎస్‌కు సంప్రదించాలని కోరారు.

## మహిళా సాధికారతతోనే సమాజ ప్రగతి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే సమాజం వేగంగా బుధవారం ఆదిలాబాద్ గ్రామీణ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వ రాయితీలు, బ్యాంక్ లింకేజీ రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. బాల్య వివాహాలను అరికట్టడంలో మహిళా సంఘాలు చొరవ చూపాలని, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాల ప్రతినిధులను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. డీఆర్‌డీఓ రవీందర్ రాథోడ్, ప్రతినిధులు, వీఓఏలు, అధికారులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో.. కళ్లాల్లో ధాన్యం

ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. నిజాంపేట మండలం వివిధ గ్రామాల్లో రైతులు ధాన్యం ఆరబోసి, వర్ష సూచన మేరకు వడ్ల కుప్పలపై టార్పాలిన్ లను కప్పారు. కానీ కల్వకుంట, రజాక్ పల్లి, నస్కల్, రాంపూర్, నందగోకులం, నిజాంపేట గ్రామాల్లో కొనుగోలు జరిగిన ధాన్యం బస్తాలు తడిసి పోయాయి. సెంటర్ ఇంచార్జి, మండల స్థాయి అధికారులు అటు వైపు చూసింది లేదని రైతులు ఆరోపిస్తుచారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు లో వేగం పెంచాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వం ఒకపక్క పండించిన ప్రతి గింజాను కొంటామని చెబుతూ లారీలు పంపడంలో గన్ని బ్యాగులు ఇవ్వడంలో హమాలీల కొరతతో తూకాలు వేసాడం ఆలస్యం కావడంతో ఈ యొక్క అకాల వర్షానికి ధాన్యం మళ్ళీ తడిసి ముద్దయిందని రైతులు వేడుకుంటున్నారు. ఉదయాన గ్రామ కార్యదర్శిలు స్థానిక ఎమ్మార్వో శ్రీనివాస్ ఆర్ఐ ప్రీతి అధికారులు కొనుగోలు సెంటర్లను సందర్శించి ధాన్యం బ్యాగులను త్వరితగతిన తదలించాలని సూచనలు చేశారు.

## పాలిసెట్ కౌన్సిలింగ్‌కు ఏర్పాట్లు

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ ప్రభుత్వ సాంకేతిక కళాశాలలో మే 29 నుంచి జూన్ 1వరకు ధృవ పత్రాల పరిశీలన ఉంటుందని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ వెల్లడించారు. ముందుగా విద్యార్తులు మే 27 నుంచి 31 వరకు స్లాట్ బుక్ చేసుకోవాలని, బుకింగ్ ప్రకారం రెండు జిరాక్సు, ఒరిజినల్‌తో విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఈ కళాశాలలో మెకానిక్, ఎలక్ట్రానిక్ కంప్యూటరింగ్ కోర్సులో 60 సీట్లు ఉన్నాయని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## మహిళల అభ్యున్నతితో గ్రామాల అభివృద్ధి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని దేవన్‌పల్లి, కారేపల్లి తండా, రహత్‌నగర్, కొత్త తండా, తాళ్లపల్లి తండా గ్రామాల్లో గ్రామ ఐక్య మహిళా సంఘాల భవనాలకు భూమిపూజ నిర్వహించామన్నారు. ప్రతి గ్రామంలో మహిళల కోసం ప్రత్యేక భవనం ఉండాలని ప్రభుత్వ ఉద్దేశ్యమననుసరించి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి పది లక్షలతో పైన తెలిపిన గ్రామాల్లో భవనాలకు భూమిపూజ నిర్వహించామన్నారు. ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు ఎపియం ప్రమీల, సిసిలు శ్రీనివాస్, రఘు, నరేష్, విక్రమ్‌రాజ్, ఎఇ, వార్డు సభ్య లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, మహిళ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలో ఉద్యోగాల పేరుతో భారీ మోసం

ఫేక్ ఆర్డర్ కాపీలతో నట్టేట ముంచిన ఏజెంట్

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఫేక్ ఆర్డర్ కాపీలతో మోసానికి పాల్పడిన ఉదంతం వెలుగు చూసింది. ఈ మోసానికి వ్యతిరేకంగా బాధితులు బుధవారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి, నిరసన వ్యక్తం చేశారు. సారంగాపూర్ మండలం జాం గ్రామానికి చెందిన రాథోడ్ వికాస్, రాథోడ్ శివకృష్ణ అనే ఇద్దరు బాధితులు తెలిపన వివరాల ప్రకారం తాము నిరుద్యోగంతో బాధపడుతున్న సమయంలో రాజేందర్ అనే ఏజెంట్ తమను సంప్రదించాడు. మెడికల్ కాలేజీలో ఆఫీస్ సబార్డినేట్, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని ఇప్పించడానికి రూ.2 లక్షలు ఖర్చవుతుందని నమ్మబలికాడు. ప్రభుత్వ ఉద్యోగం వస్తుందనే ఆశతో బాదితులు సదరు ఏజెంట్‌కు రెండు లక్షల రూపాయలు చెల్లించారు.డబ్బులు ఇచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో, బాదితులు ఏజెంట్‌ను గట్టిగా నిలదీశారు. ఆ పత్రాలను తీసుకుని బాదితులు మెడికల్ కాలేజీకి వెళ్ళగా, అక్కడ అలాంటి ఉద్యోగాలేవి లేవని, ఆ ఆర్డర్ కాపీలు పూర్తిగా నకిలీవని కాలేజి సిబ్బంది తేల్చిచెప్పి వారిని వెనక్కి పంపించేశారు.

### బాధితుల ఆవేదన... అధికారులకు విన్నపం

తాము మోసపోయామని గ్రహించి ఏజెంట్ రాజేందర్‌కు ఫోన్ చేస్తే ఆయన ఫోన్ ఎత్తడం లేదని, ఏలాంటి సమాధానం ఇవ్వడం లేదని బాధితులు వాపోయారు. ఈ జిల్లాలో సదరు ఏజెంట్ చేతిలో డబ్బులు పెట్టి చాలా మంది నిరుద్యోగులు మోసపోయారని, అయితే వారు భయంతో బయటకు రావడం లేదని వికాస్, శివకృష్ణ తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి సదరు వసూళ్ళ ఏజెన్సీలపై ఏజెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డబ్బులు తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాదితులు వేడుకుంటున్నారు.



# మాయాపూర్ రోడ్లపై గర్భిణుల నరకయాతన!

గుంతల రోడ్లున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల 'కళ్లకు గంతలు' ,ఎమ్మెల్యే 100 రోజుల హామీపై గ్రామస్థుల గరం



**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు గెలిచిన తర్వాత నీటి మూటలుగా మారుతున్నాయనడానికి నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని మాయాపూర్ రోడ్లని గ్రామస్తులు ధ్వజమెత్తుతున్నారు. మాయాపూర్ గ్రామ రోడ్డు అధ్వానంగా మారడం వల్ల అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్ళాలంటేనే గ్రామ ప్రజలు వణికిపోతున్నారు. ముఖ్యంగా గర్భిణులను స్త్రీలను ప్రసవం కోసం అస్పత్రికి తీసుకువెళ్ళాలంటే ఈ గుంతల రోడ్డుపై ఊపిరి అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. వాహనాలు కదిలే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మరోవైపు వానాకాలం ముంచుకొస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు సమస్యపై గ్రామస్థులు, నాయకులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగినా ప్రతీసారీ పొడి పొడి సమాధానాలే ఎదురవుతున్నాయి. 'రోడ్డు సాంక్షన్ అయింది, కాంట్రాక్టర్ దొరకడం లేదు, వచ్చే నెలలో పనులు ఖచ్చితంగా మొదలవుతాయి' అని కాలయాపన చేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు ప్రారంభం కావడం లేదని ప్రజలు తీవ్రఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పక్క ఊరికి ఒక న్యాయం... మాఊరికో న్యాయమా ?

ఇదే సమయంలో అధికారుల, పాలకుల పక్షపాత వైఖరిపై మాయాపూర్ ప్రజలు మండిపడుతున్నారు. పక్కనే ఉన్న చిట్యాల గ్రామంలో రోడ్డు బాగున్నప్పటికీ, దాని పైనే మళ్ళీ కొత్త రోడ్డు వేశారని, కానీ పూర్తిగా అధ్వాన్నంగా మారి, గుంతలమయమైన మాయాపూర్ రోడ్డును మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. బాగున్న రోడ్లకు నిధులు కేటాయించే పాలకులు, నడవడానికి కూడా వీల్లేని తమ ఊరి రోడ్డును ఎందుకు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.రానున్న వర్షాకాలంలో ఈ రోడ్డు మరింత దారుణంగా మారి, బురదమయంగా మారుతోందని, అప్పుడు గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు కూడా తెగిపోయే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించినందుకు తమకు కనీస మౌలిక వసతి అయిన రోడ్డును కూడా నిర్మించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు స్పందించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, తక్షణమే మాయాపూర్ గ్రామానికి రోడ్డు వేయించి గర్భిణలు ప్రాణాలను కాపాడాలని గ్రామ ప్రజలు మనస్ఫూర్తిగా వేడుకుంటున్నారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుత ఎమ్మెల్యే గెలిచిన 100 రోజుల్లోనే మాయాపూర్ గ్రామానికి కొత్త రోడ్డు వేయిస్తానని గ్రామ ప్రజలకు ఘనంగా హామీ ఇచ్చారు. కానీ ఆయన గెలిచి ఇన్నాళ్ళవుతున్నా ఆ హామీ మాత్రం ఇప్పటికీ కాగితాలకే పరిమితమైందని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## అకాల వర్షంతో.. అపార నష్టం

తడిసి ముద్దయిన ధాన్యం,పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయింది. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి రైతుల వరి ధాన్యం బస్తాలు, ఆరబోసిన ధాన్యం రాశులు, తడిసి ముద్దయ్యాయి. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు లేకపోవడమే కాకా దానికి అధికారుల ఆలసత్వం తోడైంది. రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్న మండల అధికారులు తమకేమీ పట్టినట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఐబీ చౌరస్తా కాగితంపల్లి, అల్లాదుర్గం రెడ్డిపల్లి ముస్లాపూర్ పెద్దాపూర్ తదితర సెంటర్లలో తూకం వేసి వారం రోజులు గడుస్తున్న రైస్ మిల్లులకు తరలించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

## నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

సద్వినియోగంచేసుకోవాలని కోరిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ద్వారా ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మేసన్, టేసన్ ట్రేడ్లలో మూడు నెలల శిక్షణ కార్యక్రమం ప్రారంభించబడుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మూడు నెలల శిక్షణ కాలానికి గాను రూ.18 వేల రుసుముండగా, జిల్లా యంత్రాంగం తరపున 50 శాతం రాయితీని కల్పిస్తామన్నారు. అభ్యర్థులు కేవలం రూ.9000 రుసుము (నెలకు మూడు వేల చొప్పున) మాత్రమే చెల్లించి పై ట్రేడ్‌లలో శిక్షణ పొందవచ్చని సూచించారు. శిక్షణ కాలంలో అనుభవజ్ఞులైన ట్రేనర్లచే అభ్యర్థులకు నైపుణ్యాభివృద్ధి కోసం ప్రాక్టికల్స్‌తో పాటు థియరీలో నాణ్యమైన శిక్షణ అందించబడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు కలిగిన న్యాక్ సంస్థ ద్వారా ఇది వరకు వివిధ ట్రేడ్లలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు పూర్తిస్థాయిలో 100 శాతం ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయని కలెక్టర్ గుర్తు చేశారు. పదవ తరగతి ఆ పై విద్యార్హతలు కలిగి ఉండి 18 – 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు ప్రస్తుతం ఎలక్ట్రిషియన్ ప్లంబర్, మేసన్, టేసన్ ట్రేడ్లలో మూడు నెలల శిక్షణ పొందేందుకు అర్హులని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు 2026 జూన్ 9 లోపు నిజామాబాద్ కలెక్టరేట్‌లో సమీపంలోని న్యాక్ కేంద్రంలో నేరుగా దరఖాస్తులను అందించవచ్చన్నారు. వివరాలకు 9296 507 557 ను సంప్రదించవచాలన్నారు.



## ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** జిల్లాలో మిగిలి ఉన్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సోన్ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, ఐకేపి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రానికి వచ్చిన ధాన్యం పరిమాణం, ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం, తేమ శాతానికి వచ్చి ఇంకా తూకం వేయాల్సిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత తేమ శాతానికి రాగానే ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని, లారీల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతకుముందు కలెక్టర్ జాఫ్రాపూర్ గ్రామంలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వస్తున్న ధాన్యం లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల వద్ద వేచి ఉన్న లారీల వివరాలు, అన్‌లోడింగ్ వేగంపై అధికారులను ఆరా తీశారు. వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం అన్‌లోడింగ్‌లో ఏలంటి ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచి ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్ల కు స్పష్టం చేశారు. పౌరసరఫరాలు, మార్కెటి ంగ్ రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. మండలం కొరటికల్ గ్రామంలోని రైస్ మిల్లులు, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియలను వెంట వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## పశువుల అక్రమ రవాణాపై.. దూద్ గామ్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** రాష్ట్ర సరిహద్దుల ద్వారా అక్రమంగా పశువులను తరలించే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అనుమానాస్పద వాహనాలను తప్పనిసరిగా తనికీ చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. బుధవారం బక్రీద్ పండుగ సందర్భంగా మెండోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని దూద్ గామ్ చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్ డిస్ట్రిక్ బార్డర్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాత్రి వేళల్లో రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించడం, బారికేడ్లు, హెచ్చరిక లైట్లు వినియోగించడం, వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో నిలిపి తనిఖీలు నిర్వహించడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు.ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ రూరల్ సిఐ జాన్‌రెడ్డి, మెండోరా ఎస్ఐ సుహాసిని, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఉప్పులింగాపూర్‌లో రైతుల ఆగ్రహం

ధాన్యం బస్తాలకు నిప్పు



**ప్రజాపక్షం/వెల్దుర్తి :** ధర్నా రాస్తారోకో వంట వార్పు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో తెలంగాణ సర్కార్ నిర్లక్ష్య వైఖరి తో విసుగు చెంది రోజుల తరబడి తూకం వేయకపోవడంతో న రైతులు కన్నెర్ర చేశారు అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నడిరోడ్డుపై ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు వంటావార్పు చేశారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామంలో ఈ ఘటనచోటుచేసుకుంది. దీంతో ఆక్రయించిన రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్దుర్తి మెదక్ ప్రధాన రహదారిపై బైటాయించి వంటావార్పు చేపట్టి నడి రోడ్డుపై దాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. అక్కడికి వెల్దుర్తి తహసిల్దార్ శ్రీనివాస్, ఎస్సైలు చేరుకొని రైతులను శాంతింప చేశారు.

## బక్రీద్ పండుగకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

అదనపు ఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కట్టుదిట్టమై బందోబస్త్ ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బందోబస్త్ విధులకు హాజరైన పోలీసు సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన డ్యూటీ పాయింట్లలో సమయానికి హాజరై అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశంచారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతి భద్రతలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. డయల్100 వాహనాలు అత్యవసర ఘటనలకు వేగంగా స్పందించాలని పేర్కొన్నారు. స్పందనలో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పికెట్ విధులో ఉన్న సిబ్బంది అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలనీ ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విధుల్లో ఉన్న సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ద పెట్టాలని, సమయానికి నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో నిష్పక్షపాత ధోరణితో వ్యవహరించాలని తెలిపారు.డిఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు సందీప్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రేణుక రెడ్డి, కృష్ణమూర్తి, మహేష్, రామకృష్ణ, శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- రూ.46.46 లక్షల సొత్తు స్వాధీనం
- జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దేశవ్యాప్తంగా చోరీలకు పాల్పడుతున్న కరడుగట్టిన అంతర్‌రాష్ట్ర నేరస్థుల ముఠాను ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ తెలిపారు. నిందితుల నుండి రూ.46, 46, 600 విలువైన 33 తులాల బంగారం, 71 తులాల వెండి, ఒక స్విఫ్ట్ డిజైర్ కారు, 4 సెల్ ఫోన్లు, రూ.15,200 నగదు, దొంగతనానికి ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బుధవారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను విల్లడించారు. ఈ నెల 23 న ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంటిలో జరిగిన చోరి కేసును పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. సీసీటీవీ పుటేజీలు, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టి విచారణ చేపట్టారు. ఈ ముగ్గురు నిందితులు మహారాష్ట్రలో దొంగలించిన స్విఫ్ట్ డిజైర్ కారుకు నకిలీ నెంబర్ ప్లేట్లు అమర్చడంతో పాటు, ఫేక్ ఫాస్ట్ ట్యాగ్ ఉపయోగించి రాష్ట్రాల మధ్య సంచరిస్తూ పోలీసులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసినట్లు గుర్తించారు. నిందితులు ఈ నెల 23న రాత్రి ఆదిలాబాద్ పట్టణానికి చేరుకొని శాంతినగర్ ప్రాంతంలో చోరీకి పాల్పడిన తర్వాత అదే రాత్రి ఆర్మూర్, ఇందల్వాయి పరిసరాల్లో బస చేశాఉ. మరుసటి రోజు కామారెడ్డి జిల్లాలో చోరికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఎన్నో సార్లు జైలుకు వెళ్లారని ఎస్పీ వివరించారు. బుధవారం ఉదయం 8 గంటలకు స్థానిక సీసీఐ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు కారు ఆపకుండా పారిపోయే ప్రయత్నం చేయగా, పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఆదిలాబాద వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బీఎన్ఎస్ సెక్షన్లు 331(4), 305(ఎ) కింద నమోదైన క్రైం నెం.382/2026 కేసుకు సంబంధించిన 60.700 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు మిగతా చోరీ సొత్తును రికవరీ చేశారు. ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఆర్ఎస్ఐ గోపి, ఎస్సైలు అశోక్, సంజయ్ పాల్గొన్నారు.

## జిల్లాలో విస్తృతంగా 'కార్డన్ అండ్ సెర్చ్'

80 వాహనాలు స్వాధీనం

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే ధ్యేయంగా పోలీసులు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల, ఐపిఎస్ ఆదేశాల మేరకు సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామంలో పోలీసులు, భారీ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సోదాల్లో సరైన పత్రాలు లేని 75 ద్విచక్ర వాహనాలతో పాటు 5 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన పూర్తి అసలు పత్రాలను కలిగి ఉండాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ తనిఖీల సందర్భంగా నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, గ్రామ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై గ్రామ భద్రత, నేరాల నియంత్రణ, యువత భవిష్యత్తు మరియు సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరూ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఇందులో భాగంగానే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 69 ట్రాఫిక్ చలాన్లను అక్కడిక్కడే క్లీయర్ చేయించి రూ. 12655ల జరిమానా నగదును వసూలు చేశారు. దీనితో పాటు గ్రామాల్లో మారకద్రవ్యాల నిర్మూలనకు గానూ పోలీసులు గంజాయి గస్తీ కార్యక్రమాన్ని నిర్వహించి, గంజాయి వినియోగం వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సిసి కేమేరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు ఎంతో ఉపయోగం ఉంటుందని, ముఖ్యంగా ఆస్థి సంబంధిత నేరాల నివారణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని వివరించారు. పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి చట్టవిరుద్ధ పనులకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అవగాహన నిర్మల్ రూరల్ ఇన్స్‌పెక్టర్ కృష్ణ, ఎస్.ఐ.లు శ్రీకాంత్, లింబాద్రి, భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో 'దసరా' తర్వాత తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్ర తొలి సింగిల్ 'ఆయా షేర్' విడుదలైనప్పటి నుంచి సంచలనాలు సృష్టిస్తోంది.

# రీల్

## 'ఆ నింగీ.. ఈ నేల' అంటున్న జగపతిబాబు -లయ



జగపతి బాబు హీరోగా నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'వదలా' తో రాబోతున్నారు. ఈ చిత్రంలో ఆయనతో పాటు లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అకెళ్ల వి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్‌పై కిషోర్ నాయుడు చిరుమమిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, థ్రిల్లింగ్ టీజర్, టైటిల్ ట్రాక్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా చిత్ర బృందం 'ఆ నింగీ ఈ నేల' అనే అందమైన ఫీల్‌గుడ్ ఫ్యామిలీ మెలోడీని విడుదల చేసింది. మనసును హత్తుకునే భావోద్వేగాలతో సాగే ఈ పాట కుటుంబ అనుబంధాలను ఎంతో అందంగా ఆవిష్కరిస్తోంది. కృష్ణవేణి మల్లవజ్జల అందించిన సాహిత్యం పాటకు ప్రాణం పోయగా, కార్తీక్ కోడకండ్ల తన మధుర గానంతో మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. సంగీత దర్శకుడు కార్తీక్ బి.కోడకండ్ల స్వరపరిచిన ఈ మెలోడీ సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది.జగపతి బాబు, లయల మధ్య కనిపించే సహజమైన ఫ్యామిలీ కెమిస్ట్రీ 'ఆ నింగీ ఈ నేల' పాటకు మరింత భావోద్వేగాన్ని తీసుకొచ్చింది. ఈ చిత్రానికి చోటా కె నాయుడు డీవోపీ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్, లక్ష్మీ భూపాల రైటర్. జగపతి బాబు, లయ, హృతికా శ్రీనివాస్, అవసరాల శ్రీనివాస్, రవి వర్మ, జెన్నీ, రీను, కశ్యప్ రాజ్ నటించారు. ఈ చిత్రానికి దర్శకత్వం: ఆకెళ్ల వి కృష్ణ, రచయిత: లక్ష్మీ భూపాల, నిర్మాతలు: కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ పాల్గొన్నారు


## 'కాటాలాన్' గొప్ప సినిమా అవుతుంది

ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నటుడు సునీల్



క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ కాటాలన్ ఈరోజు భారీ పాన్ ఇండియా విడుదలకు రెడీ అవుతుంది. ఈ చిత్రంలో ఆంటోనీ వర్గీస్ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ మార్కో మేకర్స్ నుంచి వస్తున్న ఈ చిత్రానికి కొత్త దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. దుషార విజయన్, కబీర్ దుహాన్ సింగ్, టాలీవుడ్ నటుడు సునీల్, బాలీవుడ్ నటుడు పార్థ్ తివారీ, మలయాళ నటులు జగదీష్, సిద్ధిక్, వ్లాగర్ గాయకుడు హనన్ షా, రాపర్ బేబీ జీన్, హిప్జర్ వంటి భారీ తారాగణం ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సలార్ ఫేం రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇంతకు ముందు విడుదలైన టీజర్ పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రం మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషలలో విడుదల కానుంది. ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. నటుడు సునీల్ మాట్లాడుతూ:పుష్ప తర్వాత నా లైఫ్ ఒక సర్‌ప్రైజింగ్ మోడ్‌లో పడింది. ఏ భాష నుంచి, ఎప్పుడు, ఎలాంటి క్యారెక్టర్ వస్తుందో నిజంగా నాకు తెలియడం లేదు. జైలర్ సినిమా చూసిన తర్వాత కేరళకు వెళ్లినప్పుడు కూడా నాకు తమిళ్‌లో సీన్ పేపర్‌లు ఇచ్చారు. ఈ సినిమాలో నేను 'మారి' అనే కీలక పాత్ర చేస్తున్నాను. ఇది నాకు చాలా తృప్తిని ఇచ్చిన పాత్ర. ఇలాంటి పాత్రను నేను ఇప్పటివరకు చేయలేదు. ఇందులో నేను చేసిన పాట కూడా చాలా బాగా వచ్చింది. షూటింగ్ అనుభవం కూడా ఎంతో మెమొరబుల్‌గా నిలిచిపోయింది. రవి బస్రూర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు మరింత గ్రాండియర్ తీసుకొచ్చింది. ఇది నేను చేసిన అత్యంత ఖరీదైన సినిమాల్లో ఒకటి. ప్రొడక్షన్ పరంగా చాలా భారీగా తెరకెక్కించారు. మే 28న విడుదల అవుతోందని చెప్పారు. నటుడు ఆజాద్, నటుడు కబీర్ దుహాన్ సింగ్ , నటుడు హరీష్ శంకర్ పాల్గొన్నారు.

## జూన్ 19న 'బాలన్-ది బాయ్'




కెవిఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా 'బాలన్ ది బాయ్'. ఈ చిత్రానికి ఆవేశం ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో మంజుమ్మెల్ బాయ్స్ చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా జూన్ 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'బాలన్ ది బాయ్' సినిమాను ఎపి, తెలంగాణలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ పంపిణీ చేసేందుకు ముందుకొచ్చింది. ఈ రోజు మేకర్స్ ఈ విషయాన్ని వెల్లడిస్తూ అన్నపూర్ణ స్టూడియోస్‌తో కొలాబ్రేట్ అవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా 'బాలన్ ది బాయ్' సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి ప్రేక్షకుడికి చేరువ కానుంది. ఈ సినిమా ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవలే 'బాలన్ ది బాయ్' మూవీ ఫ్రాన్స్‌లో జరిగే ప్రఖ్యాత కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితమై, గ్లోబల్ వేదికపై మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. మన నేటివిటీతో సాగే కథా కథనాలతో యూనివర్సల్‌గా ప్రతి ఆడియెన్ మనసును హత్తుకునే భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని దర్శకుడు చిదంబరం తెరకెక్కిస్తున్నారు.

## 'తెల్లపోరి' అంటూ పాడుతున్న హర్షిత్ రెడ్డి




శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన' గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా జూన్ 19 న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమా వన్ సైడ్ లవ్ స్టోరీలో ఉన్న మ్యాడ నెస్ ప్రేక్షకులకు ఆకట్టుకునేలా చూపించబోతోంది. 'దీవాన' సినిమా ఇప్పటికే మ్యూజికల్‌గా సక్సెస్ అవుతోంది. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన 'ఇది ప్రేమా ..ఇది ప్రేమా..' ఛాట్ బస్టర్ కాగా..ఇప్పుడు ఎనర్జిటిక్ టీజింగ్ సాంగ్ 'తెల్లపోరి...' ప్రోమోని మేకర్స్ రిలీజ్ చేశారు. ఫుల్ లిరికల్ సాంగ్ ఈరోజు రిలీజ్ చేయబోతున్నారు.'తెల్లపోరి...' పాటను సంగీత దర్శకుడు ఈశ్వర్ చంద్ స్వరపర్చి, సాహిత్యా న్ని అందించి పాడటం విశే షం. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణిమేగలై , దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ హృషికేశ్ పాస్పల్, డిఒపి వంశీ పచ్చిపులుసు, మ్యూజిక్ ఈశ్వర్ చంద్, డిజిటల్ మార్కెటింగ్ హౌస్ ఫుల్, ప్రొడ్యూసర్స్ వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి, స్క్రిప్ట్, డైరెక్షన్ శ్రీకాంత్ సంగిశెట్టి

## కెమెరా అసిస్టెంట్ నుంచి హాలీవుడ్ వరకు...

### సినిమాటోగ్రాఫర్ కిషోర్

దర్శకుడు ఆలోచనను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించే సినిమాటోగ్రాఫర్. కిషోర్ బోయిడాపు. కెమెరా డిపార్ట్‌మెంట్‌లో చిన్న స్థాయి నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఈయన తెలుగు సినిమాలతో పాటు బాలీవుడ్ హాలీవుడ్ సినిమాల్లోనూ వర్క్ చేసి తనేంటో ప్రూవ్ చేసుకున్నారు. తాజాగా నాగబాబు ప్రధాన పాత్రలో ప్రదీప్ మద్దాలి తెరకెక్కించిన సిరీస్ ''మేము కాప్'లమ్ '' సిరీస్‌తో మన ముందుకు వచ్చి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సిరీస్ జీ5 లో స్ట్రీమింగ్ అవుతోంది.ఈ సిరీస్‌ను కేవలం 17 రోజుల్లోనే తెరకెక్కించటంలో కీలక పాత్రను పోషించిన కిషోర్ బోయిడాపు తన సినీ ప్రయాణం, ఎదురైన సవాళ్లు, సిరీస్‌కి సంబంధించిన ఎన్నో విశేషాలని మీడియాతో పంచుకున్నారు. నా పూర్తి పేరు దుర్గ కిషోర్ కుమార్. మా ఫ్యామిలీ అంతా ఇండస్ట్రీలోనే ఉండటంతో సహజంగానే నాకు ఇంట్రెస్ట్ ఏర్పడి ఉంది. మా నాన్న మమ్మల్ని ఫోటో తీసి.. ఆ ఫోటోలతోనే కథ చెప్పేవారు. అక్కడే నాకు ఈ ఫీల్డ్‌కి రావాలన్న ఇంట్రెస్ట్ వచ్చింది. అలా నాకు కెమెరా మీద చిన్నప్పటి నుంచే ఆసక్తి ఏర్పడింది. 2002లో రవి ప్రసాద్ యూనిట్‌లో కెమెరా అసిస్టెంట్‌గా కెరీర్ స్టార్ట్ చేశా. ఓ నాలుగేళ్ల తరువాత ముంబైకి వెళ్లాను. అక్కడ మొదటి ప్రాజెక్ట్‌గా 'స్లమ్ డాగ్ మిలియనీర్'కి కెమెరా డిపార్ట్‌మెంట్‌లో పని చేశాను. ఆ తరువాత ఇంగ్లీష్ సినిమాలకి కూడా వర్క్ చేశాను. 'మిషన్ ఇంపాజిబుల్ 4' వంటి 15 హాలీడ్ చిత్రాలకు కూడా పని చేసిన అనుభవం ఉంది. 2012లో 'బాయ్ మీట్స్ గర్ల్' అనే సినిమాకి డిఒపిగా పని చేశా. అలా చేస్తున్న టైంలో 2015లో అనిల్ మెహతా జర్నీ స్టార్ట్ అయ్యింది. ఆ జర్నీ 'ఏ దిల్ హై ముష్కిల్' సినిమా నుంచి ప్రారంభమై, 'జెర్సీ' సినిమా వరకు కొనసాగింది. ఈ ప్రయాణంలో మధ్యలో మరో పది సినిమాల్లో కూడా వర్క్ చేసే అవకాశం వచ్చింది. అనిల్ మెహతాతో కలిసి



వన్ ఆఫ్ ది మెయిన్ అసిస్టెంట్‌గా పని చేయడం నా కెరీర్‌లో ఎంతో ఆనందాన్ని, మంచి అనుభవాన్ని ఇచ్చింది. మై నేమ్ శృతి,105 మినిట్స్ వంటి సినిమాల్లో అవకాశం వచ్చినప్పుడు, నేను అనిల్ మెహతాతో మాట్లాడాను. అప్పుడాయన..వెళ్లి నీ సొంతంగా వర్క్ స్టార్ట్ చేయి అంటూ ఎంతో ప్రోత్సాహం ఇచ్చారు. అలా మళ్లీ నేను కెమెరామెన్‌గా నా ప్రయాణాన్ని కొత్తగా ప్రారంభించాను. సింగిల్ షాట్‌లో సినిమా తీయడం అనేది సవాల్‌తో కూడుకున్న పని. హన్సికతో చేసిన '105' సింగిల్ కారెక్టర్‌తో, సింగిల్ షాట్‌తోనే మూవీని చేశాం. ఇందులో ఉన్న శ్రమ ఆడియెన్స్‌కి అవసరం లేదు. ప్రేక్షకులకు సినిమా నచ్చిందా? లేదా? అన్నదే ముఖ్యం. కానీ సింగిల్ షాట్‌లో సినిమా తీయడం అనే దానికి వెనుకున్న కష్టం గురించి ఎవ్వరికీ తెలీదు. ఏ ఒక్క చోట మిస్టేక్ జరిగినా.. మళ్లీ మొత్తం మొదటి నుంచి చేయాల్సి వస్తుంది. మేము కాప్ లమ్ '' మొత్తం షూటింగ్‌ను కేవలం 17 రోజుల్లో పూర్తి చేశాం. ప్రీ ప్రొడక్షన్ లోనే మేం ఓ క్లారిటీతో ఉన్నాం. అలా కో ఆర్డినేషన్‌తోనే సిరీస్‌ని అనుకున్న ముందుగానే ఫినిష్ చేశాం

## 150 మిలియన్+ వ్యూస్ నాని రికార్డ్

హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో 'దసరా' తర్వాత తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్ర తొలి సింగిల్ 'ఆయా షేర్' విడుదలైనప్పటి నుంచి సంచలనాలు సృష్టిస్తోంది. తాజాగా ఈ పాట తెలుగు వెర్షన్‌లోనే 150 మిలియన్ వ్యూస్, 1.6 మిలియన్ లైక్స్ సాధించి నాని కెరీర్‌లోనే అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. విడుదలైన క్షణం నుంచే సోషల్ మీడియా, కాలేజ్ ఫెస్ట్స్, పబ్లిక్ ఈవెంట్స్, డ్యాన్స్ స్టేజీలను షేక్ చేస్తూ ఈ పాట ఒక కల్చరల్ ఫెనామెనన్‌గా మారింది. శ్రీకాంత్ ఓదెల సృష్టించిన రఫ్ అండ్ రస్టిక్ ప్రపంచం, నాని పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ఎర్తీ విజువల్స్, రగడ టోన్, నాని మాస్ డ్యాన్స్ మూవ్స్ పాట ఇంపాక్ట్‌ని మరింత పెంచాయి.ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న 'ది ప్యారడైజ్', ఇప్పటికే 'ఆయా షేర్'తో కొత్త రికార్డులు సృష్టిస్తూ అంచనాలను పెంచింది. నాని ,శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం సృష్టించబోతుంది.



# గురుకులాలను సిద్ధం చేయండి

నిర్లక్ష్యానికి తావివ్వకండి
గురుకుల సంక్షేమ విద్యా సంస్థలపై: భట్టి



ప్రజాపక్షం/ ఖమ్మం : రాబోయే విద్యా సంవత్సరానికి గురుకుల విద్యా సంస్థలను పూర్తి స్థాయిలో సిద్ధం చేయడంతో పాటు అన్ని సీట్లను భర్తీ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రతి గురుకుల విద్యాలయానికి ఇంచార్జి అధికారిని నియమించాలని ఆయన సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో గురుకుల విద్యాలయాల్లో సంక్షేమం, వసతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి ఏడాది గుకుల విద్యా సంస్థల్లో అడ్మిషన్ల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీట్లు పూర్తి కానీ రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. జూన్ 12 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో వసతి విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో అన్ని వసతులతో సిద్ధంగా ఉండాలని మరమ్మతులు అవసరమైతే ఈ లోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి గురుకుల పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలు తెలిపేవిధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. ఇంచార్జీలు ప్రతి నెల గురుకుల పాఠశాలలను సందర్శించి వివరాలు తెలుసుకుని ఒక నివేదిక సమర్పించాలని భట్టి విక్రమార్క సూచించారు . నిరంతరం తనిఖీలను జరిగేవిధంగా చూడడడంతో పాటు వైద్య పరీక్షలు కూడా ప్రతి నెల నిర్వహించాలని ఇందుకు సంబంధించి ఒక నివేదికను సిద్ధం చేయాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్న వాటికి సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అం దుకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని విక్రమార్క సూచించారు. సమీక్షలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, గురుకులాల ప్రాంతీయ సమన్వయ కర్తలు, విద్యా శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీగ్రామానికీ ఇంటర్‌నెట్

తెలంగాణ సహకరిస్తామని
కేంద్ర సమాచార శాఖ మంత్రి
జ్యోతి రాదిత్య సింధియా



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రతిగ్రామానికీ,ప్రతి ఇంటికీ బలమైన హైస్పీడ్ ఇంటర్‌నెట్ అందించాలనే లక్ష్యం సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా హామీనిచ్చారు. తెలంగాణ కోసం భవిష్యత్తును తీర్చిదిద్దే బలమైన నెట్వర్క్ నిమ్మితం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి, కేంద్రం తో ఒప్పందం కుదుర్చుకోవడంతో, నిజమైన డిజిటల్ తెలంగాణకు పునాది పడనుందని తెలిపారు. టిఫైబర్ ప్రాజెక్ట్ అంశంపైన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటి.పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు హైదరాబాద్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ (ఎబిపి) కింద తెలంగాణలో టీఫైబర్ ప్రాజెక్టు అమలుపై చర్చించారు. కాగా ఎబిపిని సజావుగా అమలు చేసే దిశగా ముఖ్యమంత్రి కొన్ని కీలక అంశాలను సింధియా దృష్టికి తీసుకెళ్ళారు. దీనికి సంబంధించిన అమలుపైన ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదలను వేగవంతం చేయడంపై చర్చించారు. మండలం నుండి గ్రామ పంచాయతీ రింగ్ నెట్వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసే అంశంపైన స్పష్టమైన విధానంపపైన కేంద్ర మంత్రి సింధియాతో సిఎం ప్రస్తావించగా దీనిపై సింధియా సానుకూలంగా స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీనిచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు, సిఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటి శాఖ జాయింట్ సెక్రటరీ డి. అనుదీప్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**3089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరణ**

కాగా టిఫైబర్ నెట్వర్క్ ప్రతి గ్రామ పంచాయతీని రింగ్ ఆర్కిటెక్చర్ ద్వారా అనుసంధానించనుంది. రింగ్ ఆర్కిటెక్చర్ ద్వారా ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా, ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సేవలు నిరంతరం కొనసాగుతాయి. తద్వారా గ్రామీణ తెలంగాణకు నిజమైన నిరంతర హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ అందనుంది. మొదటి దశలో దెబ్బతిన్న నెట్వర్క్ ఉన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరణ చేపట్టనున్నారు. అమెండేడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ కింద ఈ గ్రామాలను ఆధునిక, భవిష్యత్తు అవసరాలకు సరిపడే ఫైబర్ మౌలిక సదుపాయాలతో రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలతో సమానంగా అనుసంధానిస్తారని అధికారులు తెలిపారు.

## పోక్సో కేసులో నిందితునికి ఏడేళ్ల జైలు

రూ. 50వేలు జరిమానా

ప్రజాపక్షం/ఖమ్మంలీగల్: ఇంటి బయట ఆడుకుంటున్న ఐదేళ్ల బాలికను ఇంటి పక్కనే ఉంటున్న బోయినపల్లి వీరబాబు (40) మాయ మాటలతో తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన నిందితునికి ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 50వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి బి. శ్రీనివాసరావు తీర్పునిచ్చినట్లు ఖమ్మం గ్రామీణ ఏసిపి తిరుపతిరెడ్డి తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.... 2023 మే 28న ఖమ్మం గ్రామీణ మండలానికి చెందిన బోయినపల్లి వీరబాబు ఓ బాలికను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి టివి సౌండ్ ఎక్కువ పెట్టి లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం 2012 క్రింద కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై మోపిన నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు ప్రాసిక్యూటర్ శరత్ కుమార్‌రెడ్డి వాదించగా విచారణ అధికారులు, ఎస్ఐ వెంకటకృష్ణ, భరోసా లీగల్ ఆఫీసర్ ఎం. ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ ఎం. వెంకయ్య, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్రీకాంత్, హోంగార్డు చిట్టిబాబు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## క్వాడ్ ఘర్షణల పుట్ట

(మొదటి పేజీ తరువాయి)

విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి మా వోనింగ్ బుధవారం మీడియా సమావేశంలో చెప్పారు. ఢిల్లీలో జరిగిన క్వాడ్ సమావేశంపై అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. క్వాడ్ అనేది ఒక ఘర్షణల కూటమి అనీ, చైనా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఈ కూటమి ఆసియాలో చైనా ఎదుగుదలను అడ్డుకునేందుకే ఆవిర్భవించిందని, ఇది మరో ''ఆసియా నాటో'' కూటమి తప్ప మరేమీ కాదని మావోనింగ్ ఘాటుగా స్పందించారు.

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలపై చైనా ఆధిపత్యంపై క్వాడ్ సభ్యదేశాలు సవాలు విసిరాయి. సముద్రజలాలు అంతర్జాతీయ సంపదగా గుర్తించాలని, అది ఏ ఒక్కరి సొత్తూ కాదని, దానిపై అందరికీ అజమాయిషీ ఉంటుందని చైనా పేరు ప్రస్తావించకుండా క్వాడ్ దేశాలు తీవ్రంగా స్పందించాయి. దక్షిణ చైనాలో ఉన్న ఎక్కువ సముద్ర ప్రాంతం తమదేనని చైనా గట్టిగా వాదిస్తూ ఉండటంతో ఈ సమస్య తలెత్తింది. ఫిలిప్పీన్స్, మలేసియా, వియత్నాం బ్రూనీ, తైవాన్ దేశాలు కూడా ఈ ప్రాంతంపై తమ హక్కులకోసం వాదిస్తున్నాయి. తూర్పు చైనా సముద్రంలో కూడా జపాన్‌లో చైనాకు వివాదం ఉంది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి మద్దతు ఇచ్చేందుకు క్వాడ్ మంత్రుల సమావేశం ముందుకు వచ్చింది. సమీప భవిష్యత్తులో ఇండో–పసిఫిక్ ప్రాంతం ఎంతో కీలకమైన వ్యవస్థగా మారబోతోందని భారత విదేశీ వ్యవహారాలమంత్రి జైశంకర్, మారుతున్న అనిశ్చిత ప్రపంచంలో ఈ ప్రాంతం కీలకంగా మారిందని చైనా విదేశీమంత్రి కూడా వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. క్వాడ్ విదేశీ మంత్రుల కూటమిలో భారత్,అమెరికా,జపాన్,ఆస్ట్రేలియా ఉన్నాయి. మంగళవారం ఢిల్లీలో జరిగిన క్వాడ్ సమావేశంలో చైనా పేరు ప్రస్తావించకుండా క్వాడ్ విదేశీమంత్రులు ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సముద్ర కార్యకలాపాలు, చైనా ఆధిపత్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర జలాలు అంతర్జాతీయ సంపద అని, ఎవరి ఆధిపత్యం దానిమీద లేదని హెచ్చరికలు చేశారు. కాగా క్వాడ్ విదేశీ మంత్రుల సమావేశం తర్వాత చైనా విదేశీమంత్రి మాట్లాడుతూ, ఈ విధంగా ప్రత్యేక కూటముల ఏర్పాటును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ క్వాడ్ కూటమిని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఈ కూటమి వైరుధ్యాలతో నిండి ఉందని, ఇది విభిన్న ప్రయోజనాల కలయికతో ఏర్పడిందని విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కీలక ఖనిజాలు,ఇంధనరంగంలో సహకారాన్ని విస్తరించింది. ఇండో–పసిఫిక్ అంతటా సముద్ర నిఘా కార్యకలాపాలను, ఓడరేవు సదుపాయాలను విస్తరించడానికి కొత్త చర్యలను ఆవిష్కరించింది. ఈ సమావేశంలో అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో, ఆస్ట్రేలియా విదేశీమంత్రి పెన్నీ వాంగ్,జపాన్ విదేశీ మంత్రి తోషిమిత్సు మోటెగీ పాల్గొన్నారు.

## 'సర్' సరైందే

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టికల్ 324 కింద రాజ్యాంగ ఆదేశానికి జీవం పోస్తోంది. ఎన్నికల కమిషన్ తన చట్టబద్ధమైన అధికారాలను అతిక్రమించి వ్యవహరించిందని చెప్పలేం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, మే 30 నుంచి 16 రాష్ట్రాలు, వదు కేంద్రపాలిత ప్రాంతాల్లో వడో విడత, చివరి దశ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ప్రతిపక్ష పార్టీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు అయింది.

**ఓటరును నిర్ణయించేది బిజెపినే !**
**సుప్రీం 'ఎస్ఐఆర్' తీర్పుపై యోగేంద్ర యాదవ్**

దేశంలో ఓటేసేందుకు ఎవరు అర్హులు... ఎవరు కాదన్న నిర్ణయం బీజేపీదే అని రాజకీయ కార్యకర్త యోగేంద్ర యాదవ్ అసహనం వ్యక్తంచేశారు. ఓ టు హక్కు రద్దును న్యాయ వ్యవస్థ సమర్థించినట్లుగా సుప్రీంకోర్టు తీర్పు ఉందని అన్నారు. లక్షల మంది ఓటర్ల ఓటు హక్కు హరణను ఈ తీర్పు ఆమోదిస్తుందనే ది వాస్తవమన్నారు. ఇకపై ఒటర్ల జాబితాతో నచ్చినట్లు వ్యవహరించే అధికారం ఎన్నికల సంఘానికి లభించిందని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ కోర్టుకు వెళ్లిన వారిలో ఒకరైన యాదవ్... ఈ వ్యవహారంలో సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన క్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ కేసులో తీర్పు వినేందుకు సు ప్రీంకోర్టుకు వెళ్లలేదని చెప్పారు. తీర్పుకు ముందు అదెలా వెలువడబోతోందన్నది స్పష్టమైందని ఎక్స్ వేదికగా యాదవ్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ రాజ్యాంగబద్ధతపై విచారణను పక్కకుపెట్టేసి... వినియోగదారుల ఫోరం తరహాలో సర్వోన్నత న్యాయస్థానం వ్యవహరించిందని వ్యాఖ్యానించారు. తీర్పులో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చిందని, ఎస్ఐఆర్ అనంతరం ఓటర్ల జాబితాల్లో తప్పులను పట్టించుకోలేదని, దిద్దుబాటుకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని యాదవ్ పేర్కొన్నారు. 'ఈ కేసులో వ్యాజ్యదారుడిగా తీర్పుపై ఆకాంక్ష, ఆసక్తి, ఆత్రుత ఉండాలి కానీ నాకు అలాంటి భావన కలగలేదు. ఎందుకంటే దీని ఫలితం ముందే తెలిసిపోయింది' అని ఆయనన్నారు. విచారణ సమయంలోనూ ఎస్ఐఆర్ కొనసాగడంతో ఈ కేసుకు విలువ లేకుండా పోయిందని అన్నారు. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ చట్టబద్ధమేనని ప్రకటించమన్నది వార్త కాదు... ఇకపై ఓటేసేది ఎవరో నిర్ణయించబోయేది బిజెపి అన్నది వార్త అని యోగేంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని కొన్ని భాగాల్లో ప్రస్తావించిన ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షించే చివరి స్తంభం కూలిపోయిందన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com